# దత్తకవి

డా॥ అనురాధాపాత్దార్



భారతీయ
సాహిత్య

TL
891.461
D 262 P



INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA



*Dattakavi*—Telugu translation by Veldurthy Manikya Rao of Anuradha Potdar's monograph in English, Sahitya Akademi New Delhi (1986

SAHITYA AKADEMI
REVISED PRICE Rs.10 8·00

© తెలుగు అనువాదము; సాహిత్య అకాడెమీ

First Published 1986

TL
891.461
D262 P

సాహిత్య అకాడెమీ
ప్రధాన కార్యాలయం :
రవీంద్ర భవన్, న్యూఢిల్లీ–110 001,

Library IIAS, Shimla
TL 891.461 D 262 P
00117657

ప్రాంతీయ కార్యాలయాలు :
29, ఎల్డామ్స్ రోడ్, తేనాంపేట, మద్రాస్-600 018.
బ్లాక్ V-బి, రవీంద్ర స్టేడియమ్, కలకత్తా–700 029.
172, ముంబాయీ మరాఠీ గ్రంథ సంగ్రహాలయ మార్గ్, దాదర్,
బొంబాయి-440 041,

SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15·00

Indian Institute of Advanced Study
117657
17/12/94
SHIMLA

***Printed at*:**
WELDUN PRESS, 2, Dr. Radhakrishnan Nagar, 1st St, Madras-600 021

అంకితము

నా

తండ్రికి

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | జీవితం | — | 5 |
| 2. | ప్రకృతి కవితలు | — | 17 |
| 3. | పిల్లల కొరకు రాసిన కవితలు | — | 29 |
| 4. | సాంఘిక కవితలు-జాతీయ కవితలు | — | 39 |
| 5 | ప్రేమ కవితలు-గేయాలు | — | 45 |
| 6. | గుణాత్మక వివేచన | .... | 55 |

# మొదటి అధ్యాయం

## జీవితం :

"పుట్టినప్పటి నుంచి నేటి దాకా
ఇరవై మూడు పుటలు తిరగవేశాను
ఇంకెన్ని పుటలు తిరగ వెయ్యాలో
ఎవరు చెప్పగలరు?
ఈ నాడు ఇంకొక పుట -
కొత్తగా తెరిచాను
ఈ పుటలో రాయబడే దాంట్లో
ఎంత మేలో ఎంత కీడో
ఎవరి కెరుక?"

దత్తకవి జీవిత గాథ రాయటానికి పూనుకోగానే సహజంగా ఎదను కలచి వేసే ఈ కవితా పంక్తులు నా మనో ఫలకాన తారాడుతవి. 'ఒక కొత్త పుట తెరచు కున్నది' అనేదే ఆ కవితకు శీర్షిక. దత్తాత్రేయ కొండోఘాటె కవితలతో కూర్చిన ఒక చిన్న సంకలనంలో ఈ పంక్తులు చేర్చబడ్డవి. ఈ కవిత రచన 1898 జనవరి 1 వ తేదీనాడు ఇందూరులో జరిగింది. రెవరెండ్ ఎన్. డబుల్‌యూ. తిలక్ (1861 - 1919) పిల్లల కొరకు బాల బోధ్ మేవా (బాలానందం) అనే పేరుతో ఒక పత్రిక నడిపే వాడు. జనవరి 6 నాటి సంచికలో ఈ కవిత ప్రకటింపబడ్డది. 1898 అంటె పాత మాటె. కాని ఈ కవిత చదువుతూ వుంటె ఈ నాటికీ ఒక రకమైన నైరాశ్యం, శూన్యం, మనో వీధిని ఆవరించుకుంటుంది. ప్రకృతి యొక్క ముడి వీడని జీవన్మరణాల చిక్కు సమస్య ఆత్మ విమర్శకు పురికొల్పుతుంది. ఆలోచనా పూరితమై, దీర్ఘానుభూతి చెందిన ఈ భావాలను కవి, తన తొలి యౌవన దశలోనే వెలిబుచ్చినాడు. ఆ తర్వాత తన జీవిత గ్రంథంలోని ఒకే ఒక పుటను తిప్పకలిగినాడు. అంతటితో ఆయన జీవిత గ్రంథం మూసివేయ బడింది. వినాయక కవి రాసిన ఒక సుదీర్ఘ చారిత్రిక కవితలోని 'వికసించటానికి పూర్వమే మొగ్గను క్రూరహస్తాలు తుంచి వేసినవి' అనే పంక్తులు దత్తకవి అల్ప జీవితాన్ని జ్ఞాపకానికి తెస్తవి. రెవరెండ్

తిలక్, కవి చంద్రశేఖర్, బరోడా ఆస్థాన కవి పి. ఎస్. గోర్హే (1871-1937) వంటి వరిష్ఠ కవులు తమకు అత్యంత ప్రీతి పాత్రమైన మిత్ర సత్తముని కోల్పోయినందుకు రాసిన శోక గీతాలే వారి ఆవేదనకు సాక్ష్యాధారాలు. 'ఓ కవితా ప్రియులారా! దత్తా వెళ్ళిపోయినాడు.' అనే కవితను రెవరెండ్ తిలక్ ఆనాటి ప్రముఖ సాహిత్య పత్రిక 'సువిచార్ సమాగం' 1899 ఏప్రిల్ సంచికలో ప్రచురించినాడు. తన యువ మిత్రుని అకాల మరణానికి ఎంతగానో సంతాపం చెందిన హృదయావేదన ఆ కవితా పంక్తుల్లో ప్రస్ఫుటమవుతుంది.

దత్తా తన చివరి దశలో, చంద్రశేఖర్‌తో సన్నిహిత స్నేహాన్ని పెంచుకున్నాడు. నిజానికి, అసంపూర్ణంగా ఉండిపోయిన తన ఆశలకు - యువ వాంఛలకు చంద్రశేఖర్ హృదయంలో చోటు చేసుకున్నాడు.

"ఏది ఎట్లయినా
నేను బతికి నన్నాళ్ళు
నీ కవితల అందానికి మురిసి పోతాను.
అలా మురిసి పోవటమే నా అదృష్టమనుకుంటాను
ఓ ప్రియమిత్రమా! ఇక మీద
నీ కవితా సాధనాల వైభవంతో
నిన్ను తిలకిస్తాను."

దత్తా మరణంపై చంద్రశేఖర్ అర్పించిన హృదయ విదారకమైన ఈ శోక గీతాంజలికి చలించని వారెవరు?

'సువిచార సమాగం' 1899 ఏప్రిల్ సంచికలో ప్రచురించిన సంతాప ప్రకటనలో సంపాదకులు ఈ విధంగా అభిప్రాయ పడ్డారు: "మన కవి మిత్రులైన దత్తోపంత్ ఘాటె కవితలు పాఠకుల హృదయాలను ఆనందపరచేవి. మిత్రులందరిని అగాధ సాగరంలో ముంచి ఆయన వెళ్ళిపోయినాడు." ఈ ప్రకటన లాంఛనప్రాయంగానే చేయబడ్డదని అనుకున్నా సమకాలీన సాహిత్య ప్రపంచం, ఈ కవిని సరియైన దృష్టితోనే గుర్తించింది అనే నిర్ణయానికి రాక తప్పదు. ఇంతకూ మరణించినప్పుడు ఆయన వయస్సు 23 ఏండ్లు దాటి కొన్ని నెలలు మాత్రమే.

దత్తా జీవితాన్ని గూర్చి పర్యాలోకన చేసినప్పుడు, ఆయన కవితా శక్తికీ, నైపుణ్యానికీ రూపురేఖలు దిద్దటంలో, కుటుంబ జీవితానికి, లౌకిక జీవితానికి సంబం ధించిన సంఘటనల కన్నా సంస్కృత, సంప్రదాయాలకు ఎక్కువ ప్రమేయం ఉన్న దని అనుకోవలసి వస్తుంది. కుటుంబ పరిస్థితులు, పెరిగిన సాంఘిక వాతావరణం మన చిన్నారి కవి హృదయాన చెరగని ముద్ర వేసినవి. ఈ రెంటి ప్రభావానికి కవి యొక్క అత్యంత సున్నితమైన ప్రతిభ వికసించింది.

దత్తా 1875 జూన్ 26 నాడు అహమద్ నగర్‌లో జన్మించినాడు. ఘాటేల స్వగ్రామం - మహారాష్ట్రలోని అహమద్ నగర్ జిల్లాలోని శ్రీ గొండె చిన్న గ్రామం. దత్తా జన్మించటానికి చాల ముందే వారి కుటుంబం అహమద్ నగర్‌లో స్థిరపడ్డది. తల్లిదండ్రులకు దత్తా ఒక్కడే కొడుకు. మానవ ప్రయత్నాల నన్నిటినీ నులిపివేసే దారిద్ర్యంలో జరిగింది దత్తా పుట్టుక. దత్తా తండ్రి కొండోరా నోజి పూనాకు వలస వెళ్ళి అక్కడ అతి కష్టంమీద పొట్ట పోసుకోటానికి సరిపోయే చదువు నేర్చుకో కలిగినాడు. 1870 లో అహమద్ నగర్‌లో స్థిరపడి "ముఖ్త్యార్" (అంటే వకీలు వృత్తి) అవలంబించినాడు. కొండోరానోజి సమర్థుడు. పైకి రావాలనే వాంఛ కలవాడు. అనతి కాలంలోనే తన వృత్తి ద్వారా పేరు ప్రతిష్ఠలు, తగినంత ఆదాయం సంపాదించుకో గలిగినాడు. సుభిక్షంగా ఉన్న ఆ కాలంలోనే ఆయనకు పుత్రుడు జన్మించాడు. భవిష్యత్తులో మహారాష్ట్రలోని చిన్నారి కవిగా పేరు పొందనున్న 'దత్తా' యే ఆ పుత్ర సత్తముడు. కొండోరానోజి అతిథులకు చుట్ట పక్కాలకు, బీద విద్యార్థులకు తన ఇంట ఆశ్రయం ఇచ్చాడు. ఆయన ఇంట్లో అందరికీ స్వాగత సత్కా రాలుసమానంగా లభించేవి. అహమద్ నగర్‌లోని నవీపేటలో నివసించే కొందరు ప్రముఖుల గూర్చి రాసిన ఆ నాటి ఒక హాస్య కవితలో 'కొండోజి ఏ పని చేసినా పెద్ద పెట్టున చేసే బాపతు' అని ప్రశంసించటం జరిగింది. అది వాస్తవం గూడా. అహమద్ నగర్‌లోని కొండోరానోజి ఇల్లు అంటె ఒక సంస్థ అన్న మాట. తన తెలివితేటల వల్లనే ఆయన అహమద్ నగర్ సాంఘిక జీవితంలో ప్రముఖ స్థానం సంపాదించుకున్నాడు. కుల మర్యాదలను అంతగా పాటించేవాడు గాదు. అందుకే ఆయన ఇంటి వాతావరణం పూర్తిగా కొత్త తరహాకు చెందినది కాకపోయినా, ఉదా రంగా వుండేదని మాత్రం చెప్పవచ్చు. దత్తా తండ్రి మితభాషి. క్రమశిక్షణ కఠినంగా పాటించే వాడు. దత్తా తల్లి బాయిబాయి తన ఏకైక పుత్రుని, ఒక వంక మనసారా ప్రేమిస్తూనే తన చుట్టు పరిసరాల్లో ఏం జరిగేదో ఒక కంట కనిపెట్టూ ఉండే తెలివి

గల ఇల్లాలు. దత్తా తండ్రి స్వశక్తితో పైకి వచ్చిన వ్యక్తి కాబట్టి స్థిరచిత్తం కలవాడు. వ్యతిరేకతను సహించేవాడు కాదు. సమర్థులైన ఈలాటి వ్యక్తులమధ్య సాధారణంగా ఏది జరుగుతుందో అదే జరిగింది. అంటె వీరిరువురి మధ్య భావసమైక్యత, కుదరలేక పోయింది. తండ్రికి తన కొడుకు పట్ల సహజంగా ఉండే ప్రేమానురాగాలు స్పష్టంగా వ్యక్తం కావటం అరుదుగా జరిగేది. ఒండొరులు తమ భావాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకోవడం జరిగేది కాదు. ఇది సున్నితమైన చిన్నారి కవి హృదయాన్ని కలత పరచి ఉండవచ్చు. ఇంటి పట్ల విముఖతకు మనో చాంచల్యానికి ఇది ఒకంత కారణమై ఉండవచ్చు గూడా. తరాల అంతరంవల్ల పిల్లల జీవిత సరళిపై ఇటువంటి ప్రభావం కలగటం ఆ కాలంలో మామూలే. ఒక చిన్నారి కవి హృదయం, విప్పారి పరిపూర్ణ వికాసం పొందాలంటె, ఒక చోదక శక్తి వెనుక ఉండి ప్రోత్స హిస్తూ ఉత్తేజ పరచటం అవసరం. ఆరంభంలో ఈ ఉత్తేజాన్ని దత్తా తన తల్లి ద్వారా పొందినాడు. ఆమెది మధురమైన కంఠం. ఆమెకు సంగీతమంటే ఎంతో ఇష్టం. పరశురాం గోడ్బోలె (1799-1874) మహారాష్ట్రలోని కావ్యసంకలన కర్త లలో మొదటివాడు. ఆయన సంపాదకత్వంలో ప్రకటింపబడిన మొదటి మరాఠీ కవితా సంకలనం 'నవనీత్', అందులోని అనేక కవితలు ఆమెకు కంఠోపాఠం. భక్త (పంత్) కవులైన నాందేవ్, తుకారామ్‌ల కృతులు (అభంగాలు) గూడా ఆమెకు కంఠోపాఠం. 'ప్రార్థనా సమాజ్' (బ్రహ్మసమాజం) ప్రచురించిన 'ప్రార్థనా సంగీత్' లోని భక్తిగీతాలతో గూడా ఆమెకు మంచి పరిచయముండేది. తొట్టెలలో ఊగు తున్నప్పటి నుండి ఈ గీతాలు దత్తా చెవి సోకుతూనే వుండేవి. అజ్ఞాతంగానే అవు గాక, స్పందనగల ఆ శిశువు మనో ఫలకంమీద చెప్పుకోదగ్గ ప్రభావం పడ్డది. 'భేండి' వీరి కుటుంబ సభ్యులకు సాధారణమైన వినోద కార్యక్రమం. ఇది సాహిత్య పరమైన ఆట. దీన్ని అంత్యాక్షరి అనవచ్చు. ఇందులోపాల్గొనేవారు రెండు జట్లుగా ఏర్పడతారు. ఒక జట్టులో నుండి మొదట ఎవరైనా ఒక కవిత వినిపిస్తారు. దాని అంత్యాక్షరంతో ఆరంభమయ్యే కవితను అవతలి జట్టులోనుండి ఎవరైనా వినిపించాలి. ఇందులో పాల్గొనే ప్రతి సభ్యునికి ఎన్నో కవితలు నోటికి వచ్చి ఉండాలి. సమ యానికి తగిన కవిత జ్ఞాపకం రాక, ఇరకాటంలో పడ్డప్పుడు అశువుగానైనా చెప్పి సర్దుకోవాలి. దత్తా 14 ఏండ్ల చిరుప్రాయంలోనే ఈ ఆటల్లో పాల్గొనటం మొద లిడినాడు.

విద్యార్థి దశలోనే, క్రైస్తవ మిషనరీలతో సంపర్కం, 'ప్రార్థనా సమాజ్' ఉద్యమంతో సంబంధం వంటివి కొన్ని దత్తా మనసుమీద చెప్పుకోదగ్గ పరిణామం కలుగజేసినవి. ప్రార్థనా సమాజ్ ఛాయలోనే ఆయన ఎదిగినాడు. ఈ రెండూ - మొగ్గ వంటి దత్తా వ్యక్తిత్వాన్ని వికసింప చేయటంలోను, రూపురేఖలు దిద్దటంలోను ప్రముఖ పాత్ర వహించినవి. మరాఠీ బడి పూర్తిచేసి రెండు మూడు ఇంగ్లీషు తరగతులు చదివిన తర్వాత అహమద్ నగర్ మిషన్ ఉన్నత పాఠశాల అధిపతి అయిన పె. జె. స్మిత్ ఆదరపూర్వకమైన ప్రోద్బలంవల్ల, అహమద్ నగర్ మిషన్ ఉన్నత పాఠశాలలో చేర్చబడినాడు. ఆ పాఠశాల నుండే మెట్రిక్యులేషన్, స్కూలు ఫైనల్ పరీక్ష 1890 లో ఉత్తీర్ణుడైనాడు. రెవరెండ్ స్మిత్, ఆయనభార్య మిషన్ పాఠశాలను ఆదర్శ విద్యాసంస్థగా రూపొందించాలని తాపత్రయ పడేవారు. దంపతులిద్దరూ దత్తాపై మక్కువ చూపేవారు. దత్తా హృదయ కమలం ప్రేమస్వరూపులైన ఈ వృద్ధ దంపతుల ముందు వికసింప సాగింది. అనతికాలంలోనే వీరిమధ్య అనురాగ బంధం ఏర్పడ్డది. ఆదివారం నాటి బైబిల్ క్లాసును చాలా మంది విద్యార్థులు ఎగగొట్టేవారు. కాని దత్తా అట్లాకాదు. సక్రమంగా క్లాసుకు పోవటమే గాక బైబిల్‌ను శ్రద్ధతో అధ్యయనం చేసేవాడు. అందుకే అతని కొన్ని రచనల్లో దాని ప్రతిధ్వనులు వినిపిస్తవి. స్మిత్ దంపతులు దత్తాను కొన్ని అమెరికన్ కుటుంబాలతో పరిచయం చేసినారు. 1890 లో దత్త మిషన్ పాఠశాలనుండి మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. రెవరెండ్ స్మిత్ మాటమీద బొంబాయిలోని విల్సన్ కాలేజిలో చేరినాడు. మిషన్ పాఠశాలలోను, రెవరెండ్ స్మిత్ ప్రభావంవల్ల సంఘ సంస్కార విషయంలోను శ్రద్ధ తీసికోవటం, ఇంగ్లీషు సాహిత్యంలోని అందాన్ని ఆస్వాదించటం ఆరంభించినాడు. అదే సమయంలో పెద్దలైన మరాఠీ కవి రెవరెండ్ తిలక్ తన జీవితంలోని అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉన్నాడని తెలుసుకున్నాడు. అప్పుడప్పుడే తిలక్ క్రైస్తవ మతాన్ని స్వీకరించినందువల్ల కొన్ని సంవత్సరాలు భార్య నుండి వేరుగా ఉండటం తటస్థించింది. అప్పుడే రెవరెండ్ తిలక్ దత్తాను కలుసుకున్నాడు. వయస్సులోని అంతరం వారి సాన్నిహిత్యానికి అంతరాయం కలిగించలేదు. దత్తా తల్లిదండ్రులు ఉదారంతో తిలక్‌ను తమ కుటుంబ మిత్రునిగా స్వీకరించటంవల్ల వారి స్నేహం మూడు పూవులు, ఆరు కాయలు కాసింది. దత్తా కవితా సృష్టికి ప్రసవవేదన పడుతున్న తరుణంలో తిలక్ కవితో మైత్రి—లలితమైన దత్తా హృదయస్పందనకు, అనల్పమైన దోహదం చేసి ఉంటుంది.

మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడైన నాటికి దత్తాకు చంద్రభాగా బాయి అనే అమ్మాయితో వివాహమైంది. అహమద్ నగర్‌కు చేరువలోనుండే 'ఘోస్ పురి' అనే ఓ చిన్న గ్రామానికి చెందినరాజమణె కుటుంబానికి చెందినదా అమ్మాయి. పెళ్ళినాటికి ఆమెకు చదువు ఏమాత్రం రాదు. రాయటానికి, చదవటానికి, కుట్టుపని నేర్పించటానికి ఏర్పాటు జరిగింది. కాని వాటిని గూర్చి ఆమె అంతగా పట్టించుకో లేదు. వికసించే తన మనసు రెక్కలు విప్పుకొంటూ కొంగ్రొత్త గగనసీమలు వెతుక్కుంటూ కళాత్మక మైన కవితా స్వప్నాలు కంటూవున్న యువ శృంగార కవికి చదువురాని ఓ పల్లెటూరి పిల్లను జీవితభాగస్వామినిగా చేయటం నిజంగా విధాత విసిరిన విద్యుదాఘాతం. మిషనరీలతో సంబంధంవల్ల స్వేచ్ఛగా స్త్రీ పురుషులతో కలిసి మెలసి తిరగటానికి దత్తా అలవడ్డాడు. దానికి తోడు ఇంగ్లీషు సాహిత్యంతో, అందులో శృంగార కవిత్వంతో పరిచయం కలగజేసికోవటం వల్ల మనోవికాసానికి కొత్త రూపురేఖలు దిద్దుకోసాగినాడు. ఆయన సున్నితమైన మనస్సు అదివరకే శృంగార ప్రణయ తత్వంచే గాఢంగా ఆకర్షింపబడ్డది. ఐనా ఇటువంటి యువతీ యువకులిద్దరు వైవాహిక బంధంతో ముడిపడుట విధి వైపరీత్యం. స్పష్టమైన విభేదాలు, అసహనం ఉన్నప్పుడు, కొంత కాలానికి వారు వేరు పడటంలో ఆశ్చర్యం లేదు. వివాహ బంధంతో ఏకం చేయబడ్డ ఈ యువతీ యువకుల మధ్య ప్రేమ గీతం వినబడలేదు. అనురాగ గీతం ఆలాపించకుండానే ఆగిపోయింది. ఆ కాలంలో సన్నిహిత హృదయం కలవారనేకులు ప్రతిస్పందన లేని వారితో వివాహం చేసికొని, అసహనము వ్యాకులత అనే విష గుళికలను విధిలేక మింగుతూ పోయినారు. విషాదకరమైన విషయమేమిటంటే ఇటువంటి అగ్నిపరీక్ష లప్పుడు సాధారణంగా వధువు నిర్దోషి అయివుంటుంది. సాంసారిక జీవితం నిర్దాక్షిణ్యమై దుఃఖకరంగా పరిణమించటం వల్ల హృదయాలు ఆహ్లాదకరంగా ఉండటం అసాధ్యమవుతుంది. దత్తా నైరాశ్యంతోను, ఆశాభంగంతోను బాధపడ్డాడు. ఆయనది శృంగార స్వభావం కావటం మూలాన మరీ తీవ్రంగా బాధలకు గురి అయినాడు.

ఈ కాలంలో దత్తాను ప్రార్థనా సమాజ ఉద్యమం తీవ్రంగా ప్రభావితం చేసింది శ్రీ కేశవ చంద్రసేన్ బ్రహ్మ సమాజ స్థాపకులలో ఒకరు. ఆయన ప్రోత్సాహంతో, హిందూ మతాన్ని, సమాజాన్ని సంస్కరించాలనే సదుద్దేశంతో బొంబాయిలోని కొందరు విద్యార్థులు ఈ ఉద్యమాన్ని 1867 మార్చి 31 నాడు మహారాష్ట్రంలో ఆరంభించినారు. భగవంతుని ఆరాధించటానికి మార్గం ప్రార్థన సేవ అని వారి నమ్మకం. అందుకే వారి ఉద్యమానికి 'ప్రార్థనా సమాజ'మని నామకరణం చేసినారు.

డా॥ ఆత్మారాం పాండురంగ తర్ఖడ్కర్ సమాజానికి మొదటి అధ్యక్షులు. తరతరాలుగా వస్తున్న కులాల కట్టుబాట్లను నిర్మూలించడం, స్త్రీ విద్యను, పునర్వివాహాలను ప్రోత్సహించడం, బాల్య వివాహాలను నిషేధించడం అనే నాలుగు సూత్రాల కార్యక్రమాన్ని సమాజం చేపట్టింది. సంస్థాపకులు విగ్రహారాధనను విశ్వసించలేదు కాబట్టి, నిశ్చలమయిన భక్తి ఒక్కటే ముక్తి మార్గమని నమ్మినారు. న్యాయమూర్తి రానడే, డా॥ భండార్కర్, శ్రీ ఏ. ఏ. మోదక్, శ్రీ వి. ఆర్. శిండే, శ్రీ చందావర్కర్‌గారలు మహారాష్ట్రలో ఈ ఉద్యమానికి నాయకులుగా ఉండేవారు. పేరుమోసిన సంఘసంస్కర్త రావుబహాదుర్ శివశంకర్ పాండురంగ పండిత్ ఉత్తేజకరమైన నాయకత్వాన అహమద్ నగర్‌లో ఈ ఉద్యమం తీవ్రంగా సాగింది. అప్పుడు దత్తా ఇంకా విద్యార్థిగానే ఉన్నాడు. 1807 ప్రాంతాలలో దత్తా తండ్రి ఈ ఉద్యమంలో చేరినాడు. కొన్ని సంవత్సరాల పాటు నిర్వాహక కార్యదర్శిగా ఉన్నాడు. కొండోరానోజి. ఆయన భార్య బాలుబాయి ఉదారంగా అతిథి సత్కారాలు చేసేవారు. అన్ని కులాలకు, మతాలకు చెందిన సంఘ సంస్కర్తలు, విఖ్యాత విద్యావేత్తలు ఎప్పుడూ వీరి ఇంటికి వచ్చి అతిథి సత్కారాలు పొందేవారు అని అంటే ఆశ్చర్య పడనవసరం లేదు. బొంబాయి, పూనాల నుండి న్యాయమూర్తి రానడే, డా॥ భండార్కర్ వంటివారు; కలకత్తా నుంచి ప్రతాపచంద్ర మజుందార్, శివనాథ శాస్త్రి వంటి బ్రహ్మ సమాజ దిగ్గంతులు, విఖ్యాత వక్తలు, భక్తులు సమాజ వార్షికోత్సవాలలో పాల్గొనటానికి వచ్చేవారు. ఈ లాటి అనేక వ్యక్తులు తరచు ఘాటే ఇంటికి వస్తూనే ఉండేది. కుటుంబ ప్రార్థనా సమావేశాలు తరచుగా జరుగుతూ ఉండేవి. ఈ ఉద్యమ నాయకుల ఉపన్యాసాలు, ప్రార్థనా సమావేశాలు, అహమద్ నగర సాంఘిక జీవనంలో ఒక నవ చైతన్యాన్ని కలుగజేసినవి. దత్తా తన జీవితపు అత్యంత సున్నితమైన దశలో, భగవంతుని కొరకు చిత్తశుద్ధితో, భక్తి గీతామృత పానం చేసి మత్తగిల్లిన మహనీయులకు అత్యంత సన్నిహితంగా ఉండి, సపర్యలు చేస్తూ వారి భావాలను, జీర్ణించుకో కలిగిన అదృష్టవంతుడు. ఆ తర్వాత దత్తా బొంబాయిలో జరుగుతుండే రానడే, చందావర్కర్, భండార్కర్, వవరంగే మొదలైన సమాజ్ ప్రముఖుల ప్రార్థనా ఉపన్యాసాలకు సక్రమంగా హాజరయ్యేవాడు. ఆనాటి ప్రముఖులతో జరిపిన బుద్ధి పరమైన ఆధ్యాత్మిక పరిచయాలు ఆయన మానసిక స్థితిని రూపొందించుకొనటంలోను, విచక్షణా జ్ఞానం పెంపొందించుకోవడంలోను ప్రముఖ పాత్ర వహించినవి. ఆయన సాంఘిక అవగాహన ఒక ఆకారాన్ని పొందుతూ మార్గాన్ని నిర్ణయించుకో సాగింది.

ఈ స్వేచ్ఛాయుత వాతావరణం వల్లనే, ఇతరులేమన్నారో అని గాక, తనంతట తాను ఆలోచించ సాగినాడు.

దత్తా బొంబాయి వెళ్ళి విల్సన్ కాలేజీలో చేరినాడు. ఇల్లు విడిచి దూరంగా ఉండడం ఆయన జీవితంలో అదే మొదటిసారి. ఇన్నాళ్ళుగా ఇంటిపట్టున తల్లి దండ్రుల నీడలో పెరిగిన దత్తా ఇక తన ఇష్టమొచ్చినట్టు ప్రవర్తించసాగినాడు. బంధ విముక్తి చెందిన మనసు ప్రబోధించినట్టు, అడ్డు లేకుండా తిరిగినాడు. కళ, సాహిత్యాల మీదగల ప్రేమ, కవితా హృదయపు విశృంఖల విహారం, విపరీతాలు, ఉద్రేకాలు ఆయన జీవితాన్ని ఆవరించినవి. ఆయన 1891 లో విల్సన్ కాలేజిలో చేరినా, నాలుగేండ్ల వరకు ఇంటర్మీడియేట్ తరగతి దాటిపోలేదు. బొంబాయి నీళ్ళు పడలేదు. తరచు అనారోగ్యానికి గురి అయ్యేవాడు. చికిత్స కొరకు అహమద్ నగర్ వెళ్లేవాడు. ఇప్పుడింత కాలం గడచినాక, బంధనాలు లేనట్టి, శాంతి లేనట్టి ఈ కాలంలో ఆయన జీవితం ఎట్లా వుండేదో సరిఅయిన అంచనా వేయడం కష్టసాధ్యం. ఆయనకు ఇంట్లో ఈడుకు తగిన నేస్తం లేకుండేది. తండ్రి నోరు విప్పి ఏమీ చెప్పకుండానే కొడుకు మీద నిఘా వేసి - అతని వాంఛలను పూర్తిగా అణగదొక్క లేకపోయినా ఆదుపులో మాత్రం ఉంచకలిగాడు. అందుకే దత్తా బొంబాయి జీవితం, అంతకు పూర్వం అదుపులో పెరిగిన జీవితానికి భిన్నంగా ఉండడం సహజమే కాక తప్పనిసరి గూడా కావచ్చు. శ్రీ వి. డి. ఘాటె (దత్తాకుమారుడు, జీవిత చరిత్ర రాసినవాడు) అన్నట్టు "దత్తా యొక్క ఆ కాలం నాటి అస్థిమిత స్వభావాన్ని కనుగొనడం, అతని యౌవనపు ఊహా ముఖమైన వాంఛల ఉద్వేగము ఆ శృంగార కవి యొక్క సున్నితమైన మనో గత భావాలను వెలికి తీయటమే" అవుతుంది. ఈ నాడు ఎవరు గూడా అసంతృప్తి కరమైన పూర్తిగాని కోరికలతో నిండిన మనోగత వాంఛా ఫలసిద్ధికి ఎవరూ సరియైన కారణాన్ని కనుగొనలేరు. బొంబాయిలో అవి ఈడేరడానికి అంతరాయం లేని అవకాశాలు లభించినవి.

ఈ కాలంలో దత్తాను సంగీతం, సితార్ వాదన ఆకర్షించినవి. ఈ కళల్లో ఆయన చెప్పుకోదగ్గ విజయం సాధించినాడు. కళలపట్ల ఆయనకుండే ప్రేమాతిశయం అహమద్ నగర్‌లో ఇంతకు పూర్వం ప్రజల దృష్టికి రావడంతో బాటు కుటుంబంలో గూడ కొంత ఘర్షణకు హేతుభూతమయింది. ఇటు అతని ఇంటిలో ధార్మికమైన వాతావరణం, అటు బొంబాయిలో స్వేచ్ఛాయుత జీవితం, ఈ రెంటిమధ్య దత్తా మనస్సు డోలాయమానంగా ఉండేది. దత్తా బొంబాయి పోయే నాటికి, కవిత్వంలో

ఇంకా స్థాయినీ, పరిపక్వ దశను పొంది ఉండలేదు. అక్కడి స్వేచ్ఛాయుత జీవితంలో మొదటి సారిగా, అప్పుడే తల్లిగర్భం నుండి బయటపడి, మొదటిసారి స్వేచ్ఛా వాయువు పీల్చుకున్న కోడెదూడలా పొంగిపొరలె ఆయన కవిత్వధోరణి ఉత్సాహంతో గంతులు వేయసాగింది. ఈకాలంలో ఆయన గ్రంథపఠన బహుళంగానే కాక వైవిధ్యంతో కూడుకున్నదిగానూ ఉండేది. 1896 లో ఆయన బొంబాయి వదిలి ఇందూరులోని మిషన్ కళాశాలలో చేరినాడు. ఆ రోజుల్లో అది కలకత్తా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉండేది. దత్తా ఇందూరులో తన శ్రద్ధను విద్యాభ్యాసం మీదనే పూర్తిగా కేంద్రీకరించి 1898 లో, 22 వ ఏట పట్టభద్రుడైనాడు. అంటే ఆయన కళాశాలలో చేరినాక 8 సంవత్సరాల కన్న మాట. హడావుడితో నిండిన బొంబాయిలో కన్న ఇందూరులోని ప్రశాంత వాతావరణంలో దత్తాకు మానసిక శాంతి లభించింది. ఈ కాలంలోనే దత్త సంగీత సాధనకు మనఃపూర్వకంగా పూనుకున్నాడు. ఆయన స్నేహితులు కవిత్వంతో బాటు ఆయన కళా ప్రావీణ్యాన్ని కూడా గుర్తించినారు. ఆయన సంగీతాన్ని ప్రేమించేవాడు కాబట్టి ఆయన కవిత్వంలో సంగీత సుధ ఒలుకుతూ ఉండేది. ''సరస్వతి కన్న ఎక్కువ మధురంగా పలికే నీ సితారు శాశ్వతంగా మూగవోయింది గదా!'' అని, అకాల మరణానికి తమ సంతాపాన్ని వెలిబుచ్చుతూ, ఆయన సంగీత నైపుణ్యాన్ని గూర్చి మెచ్చుకున్నారు. దత్తా యొక్క అనేక కవితలు ఇందూరులో నివసించిన కొద్దిపాటి కాలంలో రచించినవే. పట్టభద్రుడైనాక దత్తా అహమద్ నగర్‌లో ఎక్కువ కాలం ఉండలేదు. అక్కడి స్తబ్ధజీవితం దత్తాకు నచ్చలేదు. అది బరోడా, మహారాజుగారి పాలనలో ఉండేది. అందుకని ఆ రోజుల్లో మరాఠా యువకులు చాలా మందికి అక్కడ ఉద్యోగావకాశాలు లభించేవి. దత్తా బరోడా చేరుకున్నాడు. దామోదర్ సేట్ యందే నిర్వహణలోని 'సయాజి విజయ్' అనే వార పత్రిక స్థానిక కార్యాలయం అక్కడే ఉండేది. ఆ రోజుల్లో, అది, బరోడాలోని మేధావుల కేంద్రమనిపించుకునేది. 'సయాజి విజయ్' కు దత్తా రాయటం మొదలిడినాడు. ఇప్పుడు దత్తా సంపూర్ణ యౌవన దశలో ఉన్నాడు. సర్వశక్తి సామర్థ్యాలు అత్యంత ఉచ్ఛదశలో ఉండి, విజయపతాక ఎగురవేయటానికి క్రొంగ్రొత్త లోకాల అన్వేషణ సాగిస్తూ ఉన్న యోగకాల మది. ఆ సంవత్సరం 'ప్యారిస్' లో ప్రపంచ ప్రదర్శన ఏర్పాటయింది. అందులో భారతీయ వాద్యగోష్ఠి జరుపటానికి పథకం వేయటం ప్రారంభించినాడు. ఆయన భవిష్యత్తు వాగ్దానాలను, ప్రస్తుత వాస్తవాల రూపు ధరింప చేయదలచినాడు. ముందుచూపు చూస్తున్న బరోడా ఆయనను

అన్ని దిశలనుండి ఉత్తేజపరచ సాగింది. దత్తా ప్రపంచాన్నే అరచేతిలో పెట్టుకో టానికి సంసిద్ధుడవుతున్నాడు. మహాకవి భవభూతి రచించిన 'ఉత్తర రామచరిత్ర' ను మరాఠీలో అనువదించటానికి పూనుకున్నాడు. భవభూతి ఎనిమిదవ శతాబ్దపు సంస్కృత కవి. అతని కృతులలో ఇది ఉత్తమోత్తమమయింది. (ఇందూరు మహారాజైన శ్రీమంత్ శివాజిరావు హోల్కర్ చేసిన ఒక ప్రకటనను పురస్కరించుకొని కాళిదాస మహాకవి మేఘదూత కావ్యాన్ని మరాఠీలో నాటకీకరణ చేసినాడు. కాని ఇందూర్ స్టేట్ రికార్డులనుండి వ్రాత ప్రతి పోయింది. (అది ఈనాటికీ దొరకక పోవడం దుర దృష్టకరం). ఉత్తర రామచరిత్ర రచిస్తున్న కాలంలో, 19వ శతాబ్దపు ఆధునిక మరాఠి కవిత్వం ఆయనను ఆకర్షించింది. ఆయన స్వయంగా ఒక నిసర్గైన ఆరా ధకుడు. 18వ శతాబ్దపు విఖ్యాత షామీర్ (కవి) అయిన రాంజోషి వరకు, పరశురాం పంత్ తాత్యాగోడ్బోలే, మరాఠి కవితా సంకలనాన్ని 'నవనీత్' అనే పేరుతో ప్రకటించి నాడు. ఆ తర్వాతి కవులను గూర్చి ఎవరూ పట్టించుకోలేదు. ఆనాటి దిన, మాస, పత్రికలలో ఛెదురు మదురుగా విస్మృతి పథంలో ఎక్కడో పడి ఉన్న ఆ కవుల రచన లను సేకరించి, పరశురాం తాత్యా ఆరంభించిన దాన్ని సంపూర్తి చేయాలనే మహ త్కార్యానికి దత్తా పూనుకున్నాడు. ఈ ఉద్దేశ సాధనకుగాను గత కవులను గూర్చి, అప్పుడున్న వారిని గూర్చి విమర్శనా పూర్వకమైన పరిశీలన ప్రారంభించినాడు. అందు కొరకు సమకాలీన కవులతో పత్ర వ్యవహారం సాగించినాడు.

రెవరెండ్ తిలక్ ఆధునిక మరాఠీ కవితాజనకులైన కేశవసుత్ తమ రచనలను సంకలనంలో చేర్చటానికి దత్తాకు పంపినట్టు సాక్ష్యాధారాలున్నవి. 19వ శతాబ్దపు కవితాఖండాలను ఒకే సంకలనంలో ఏరి కూర్చటానికి పూనుకోవటం ఇదే ప్రథమ ప్రయత్నం అనవచ్చు. ఇంతటి మహత్తరకార్యభారాన్ని తన భుజస్కంధాలపై వేసు కున్న నవయువకుడైన దత్త అంతటి లేతవయసులోనే, సమకాలీన మరాఠి కవిత సంప్రదాయాన్ని కట్టుబాట్లను త్యజించి ఏవిధంగా తిరుగుబాటు చేసిందో, సరికొత్త దృక్పథం ఏమిటో దత్త అవగాహన చేసికోకలిగినాడు. అట్టి అవగాహనశక్తి లేక పోతే, చెప్పుకోతగినంత విస్తృతమైన సేకరణకు పూనుకొని ఉండేవాడుకాదు. కాని దత్తా అకాలమరణంవల్ల ఆయన తలపెట్టిన అనేకప్రణాళికలు, కన్నటువంటి అనేక కలలు అసంపూర్తిగానే ఉండిపోయినవి. ఆయన మిత్రుడు చంద్రశేఖర్ శివరాంగోర్హే దత్తా ప్రారంభించిన కవితా సంకలనకార్యాన్ని పూర్తిచేసి 'అర్వాచీన కవిత' అనే శీర్షికతో 1903 డిసెంబరు 23 న ప్రకటించి, అట్టి కవితాసంకలనాన్ని కీర్తిశేషుడు, తన కవిమిత్రుడు అయిన దత్తాకు అంకితం చేసినాడు. విచిత్రమేమిటంటే చంద్ర శేఖర్ సంకలనంలో రెవరెండ్ తిలక్, కేశవసుత్‌గారల కవితలు చోటు చేసికోలేదు.

అందుకు కారణం, చంద్రశేఖర్ సంప్రదాయ కవితావాదికావటంచేత, ఆధునిక మరాఠీ కవితలోని అందాన్నిగాని, శక్తినిగాని మెచ్చుకోలేకపోవటమే అయిఉంటుంది. ఏది ఏమైనా ఎంత తీవ్రంగా ఆధునిక మరాఠీ కవిత దత్తాను ఆకర్షించకలిగిందో, ఆయన దాని ఉత్కృష్టతను ప్రజలచే గుర్తింపచేయటానికి ఎంత ఆరాటపడేవాడో, ఈ ప్రయత్నంవల్ల స్పష్టమవుతుంది.

1899 న బరోడాలో బ్యూబానిక్ ప్లేగ్ అనే అంటుజాడ్యం తీవ్రంగా వ్యాపించింది. చంద్రశేఖర్ తన సోదరునితోబాటు బరోడాపట్టణంవదిలి ధర్మశాలకు మకాం మార్చినాడు. కాని దత్తామాత్రం తనమిత్రుడు భాపు సాహెబ్ దిఘేతో బరోడాలోనే ఉన్నాడు. దత్తా రాత్రిళ్ళు మైలు మైలున్నర చలిలో నడిచి, చంద్రశేఖర్ తాత్కాలికంగా విడిది చేసిన ధర్మశాల వచ్చేవాడు. అక్కడ మిత్రులిద్దరూ తనివితీరా కవితా రసాస్వాదన చేసేవారు. ఇట్టి విపరీతపరిస్థితుల్లో, చుట్టూ మృత్యుదేవత తాండవం చేస్తుండగా కవిమిత్రుని సాన్నిహిత్యంలో, దత్తా తన నవ్యకవితావీధులను విశాల ఆకాశంలో వీక్షించ కలిగినాడు. ఈకాలంలోనే 'తన్మయింపజేసే మధుమాసపు వీచికలు వీచినవి, ఇక రాత్రి 'ప్రభాతం'గా మారింది. 'ముగ్ధకళిక' 'బాల లతిక'తో ప్రేసయ్యాటలాడింది. 'కోకిల్ కూజిత్' ప్రేమస్వరాలు ఆలాపించింది. అంతే గాదు. ఈకాలంలోనే 'ఉత్తరరామ చరిత్ర' అనుసరణ ఓ రూపాన్ని దాల్చసాగింది.

తాను ఎంతగానో ప్రేమించిన జీవితానికి వీడుకోలు చెప్పుకునేరోజులు సమీపిస్తున్నవి. కాని దత్తా తాను కవితామృతం సేవించినట్టు ప్రేమస్వప్నాలతో ఉజ్వలమైన భవిష్యత్ప్రణాళికారచనలలో మునిగిఉన్నాడు, మృత్యుదేవత ఈ అన్నిటిని పెడచెవిన పెట్టింది. నానాటికి మెల్లమెల్లగా సమీపిస్తూనేఉన్నది. ఈ అంతిమకాలంలో రెండు మహత్తర గీతాలు రాసినాడు. మొదటిది 'విశ్వామిత్ర నది తీరాన' అనేది. రెండవది 'ప్రేమించే నిరుపేద మాతృమూర్తి' అనే ఆవేదనతోకూడిన గంభీరమైన జోలపాట. 1899 మార్చిలో దత్తా ప్లేగుతో పడిపోయినాడు. ఆ వర్ధమానయువకుని పొంగుతూవచ్చే స్వప్నాలను రూపుమాపాలనే ప్రయత్నంలో మృత్యువు బహుశః పొరపడి ఉండవచ్చుననే అనుమానం కలుగుతుంది. కారణం, నాలుగురోజులకే రోగ లక్షణాలుమారి ఆరోగ్యచిహ్నాలు పొడసూపినవి. పడకచుట్టు గుమిగూడిన మిత్రులు గండం గడతేరిందని, సంతోషించినారు. ఎన్నడో వినతిపత్రం పెట్టుకున్న స్టేటు సర్వీసులోని ఒక ఉన్నతపదవిమీద దత్తాను నియమించిన ఆజ్ఞాపత్రం ఆరోజే చేతికందింది. కాని విధివిలాస మెంత క్రూరమైందో! మరునాడే ఆయనపరిస్థితి విషమించింది. జ్వరం తీవ్రమైంది. దత్తా స్మృతి తప్పినాడు. జ్వరం బాధ విపరీతమైంది.

అయినా అప్పుడే తాను అసువులు బాస్తానని దత్తా అనుకోలేదు. పడక పక్కన కూర్చున్న మిత్రులు కంట తడిపెట్టుకుంటూ 'ఇక ఋణం తీరింది' అనుకున్నారు. కాని దత్తా మాత్రం 'మీరు భయపడకండి' అని ధైర్యం చెప్పినాడు. అది ఒక పరీక్ష రాత్రి. అంతిమ ఘడియలు సమీపిస్తున్నవని అందరికి తెలిసిపోయింది. చంద్రశేఖర్ అన్నగారైన నానాసాహెబ్ కోర్టుకుపోతూ రోగిని పరామర్శించటానికి వచ్చినాడు. మృత్యుశయ్యపైనుండె దత్తా, 'క్షమించండి. నానాసాహెబ్ మీరు వచ్చినారు. కాని నేను ఈవిధంగా పడకలో ఉన్నాను' అని వాపోయినాడు. మృత్యుగహ్వరంలో ఉన్న దత్త సౌమ్యస్వభావానికి అక్కడున్న మిత్రులు ఎంతో చలించిపోయినారు. అప్పటికి దత్తా 'తాను ఇక చనిపోతా'నని గుర్తించకలిగినాడు. చనిపోతూఉన్న ఈ చివరిఘడియల్లో ఆ యువకహృదయాన ఎన్ని జ్ఞాపకాలు, ఎన్ని భావాలు తారాడినాయో ! ఆయనకు జ్ఞాపకమున్న మేరకైనా చెప్పటానికి నోరాడలేదు, ఆయనభావాలు శబ్దరూపం దాల్చలేకపోయినవి. ఆయన ఏకైక 'నిధి' అయిన కవితల వ్రాతప్రతులనుతీసి వణుకుతూఉన్న చేతులతో చంద్రశేఖర్ చేతుల్లోపెట్టూ 'భద్రపరచండి' అనిమాత్రం అనకలిగినాడు. కవితల ఒక చిన్నపుస్తకాన్ని మిత్రునిచేతుల్లోపెట్టూ పూర్తి చేయలేని తన కలలను బహుశః జ్ఞాపకానికి తెచ్చుకుంటూ దత్తా 1899 మార్చి 13 వ తేదీన లోకం నుండి సెలవు తీసికున్నాడు. ఆయన కవిత్వమూ, సితారూ, మూగవోయినవి; ఆయన నిష్క్రమించటాన్ని మౌనంగా గమనించినవి. నిజానికి అవి కూడా ఈపాటికి చనిపోయినట్టే. ఎందుకంటె ఇకమీద వాటిని పలికించేవాడే లేడు.

ఈవిధంగా నవయౌవనదశలో ఆధునిక మరాఠీ కావ్యప్రపంచానికి మార్గదర్శి అయిన కవి అస్తమించినాడు. ఆయన దివంగతుడైనాక 22 సంవత్సరాలకు, అంటే 1921 లో ఆయన కుమారుడు వి. డి. ఘాటే (స్వయంగా ఈయనకూడా పేరు మోసిన సాహితీవేత్త) దత్తాగారి కవితలను సంగ్రహించి, సంపాదించి ప్రకటించినాడు. తద్వారా మరాఠీ పాఠకలోకం దత్తా నిజమైన కవితాప్రతిభను తెలుసుకోకలిగింది. ఇది హఠాత్తుగా చెదిరిపోయిన దత్త కవియొక్క అత్యల్పజీవితపు దిఙ్మాత్ర పరిచయం. ఆయన అత్యల్ప జీవితాన్ని సింహావలోకనం చేస్తే, దత్తా తన జీవితంలో ఆయిదు మొదలు ఏడు నిండుసంవత్సరాలుమాత్రమే క్రియాశీలంగా గడిపినాడని స్పష్టమవుతుంది. ఆయనజీవితం కొద్దిపాటికాలానికే పరిమితమై ఉన్నా మరాఠీ కవిత్వంమీద మాత్రం ఆయన అనల్పమైన ప్రభావం శాశ్వతంగా వేసినవిషయం ముమ్ముందు అధ్యాయాల్లో మనం చూడగలం.

# రెండవ అధ్యాయం

## ప్రకృతి కవితలు :

ఏ కాలంలోనైనా పురోగామియైన ఏ భాషలోని సాహితీ సంపదను పరికించినా ప్రకృతిని గూర్చి గాని, కవికి ప్రకృతితో గల సంబంధాన్ని గూర్చి గాని, రాసినవే ప్రముఖమైన భాగాన్ని ఆక్రమిస్తవి. ప్రేమ తర్వాత, కవుల ఆలోచనా సరళికి ఆలంబనమైన విషయం ప్రకృతే. ప్రకృతి అనేక స్వరూపాలలో మానవ మేధస్సుపై ప్రభావం కలుగజేస్తూ కవితా స్ఫూర్తికి కారణభూతమవుతుంది. ఈ సాధారణ సూత్రానికి మరాఠీ భాష అపవాదం కాజాలదు. అందుకే అనాదినుండి అనేక రీతులలో మరాఠీ కవులు ప్రకృతిని గూర్చి రాస్తూ ఉండటం మనం చూస్తున్నాం. ఒకొక సారి కవి ప్రకృతిని గూర్చి కేవలం సంప్రదాయ సిద్ధంగా ఆలోచిస్తాడు. విషయాలంకరణకు తప్ప అది మరొకందుకు పనికిరాదు. మరొకసారి కవి చిత్తవృత్తియొక్క ప్రతిబింబమై భావోద్వేగంతో తగు శబ్దజాలాన్ని సంతరించుకుంటుంది. మరొకసారి, కవి, ప్రకృతియొక్క మోహనరూపాన్ని అక్షరబద్ధం చేస్తాడు. ఆ విధంగా అతడు సృష్టించిన రూపం అందంగా, సువాసనలు వెదజల్లేదిగా, పట్టుబట్టవలె మెత్తని స్పర్శ సౌఖ్యమిచ్చేదిగా ఉంటుంది. మరొకసారి కవి తన భావోద్వేగాన్ని నొక్కి చెప్పటానికి లేక ఉన్నత పరచటానికి ప్రకృతిని పార్శ్వభూమికగా నిలుపుతాడు. మన వైదిక సాహిత్యంలో ఉషస్సు, వరుణ, మరుత్ - మొదలైన భూతముల ఆవాహనలో, వైదిక ద్రష్టలు అదృశ్యమైన దైవస్వరూపాన్ని తిలకించేవారు. 'మేఘదూత' 'ఋతు సంహారం' వంటి సుదీర్ఘ, సంస్కృత, ప్రాచీన సాహిత్య రచనలలో కవి ప్రకృతిపై తనకు గల ప్రేమను, గౌరవాన్ని వ్యక్తపరుస్తాడు. ప్రకృతి ఎన్ని భంగిమలలో మారుతుందో, అన్ని స్వరూపాలలో ప్రకృతిని శబ్దాలలో చిత్రిస్తాడు కవి. నిజానికి ప్రకృతిని గూర్చి మానవుడు సృష్టించిన భావాలకు గాని, ఉపమానాలకు గాని అంతు అంటూ లేదు.

మరాఠీ, సంస్కృత కవులు భక్తికావ్యాలలో ప్రకృతిని గూర్చి ప్రస్తావించినా, దానికి రెండో స్థానమే ఉండేది. 13వ శతాబ్దం తర్వాత జ్ఞానేశ్వర్, నామదేవ్, తుకారాం, మొదలైన ఇతర భక్త (సంత్) కవుల అభంగాలలో సంపూర్ణ భక్తిభావం, భగవంతుని సాన్నిధ్యాన్ని చేరే తీవ్రమైన అభిలాష వ్యక్తమవుతుంది. ఇక్కడ గూడా మనం ప్రకృతినుండి అనేక ఉపమానాలను, ఉత్ప్రేక్షలను, భౌతిక అనుభవాలను చిత్రీకరించటానికి ఉపయోగించడాన్ని గమనిస్తాము. జ్ఞానదేవుని జ్ఞానేశ్వరి, భగవద్గీత యొక్క మొదటి వ్యాఖ్యానం. అయితే జ్ఞానేశ్వర్ పిసలైన కవి గూడా. లోతైన

ఆది భౌతిక అనుభూతిని ప్రకృతిలోని సుందర దృశ్యం ద్వారా వర్ణించడంలో ఉద్దండుడు. ఈ విధంగా మనం జ్ఞానేశ్వరితో తుమ్మెదతో పరిచయం చేసుకుంటాం. తుమ్మెద సుకుమారమైన మెత్తని కమల పత్రాలకు ఏ మాత్రం హాని కలిగించకుండా వాలుతుంది. తాను గూడా కమలపుష్పంలో బందీ అయిపోవటం చేత గాలి గూడా వీచని ప్రశాంత వాతావరణంలో ఓల లాడుతుంది. ప్రకృతిని గూర్చిన ఇటువంటి కొన్ని ఉపమానాలు, ఉత్ప్రేక్షలు ప్రాచీనసంస్కృత సాహిత్యంలోనుండి వచ్చినవంటే ఆశ్చర్య పడనవసరం లేదు. మరొక సంత్‌కవి సమర్థ రామదాసు. ఎత్తయిన పర్వత శిఖరాలనుండి పడే జలపాతంవల్ల కలిగే ధ్వనిని వర్ణించినాడు. ఐతే మనం మరాఠీ జానపద గాయకుల కంఠంనుండి ప్రకృతిగురించిన అందమైన ఉపమానాలు వింటాము. వారి ప్రేమగీతాలలో సరియైన వ్యక్తిత్వాన్ని, భావాన్ని ప్రదర్శించటానికి తరచు ప్రకృతినే ఆశ్రయిస్తారు. మరాఠీ గేయాలలో నాయిక, తన ప్రియుని - ఉరుముతూ ఉన్న కారుమేఘంతో పోలుస్తుంది. అవును మరి ఇద్దరి మనోప్రవృత్తి ఊహాతీతము గదా! మరాఠీ పండితకవులు రచించిన ప్రకృతికవిత, సంస్కృత ఛందోబద్ధమై, సంప్రదాయ సిద్ధమైన సుదీర్ఘ వర్ణనలు కలిగి ఉండేవి. అందుకే వామన పండిత్, సాంరాజ్, రఘునాథ పండిత్ తదితర పండిత కవుల రచనల్లో సుదీర్ఘమైన ప్రకృతి వర్ణనలు కనబడుతవి. వీరి కవితల్లో ఉపమాన, ఉపమేయాలు, ఉత్ప్రేక్షలు, దీర్ఘసమాసాలు ఎంత దట్టంగా ఉన్నాయంటె వాటివి తొలగిస్తే తప్ప అసలు ప్రకృతి రామణీయకతను తిలకించటం నిజంగా కష్టసాధ్యం. మనిషితో నిమిత్తం లేకుండా వాస్తవానికి ప్రకృతికి, ప్రత్యేకమైన జీవితవలయ మొకటున్నది. అది పునరావృత్తమవుతూ ఉంటుంది. ఆగాషె, మోగ్రె, కీర్తికర్ వంటి బ్రిటిష్ యుగారంభం (1825 - 1874) నాటి మరాఠీ కవులు, సంస్కృత కవిత్వం యొక్క సంప్రదాయాన్ని ఒప్పుకున్నారు. అయినా, తమ కవితలలో ప్రకృతి ప్రతిభావంతమైందని, శక్తివంతమై మార్గదర్శక శక్తిగలదని గుర్తించినారు. వారి నైసర్గిక కవిత్వం ఆడంబర పదజాలంతో చిత్రింప బడ్డది. కాళిదాసు ప్రభావం, 'సుభాషిత రత్న భండార్' ప్రభావం వీరిపై నిక్కచ్చిగా పడ్డది. అయితే ఈ సంప్రదాయక కవిత్వంలో, కవిత్వ లక్ష్యాన్ని సింగారించటానికి అసహజమైన, అప్రాకృతికమైన అలంకరణోపకరణాలు వాడుతారు అనే విషయం స్పష్టమవుతుంది. ఏకాంతంగా ప్రవహించే సెలయేరు, ఆలాపించే మధురమైన సంగీతం వంటి ప్రకృతి సహజస్వరూపం ఎప్పుడోకాని కానరాదు. 1885 ఆ తర్వాత, రెండో తరానికి చెందిన మరాఠీ కవులు సంప్రదాయ పద్ధతులను విదిలించుకొని వర్డ్స్‌వర్త్, కీట్స్, టెన్నిసన్‌ల గేయ కవితలచే ఆకర్షింప బడ్డారు. అందుకే

కేశవసుత్, రెవరెండ్ తిలక్‌ల నైసర్గిక కవితలలో క్రొత్త జాగృతిని చూడ కలుగుతాము.

దత్తా వహించిన పాత్రను తెలుసుకోటానికే పాత పోకడలను విమర్శించవలసి వచ్చింది. ఎందుకంటే, నైసర్గిక కవిత ఆయన మొత్తం కవితా సాధనలో ముఖ్యమైంది. దత్త, కవిత్వం మొదలు పెట్టడం, మరాఠీ ఆధునిక కవితారంభం, దాదాపు ఒకేసారి జరిగినవి. పాశ్చాత్య నాగరికతతో, ముఖ్యంగా ఆంగ్ల శృంగార కవులతో ఏర్పడిన మొదటి సంబంధం, మార్పుకు గురి అవుతున్న ఆ కాలపు రచయితలపై తీవ్రమైన ప్రభావం కలుగచేసింది. మార్పుకు గురి అవుతున్న ఈ సంధికాలంలో అటు ప్రాచీనులు, పూర్తిగా మరుగున పడలేదు. ఇటు అర్వాచీనులు ధైర్యంగా ముందుకు రాలేదు. నిజాని కిది 'కొత్తపాతల మేలుకలయిక' జరిగిన సంధి కాలం.

అందుకని, ఈ కాలంలో వెలపిన కవిత ఎక్కువగా ఆధునికమనీ, ప్రయోగాత్మకమనీ చెప్పాలి. రెవరెండ్ తిలక్ (1861 - 1919), కేశవసుత్ (1866 - 1905) వినాయక్ (1871 - 1919)ల కొత్త కవితలు 'మనోరంజన్', 'కావ్య రత్నావళి', 'సువిచార్ సమాగమ్' మొదలైన సమకాలీన పత్రికలలో ప్రచురింపబడ సాగినవి. చాల మంది కవులు 'గోల్డన్ ట్రెజరి ఆఫ్ సాంగ్స్ అండ్ లిరిక్స్', 'ఒన్ తవ్జండ్ అండ్ వన్ జెమ్స్ ఆఫ్ ఇంగ్లీష్ పోయట్రి' నుండి ప్రభావితులైనారు. దత్తా గూడా 'బర్న్స్', 'వర్డ్స్వర్త్', 'బైరన్' 'షెల్లీ', 'కీట్స్' మొదలగు వారి రచనలతో పరిచయం కలుగచేసుకున్నాడు. దత్తా - కలకత్తా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడైనాడు. ప్రాచీన సంస్కృత కవులను గూర్చి గాని, 19వ శతాబ్దపు పాశ్చాత్య శృంగార కవులను గూర్చి గాని, ఆయన ఏవో కొన్ని పాఠ్యపుస్తకాలు చదివినట్టుగాక, విస్తృతంగాను, లోతుగాను అధ్యయనం చేసినాడు. తత్ఫలితంగా పాశ్చాత్య కవితల నుండి కొత్త భావాలను, ఉద్రేకాన్ని సంతరించుకో గలిగాడు; అలాగే ప్రాచీన సంప్రదాయపు కట్టుబాట్లను, సంస్కృత కావ్యాలనుండి జీర్ణించుకో కలిగినాడు. ఈ విధంగా, ఈ గుణగణాలు ఆయన కవితా వ్యక్తిత్వానికి రూపురేఖలు దిద్దినవి. 'కావ్య రత్నావళి' సంపాదకునికి రాస్తూ "కవిత ప్రగతితోను, మారుతూ ఉన్న కాలంతోను అడుగులో అడుగు వేసి నడవాలి. ప్రాచీన మత సంబంధమైన కథా వస్తువులు ఇకమీద ఆకర్షింపబడవు. ఈనాటి కవితావస్తువులు, గొప్ప చారిత్రిక సంఘటనలు, ప్రకృతి సౌందర్యం, మానవుల భావ తీవ్రతను - జీవం ఉట్టిపడే రీతిగా ప్రదర్శించడం - వీటిని ఆధునిక

మరాఠీ కవితాలోకం ఒప్పుకుంటుంది, గుర్తిస్తుంది గూడా. వీటిని వీలైనంత ఎక్కువగా ఉపయోగించి తీరాలి. పాఠకులను రంజింప చేయటానికి మాత్రమే ఉపయోగించకూడదు. ప్రజలలో ఉత్తమ భావాలను రేకెత్తింపజేసి వారి మనస్సులనూ, భావాలనూ ఉన్నత స్థితికి తీసుకు పోవడమే నిజమైన ఆధునిక కవి యొక్క కర్తవ్యం" అని అభిప్రాయపడ్డాడు. [చూ : 'కావ్య రత్నావళి' సంపుటం II 1899.] 75 సంవత్సరాలకు పూర్వం కవి రాసిన ఈ మాటలు మిశ్రమ భావాలను రేకెత్తిస్తున్నవి. పండిత కవుల ప్రాచీన పద్ధతిలో కవిత్వం కావాలని దత్తా కోరేవాడు కాదనడం సుస్పష్టము. కవిత్వం నీతిబోధకంగాను, వర్ణనాత్మకమయిందిగాను మాత్రమే ఉండక మానవ భావాలను తెలిపేదిగాను, రూపకల్పన చేసేదిగానూ ఉండాలనే సత్యాన్ని గ్రహించినాడు. కాని గేయ కవిత్వంలో ఆత్మ వివరణకు గల ప్రాముఖ్యం గణనీయమయిందని ఆయన అప్పటికి పూర్తిగా తెలుసుకోలేదు. కవిత్వం ఆనంద ప్రాప్తికొరకు మాత్రమే ఉద్దేశింపబడకూడదు అని గూడా ఆయన గుర్తించినాడు. అయితే నైతికంగా కూడా ఉన్నతం కావాలనే తప్పుడు అభిప్రాయం నుండి ఆయన ఇంకా బయట పడలేదు. అయితే ఈ అస్పష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు దత్తా కవిత్వం రూపురేఖలు దిద్దుకుంటున్నదనే వాస్తవాన్ని మనం మరచిపోగూడదు. మొదట అమెరికా మిషనరీలతో, ఆ తర్వాత వారి ద్వారా పాశ్చాత్య సాహిత్యంతో సంబంధం ఏర్పడినందువలన ఆయన చిన్నారి హృదయం ప్రభావితం అయి ఉండవచ్చు. విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు ఈ సంబంధం మరింత సన్నిహితమైంది. ఆయన తన అభిమాన పాశ్చాత్య కవుల అనేక గ్రంథాలను సేకరించినాడు. వారి భావాలను తన కవితల ద్వారా ప్రతిధ్వనింప చేయడాన్ని మనం తరచు చూస్తుంటాము. విల్సన్ కాలేజిలో ఉండగా 'పోప్' మాదిరిగా ఆంగ్ల భాషలో కొన్ని-కొన్ని కవితలు రాసినాడు. స్వేచ్ఛ, ప్రేమ, 'తుఫాను వచ్చిన రోజు' అనేవి కొన్ని ఆ కవితల శీర్షికలు. ఆంగ్లంలో కవితలు రాయడానికి వీలవుతుందో కాదో చూసుకోటానికే ఈ ప్రయత్నం అని స్పష్టం. ఈ రచనలకు కవితాస్థాయి లేకుండేది. కాని దత్తాకు, ఆంగ్ల భాషలో చక్కని ప్రవేశం ఉన్నందువల్లనే ఆయన కవితా రచనకు పూనుకున్నాడని మాత్రం గుర్తిస్తే చాలు. తన అభిమాన కవి గౌరవార్థం రాసిన 'షెల్లీ' అనే ఇంగ్లీషు కవిత నేడు లభించక పోవటం దురదృష్టకరం.

ఆంగ్ల కవులనుండి స్ఫూర్తినంది, వారి కవితారీతిని, కావ్యవస్తువును అనుకరించిన వారిలో దత్తా ఒక్కడే కాదు. వాస్తవానికి కేశవసుత్ నేరుగా ఆరు ఆంగ్ల

కవితలను అనువదించినాడు. అనువాదానికి ఆయన ఇంగ్లీషు కవులలో 'షేక్స్పియర్, 'డ్రమ్మండ్', 'డ్రైడన్', 'స్కాట్', 'ఎలిజెబత్ బ్రౌనింగ్' లను, అమెరికన్ కవులలో 'పో', 'లాంగ్ ఫెల్లో', 'ఎమర్సన్' ల రచనలను ఎన్నుకున్నాడు. సంస్కృత ప్రాచీన కావ్యాలు ప్రాథమిక దశలో కవితారీతిని ఎక్కువగా ప్రభావితం చేసినవి. కాని వాటి స్థానం రానురాను పాశ్చాత్య కవులు, వారి రచనలు ఆక్రమించడం కనిపిస్తుంది. ఆయన, ఆయన సమకాలికులు ఎమర్సన్ మరియు విట్‌మాన్‌ల రచనలపై మొగ్గుచూపినారు. వీరు కృత్రిమ సంప్రదాయాల నియమాలనుండి కవిత్వాన్ని రక్షించాలనే అభిప్రాయం కలవారు. కవిత్వంలో భావప్రకటనకు గేయం ఇప్పుడు సర్వత్రా అంగీకరింప బడినది. ఇది సహజమైన కవితా ప్రక్రియ అని, భావప్రకటనకు సహజమైన శైలి అని తలచబడ్డది. ఈ క్రొత్తశైలి కవితా వస్తువులో గూడా మార్పు కలిగించింది. అందువల్ల కవిత్వం ఇప్పుడు ఎక్కువ స్వగతం, స్వానుభవ ప్రకటనకు సాధనం అయింది. ప్రకృతిని గూర్చి ఉద్దేశించిన కవితలలో ఈ క్రొత్త కవితాస్ఫూర్తి ప్రస్ఫుటమైంది. అందుకే క్రొత్తకవులు 'షెల్లీ' యొక్క విహంగం 'స్కైలార్క్' వెంట ఆకాశవీధుల్లో విహరించినారు. 'కీట్స్' కోకిల (నైటింగేలు) మధుర సంగీతాన్ని ఆలకించినారు. కాని ఆధునిక మరాఠీ కవితాజనకుడైన కేశవసుత్ (1860-1905) శృంగార కవులైన షెల్లీ, కీట్స్‌లకన్న తాత్వికకవులైన వర్డ్స్‌వర్త్, ఎమర్సన్‌లచే ఎక్కువ ప్రభావితుడైనాడు. అందుకే ప్రకృతి సుకరమైనదే కానీ, ఒకొక్కప్పుడు భావోద్రేకాలకు అలంకృత పార్శ్వభూమిగాకూడా ఉంటుంది. అయినా దానికీ ఓ జీవితక్రమమున్నది. అందులో ఎంత వైవిధ్యమున్నదో అది అంత సనాతనమైంది గూడా అని కేశవసుత్ గుర్తించినాడు. మానవజీవితం అసంపూర్ణమైంది. అశాశ్వతమైంది. అందుకే ప్రకృతి మానవజీవితానికి సంతృప్తినీయ కలుగుతుంది. ప్రకృతికి తన జీవితమంటూ ఒకటున్నది. అది మానవునికన్న అతీతమైంది అనే భావాన్ని కేశవసుత్ తర్వాత వచ్చిన కవులు క్రమంగా దూరంచేస్తూ పోయినారు. ప్రకృతిలో పూర్తిగా లీనమైపోయి అందులో తన్నుతాను దర్శించుకున్న బాలకవిని ఎవరు మరువగలరు? కేశవసుత్, దత్తా ఇద్దరూ సమకాలీనులు. 'మనోరంజన్' అనే సాహిత్య పత్రికలో ఇద్దరి కవితలు ఒకేసారి ప్రచురింపబడ్డవి. కాని, కేశవసుత్ ఏ తీరునగూడా దత్తాను ప్రభావితం చేయలేక పోయాడు. 'కేశవసుత్ ఒక పేర్కొనదగిన సమకాలీనకవి' అని మాత్రం దత్తా గుర్తించినాడు. అంతేకాని వారిరువురి మధ్య వ్యక్తిగత సంబంధంలేదు. దత్తాతో సన్నిహిత సంబంధం కలిగిన కవులిద్దరే. వారిలో ఒకరు రెవరెండ్ తిలక్; మరొకరు చంద్రశేఖర్. దత్తా రాసిన బాలకవితలను తిలక్ కొంతవరకు ప్రభావితం



Indian Institute of Advanced Study
117657
17.12.04
SHIMLA

చేస్తే చేసిఉండవచ్చు కాని తిలక్‌యొక్క తాత్విక అహంభావధోరణి దత్తాలో ఏమాత్రంలేదు. దీనికి వారుభయుల స్వభావాలలో ఉండే మౌలికమైన భేదాలే కారణం. ఆనాటి పండితకవులకు ప్రాతినిధ్యం వహించేవారిలో చంద్రశేఖర్ ముఖ్యుడు. సనాతన సంప్రదాయ పద్ధతిలో లీనమై తన ప్రాచీన ఆలంకారిక పద్ధతిని గంభీరంగా ప్రదర్శించేవాడు. కాని మనం గమనించినట్టుగా దత్తా, తూర్పు పడమర ఈ రెంటితోను ప్రభావితుడైనాడు. ఆయనకు ఆంగ్లభాష అంటే ఎంత ఇష్టమో, సంస్కృత సాహిత్యమంటే అంతే మోజు. కాళిదాసు, భవభూతి ఆయన అభిమాన కవులు. వీరి కావ్యాలు దత్తాకు అనేకసార్లు అధ్యయనం చేయడంవల్ల కంఠస్థమైపోయి నవి. ఈ ఇరువురు కవుల ప్రభావం దత్తాయొక్క ప్రేమ కవితలమీద, ప్రకృతి కవితల మీద ప్రస్ఫుటంగా కనబడుతుంది. దత్తా నైసర్గిక కవితలు హృదయాన్ని కదిలించేవిగా ఉండి ఆయన జీవితానికి ఊహలకూ నిజమైన ప్రతిబింబాలుగా కనిపిస్తాయి. ఆయన ప్రేమైక స్వప్నాలు, ఫలించని కోరికలు, శబ్దరూపంలో మనకు సాక్షాత్కరిస్తాయి. అందులో సంస్కృత సాహిత్యంలోని వర్ణనలు, అలంకారాలు ప్రభావం కూడ చూడ కలుగుతాము. ప్రస్తుతం దత్తా రాసిన నలభై ఎనిమిది కవితలు మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. మరణశయ్యపై ఆయన తన మిత్రుడు చంద్రశేఖర్‌కు అంద చేసిన రాతప్రతిలో సుమారు వందకవిత లుండేవి. 1921 లో అంటే 22 సంవత్సరాల తర్వాత, దత్తా కుమారుడు వి. డి. ఘాటె తన తండ్రియొక్క కవితా సంకలనాన్ని ప్రచురించినాడు. తనకు లభ్యమైన అన్ని కవితలను పరిశీలించి సంపుటంలో చేర్చ టానికి నలభై ఎనిమిది కవితలు మాత్రమే ఏరుకున్నాడు. వదిలిపెట్టినవాటిలో కొన్ని అపరిపక్వదశకు చెందినవి. మరికొన్ని శృంగారానికి, భౌతిక అహ్లాదానికి సంబం ధించినవి, వాటిలో ఆయన తన విద్యార్థిదశలో చదివిన వామన్ శ్రీధర్, రాంజోషి వంటి పాత మరాఠీకవుల ఛాయలూ పరశురాంపంత్ గోడ్బోలెయొక్క 'నవనీత్' అనే విలువైన సంకలనపు ఛాయలూ కనబడతవి.

ఇందూర్‌లోను, బరోడాలోను, తన జీవితకాలపు చివరి నాలుగైదు సంవత్స రాలలో దత్తా అతిముఖ్యమైన కవితలు రాసినాడు. వీటిలో ప్రకృతి కవితలని చెప్ప దగ్గవి సుమారు పద్నాలుగు. అందులో 'నా ప్రేయసికిదండ', 'లేతమొగ్గ', 'ఇష్టమైన పువ్వు', 'నా మిత్రమైన వసంత వీచికకు', 'కోకిలగానం', 'ప్రియలత', 'విశ్వామిత్రి తీరాలపైన' పేర్కొనదగినవి. ఈ ప్రకృతి కవితలను, వాటి ప్రత్యేక లక్షణాలను సన్నిహితంగా చూడటానికి పూర్వం వాటి ఇతివృత్తాన్ని విషయాన్ని తెలిసికోవటం

మంచిది. వాటిలో 'నా ప్రేయసికి దండ', 'ప్రియమైనలత' లేక 'నా మిత్రమైన పక్షికి' వంటి కొన్నిటిలో స్పష్టమైన ప్రకృతి రూపాలను సంబోధించినాడు. వీటిని గూర్చి కవికి గల ప్రేమ భావాన్ని కవితారూపంలో, 'ఓ నా ప్రియమిత్రమా!' వంటి ప్రియవచనాలతో వ్యక్తపరచినాడు. అయితే ఈ కవితలు వట్టి కథనంతోకూడిన వర్ణనలే కావు. వీటిలో కవి తన భావాలను, సొంత ఉద్వేగాలను స్వేచ్ఛగా ప్రకటించి నాడు. ఆవిధంగా ప్రకటించేటప్పుడు, ప్రకృతిని మానవాకారంలో చిత్రించినాడు. 'దండ', 'వసంత వీచిక'లో కవి అతినైపుణ్యంతో తన ఒంటరితనాన్ని, వియోగ భారాన్ని, కోమలమైన పుష్పస్పర్శతోను, వసంత వీచికతోను ఉన్నతం చేసినాడు. ప్రియుల వియోగబాధలను వ్యక్తపరచటానికి ప్రకృతిని - నిపుణతతో, సంస్కృత కావ్యాలలో ఉదహరించిన ఫక్కీని కవి గొప్పనేర్పుతో ప్రదర్శించడం గోచరిస్తుంది. పూలదండను సంబోధిస్తూ, 'నేను నిన్ను నా ప్రియురాలి జడలో తురిమేవాడినే-కాని నీవు వియోగబాధతో మండిపోతున్న వానికడకు వచ్చినావు. అందుకని నేను పడే బాధ నీవూ అనుభవించు. నీ స్పర్శతో జ్వరం పెరుగుతుంది. వాసనకు తల నొప్పి లేస్తుంది. విధి వైపరీత్యం చూడు ఎట్లున్నదో! ఏవి ఆనందాన్ని కలుగ చేయవలెనో అవే బాధాకరమవుతవి' అని అంటాడు ఆయన; 'చల్లని వైత్రమంబుదుప జాలిన' వసంత వీచికలూ అదేవిధంగా ఆయనకు దుర్భరమవుతవి. "వియోగ జ్వరంతో తప్తుడైన వానిని స్పృశించినప్పుడు ఈ వసంత వీచికలు చల్లగా, హాయిగా ఎట్లుండ గలవు? ఆమె వేడి నిట్టూర్పు వసంతవీచికను గూడా వేడిచేసినవి. సంపర్కంవల్ల జాడ్యం సోకుతుంది గదా?" అంటాడు.

దండను గూర్చిన అత్యంత భావపూరితమైన కవితలో ఆయన తీగలో ఒక అందమైన స్త్రీని చూస్తాడు. చివరిదాకా అదే భావన కలిగి ఉంటాడు. పొంగిపొరలే గాఢమైన ప్రేమభావాలవల్ల కవితలో ఏమాత్రం వర్ణనలూ లేవు. అవి సహజంగాను, అన్యోన్యంగాను, ఇద్దరు స్నేహితుల మధ్యగాని, ప్రేమికుల మధ్యగాని ఉన్నట్లున్నది. సంస్కృత కావ్యాలలో ఉన్న అంగీకృత నియమాలన్నీ పాటిస్తాడు. అంతేగాదు, నీతిని బోధించడం గూడా విస్మరించడు. 'కోకిల కూస్తుంది' అనే గేయంలోని మౌలిక భావం సరికొత్తది. ఈ గేయంలో కోయిలను, వసంతాగమనం తెలిపే వార్తాహరునిగా చిత్రించాడు. వసంతుడు వస్తున్నాడని ప్రకృతి నిర్మించిన సృష్టికంతటికి తెలియచేస్తూ రాజలాంఛనాలతో స్వాగతం పలుకవలసిందిగా లోకాన్ని హెచ్చరిస్తుందట కోయిల. ఈ కవితలో కవి ప్రకృతిని మానవాకారంలో దర్శింపచేస్తాడు.

'లేత మొగ్గ' అనే కవిత కవి కల్పనాచాతుర్యముయొక్క మనోహరమైన సృష్టి. ప్రసిద్ధములైన ఉపమానాలు, ఉత్ప్రేక్షలు, సామెతలు, వర్ణనలు అన్నీ చొప్పించబడ్డవి కవితలో అసాంతంగా. లేత మొగ్గనుచూసి కవి భావనలు పొంగి పొరలి పోతవి. ఆయన మనసుకు తట్టిన భావనలను, ఆలోచనలను, అనేక స్వభావాలను, మానవాకారాలలో చిత్రీకరింపచేస్తాడు. దత్తా ఎప్పుడు ఏదో ఒకరూపంలో మానవచర్యల ఛాయలను ప్రకృతిలో తిలకిస్తాడు—తన స్వభావాన్ని సమయస్ఫూర్తిని కాపాడుకుంటూనే, ఇంకెందులోను లేనంతగా ఈ కవితలో, సంస్కృత కవులను పోలినట్టుగా కనబడతాడు. దత్తా ప్రకృతి కవితలన్నింటిలోను 'విశ్వమిత్రి' అనేది బహుశః అత్యుత్తమమైంది. ప్రదర్శనలో వైచిత్ర్యం దాని అసామాన్య అందం, ఉద్రేకంతోకూడిన వాతావరణ సృష్టి, ఈ కవితను అత్యుత్తమంగా చేసింది. ఒకసారి చదివితేచాలు, ఎన్నటికీ మరుపునకురాని కవిత అది.

దత్తకవి మిత్రుడైన చంద్రశేఖర్ అభిప్రాయం ప్రకారం-దత్తా ప్రకృతిని ఏకాగ్రతతో ఆరాధించేవాడు. ప్రకృతి మారుతూఉండే రూపురేఖలను తిలకించటంలో తన్నుతాను, మరచిపోయేవాడు. అయితే కవులందరూ ప్రకృతిచే ఆకర్షింపబడతారని, ప్రకృతి సాన్నిధ్యంవల్ల ఆనందిస్తారని మనకు తెలియదా? దత్తా ప్రకృతి ఆరాధన సాధారణమైన కోవకు చెందినదా? లేక ప్రత్యేకమైన తరహాకు చెందినదా? ఈ కవితలు, కేవలం వర్ణనాత్మకమైనవేనా? అయితే ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదుకుతున్నప్పుడు, దత్తాయొక్క ప్రకృతి కవితల ప్రత్యేకతను, వాటి మౌలిక గుణ సంపదను మనము తెలిసికో కలుగుతాము.

ప్రతి కళాకారుడు, తన కళాఖండంలో ప్రవేశపెట్టాలనుకునే అందాన్ని తన దృక్కోణంనుండి వెతుక్కుంటాడు. కళాస్వరూపాలన్నీ, కళాకారులందరినీ సమానంగా ఉత్తేజపరచవు. ప్రతి కళాకారుడికీ ఒక ప్రత్యేక దృక్కోణం ఉంటుంది. తద్వారానే అతడు భావోద్రిక్తుడవుతాడు. ఆలోచనాపూర్వకంగా చలిస్తాడు. అతని కవిత్వ వివేచనాశక్తి కూడా ఇక్కడే ఉన్నత శిఖరాల నందుకుంటుంది. ఒక పూల మొక్క పెరుగుదల చరమదశను, నిండుగా పూసిన పువ్వు ఏవిధంగా సూచిస్తుందో, భావోద్రేకపూరితమైన సుందర కళాఖండసృష్టి, సుదీర్ఘమైన రచనా ప్రక్రియ యొక్క ఫలస్వరూపాన్ని సూచిస్తుంది. దత్తా ప్రకృతిలో తన సౌందర్యపురేఖను చూస్తూ, తన భావోద్రేకానికి అత్యంత సన్నిహితమైన అనువైన కేంద్రాన్ని కనుగొన్నాడు. దత్తా తన యౌవనారంభంనుండి ప్రకృతిలో తన స్వప్నాల ప్రతి

బింబాన్నీ తన కోరికల ప్రతిరూపాన్నీ చూడగలిగాడు. కాని, తన ప్రకృతి కవితల్లో నైసర్గిక వాతావరణాన్ని వాస్తవికంగా చిత్రించినట్టులేదు. వివిధ రూపాలను సంత రించుకొని, ప్రకృతి ఆయన లేఖినిద్వారా జీవం పోసుకోలేదు. అసలు విషయమేమి టంటే దత్తా నైసర్గిక కవితలన్నిటిలో ప్రకృతిని చాల తక్కువగా చూస్తాము. మనం చూసేదల్లా ప్రకృతిలో కవి హృదయపు ప్రతిబింబాన్ని మాత్రమే. అందుకని ఆయన నైసర్గిక కవితలన్ని భావనిర్భరమై ఉంటాయి; ఆ భావాలు ఆయన వ్యక్తిత్వంనుంచి రూపొందినవి.

దత్తా వ్యక్తిత్వం కొత్తపాతల మేలుకలయికగా సంస్కృతం - ఆంగ్లం; సంప్రదాయం - సంస్కారం - వంటి పరస్పర భిన్నశక్తుల పెనుగులాటతో ప్రభావిత మైంది. అందుకే, ఈ సాధారణ భూమికలో ఆయన విలక్షణమైన నైసర్గిక కవితా గుణ విశేషాన్ని అర్థం చేసుకోవాలి. దత్తా కవితలలో మొత్తంమీద ప్రకృతిని గూర్చిన కవితలలో యధేచ్ఛగా తన్నుగూర్చి తెలియచేయడంగాని, పాఠకులకు తన ఆత్మగుణాన్ని మనోగత వాంఛలను వ్యక్తపరచుటగాని అరుదుగా కనబడుతుంది. కవియొక్క తన స్వాప్నికజగత్తులో ప్రకృతికి ప్రేమాస్పదమైన చోటున్నదనటంలో సంశయంలేదు. 'ప్రియమైన లత', 'లేతమొగ్గ', ఇతర కవితలు, సంస్కృత ప్రాచీన కావ్యాలను జ్ఞాపకానికి తెస్తవి. అయితే ప్రకృతిని చూడగానే కవి హృద యంలో సంచలనం కలుగకమానదు. తన మనోగతభావాలను వ్యక్తపరచటానికి కవి ఒకోసారి ప్రకృతిని సాధనంగా తీసుకుంటాడు. ఇతర సమయాల్లో ప్రకృతి ఒక పల చని తెర అవుతుంది. దానిపై తియ్యని జ్ఞాపకాలు, కలలు మసక మసకగా కనబడుతవి. ఆ తర్వాత కవిత - కవి కోరికల యొక్క, ఉద్వేగ భావాల యొక్క అచ్చమైన చిత్ర ఫలకంగా మారుతుంది. ఒకోసారి ఆ రెంటి మధ్యగల భేదం తొలగిపోయి, కవి యొక్క సజీవ ఆకృతిని దాలుస్తుంది ఆ కవిత. అప్పుడు ప్రకృతి కవితలు గేయాలుగా మారి కవి అంతరాంతరాళాల్లోని భావాలను ప్రకటిస్తవి. ఇది జరుగునప్పుడు ప్రకృతి తన స్వాభావికతను కోలుపోతుంది. కవికి కలిగే స్పందన గూడా సజీవ గుణాన్ని కోలుపోతుంది. అప్పుడు మిగిలేది అలంకారం; కృతకమైన అతిశయోక్తుల పునరా వృతి. ఇటువంటివి సంస్కృత కావ్యాలలోను, నాటకాలలోను మనకు తరచుగా కనబడుతవి.

కవి యొక్క భావోద్రేకాల అనుభూతి ప్రకృతి కావ్యంతో ఎట్లా పెనవేసు కుంటవి? అతని వ్యక్తిగతమైన, అంతర్గతమైన భావాలు బహిర్గతం కావటానికి

ప్రకృతి అవకాశాన్ని ఎందుకు కలుగచేసింది? ఈ ప్రశ్నలకు అతని వ్యక్తిత్వం మీద చిన్ననాటి ప్రభావం; ప్రత్యేకమైన కౌటుంబిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు సున్నితమైన మనస్తత్వం గల సమకాలీనుల సహచర్యం వంటి వాటిలో సమాధానం దొరుకుతుంది. స్వేచ్ఛ కలిగి, ప్రతిబంధాలు లేని కవి హృదయం; కఠినమైన కట్టుబాట్లనుండి తప్పించుకొని పోవాలని చూసేది. దురదృష్ట వశాత్తు అందుకు అవకాశం దొరకక పోయేది. అందుకని యత్నం ఫలించలేదనే భావం, నైరాశ్యం హృదయంలో గూడు కట్టుకున్నది. కవి ఏది తన వాస్తవిక జీవితంలో అనుభవించజాలలేదో అది ప్రకృతి ద్వారా అనుభవించటానికి, పరోక్షంగా ఆనందించటానికి ప్రయత్నించినాడు. వాస్తవానికి అతడు ఒక 'ప్రేయసి' ని కోరుకున్నాడు. కాని అందుకు బదులుగా 'వసంత వీచిక' లభించింది. అతని కవిత గూడా అతనికి ప్రేయసిగానే దర్శనమిచ్చింది. దత్తా గురించీ ఆయన సమకాలీనుల గురించీ విషాదకరమైన విషయమేమిటంటే - ఆలోచనపరంగా నేమి, భావాలవల్ల నేమి వారు నివసించే కాలం కన్నా వారు చాల ముందుగా జన్మించినారు. కాబట్టి వారి శృంగార ప్రేమ, ఆదర్శవంతమైన స్త్రీత్వం, ఒండొరుల ఆనందమయ జీవితం సార్థకం కాజాలక పోయింది. స్త్రీ-పురుషుల మధ్యగల అత్యంత సున్నితమైన, వ్యక్తి గతమైన, సన్నిహిత సంబంధాన్ని గూర్చి కవితా రూపంలో వ్యక్తపరచాలన్నప్పుడు ఒకంత అసహజత్వం, ఉపమాలంకారం తప్పనిసరి అవుతుంది. దత్తా ప్రకృతి కవితలో కొంతవరకు ఈ రెండూ కనబడుతవి. కాని ఏ భావోద్రేకపు నైజంవలన కవి రాయటానికి పూనుకున్నాడో, సాంఘికమైన ఏ ఒత్తిడికి లోనై ఆయన రచనకు ఉపక్రమించవలసి వచ్చిందో అర్థం చేసుకున్నాక ఈ అసహజమనే మచ్చ మాసి పోతుంది. ఈ విధంగా కవి తన కల్పనాజగత్తును ఆనందపరుస్తూ, 'వసంత వీచిక' ల తోనో, 'ప్రియమైన లత' తోనో, 'ప్రియమైన మాల' తోనో సన్నిహిత సంభాషణ చదువుతున్నప్పుడు సహజంగా మనం అనుభూతి పొందుతాము. దాని ఆవశ్యకతను, ప్రత్యేకతను మెచ్చుకుంటాము. వ్యక్తిగత భావాలను గట్టి సాంఘిక కట్టుబాట్ల నడుమ, అసహజపు పద్ధతిన వ్యక్తపరచడం, ఒక్క దత్త కవితలలోనే గాక, ఆయన సమకాలీన కవులలో గూడా చూస్తాము. అయితే ఈ అసామాన్య పరిస్థితుల ప్రభావం ప్రతి కవి మీద వేరు వేరుగా కనిపిస్తుంది. కేశవసుత్ ప్రకృతి కవితలో పువ్వు తేనెటీగ, లేక సీతాకోక చిలుక తెర నుండి తొలగినాక వాటి స్థానే మానవ జీవితానికి సంబంధించిన చింత, చీకాకు చోటు చేసికుంటవి. తిలక్ యొక్క ప్రకృతి కవిత తాత్వికపరంగా ఉంటుంది. గుట్ట నెక్కడం, మానవ జీవితంలోని ఎగుడుదిగుడు జ్ఞాపకానికి తెస్తవి. విధి వైపరీత్యం,

ఈ కవులను కఠినమైన సాంఘిక ఆచారాలకు వ్యతిరేకంగా నిలిచి, తిరుగుబాటు చేయమన్నది; లేదా లొంగి పొమ్మన్నది; అందుకే ఉద్వేగానికి సరిపోను భావ ప్రకటనకు మార్గం చూసుకోవలసి వచ్చింది. అది వారు కవిత ద్వారా చేసినారు.

దత్తా కవిత్వంలో ఒకవైపు సంస్కృత సాహిత్య ప్రభావాన్ని చూసినా మరో వైపు, అలంకరణ లేని స్వాభావిక అందాల జాడను మొదటిసారిగా చూడకలుగుతాము. అది తర్వాత 'బాల కవి' కవితకు శ్రీకారం చుట్టింది. దత్తా, 'బాలకవి' - ఇద్దరూ నూనూగు మీసాల నూత్న నవ యౌవనంలోనే, తమ కవితా కలాపాల తరుణ వయసులోనే కాలధర్మం చెందినారు. వీరిద్దరిలోను మనం వివిధ రకాలకు చెందిన భావాలు సమాంతరంగా ప్రవహించుట చూస్తాము. అట్లే బయటి ఉత్తేజాలకు ప్రతి క్రియగా కూడా ప్రవహించటం చూస్తాము. ఉభయులు అహమద్ నగర్ క్రైస్తవ మిషనరీలతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారు. రెవరెండ్ తిలకును వీరు బాగా ఎరుగుదురు. 'బాల కవి' యొక్క ఆంగ్ల, సంస్కృత భాషల అధ్యయనం దత్తా అంత లోతున్నది కాదు. అందువల్ల, 'బాల కవి' కవిత్వంలో, పసితనం, సౌకుమార్యం నిండి తొణకిసలాడే నైసర్గికమైన అందం గోచరిస్తుంది. ఇది మన దత్తా కవిత్వంలో కనబడదు. కాని దత్తాకు సంస్కృతంలో గల ప్రవేశంవల్ల ఆయన కవితలలో పరిణతి చెందిన భాష ధారావాహికంగా ప్రవహించటాన్ని గమనిస్తాం. కాని సామాన్యమైనట్టి, స్వాభావికమైనట్టి, అలంకరణ లేనట్టి బాల కవిలోని అందం దత్తాలో చూడలేము. 'బాల కవి' 'దత్తా' కన్న ఒక తరం చిన్న. కాబట్టి సాంఘికమైన ఒత్తిడుల నుండి తప్పుకున్నాడు. ఆయన అంతర్గత కవితాస్పందన గూడా, ఇద్దరి కవుల మధ్యగల అంతరాన్ని సూచిస్తుంది. దత్తావలె గాక, 'బాల కవి' కవితలు మొక్కపై పూలు పూచినట్లు పూస్తవి. కాని వీరిద్దరూ వ్యక్తిగత జీవితంలో, నిరాశలకు సమానంగా గురి అయినారు. ఇద్దరిదీ ప్రేమ గాంభీర్యంలో తనంతట తాను కాలిపోయే దీపం వంటి అదృష్టమే. వారి ప్రకృతి కవితలు, వారి భావాలు ప్రతిబింబించిన కవితలుగా మారినవి. 'బాల కవి', ప్రకృతి తన జీవితపు నాడిని మీటుతున్నట్టు భావించినాడు. తీరని కోరికలను తెలుపటానికి, రచనను మార్గంగా చూసుకున్నాడు. దత్తా రాసిన ప్రకృతి కవితలు చదువుతున్నప్పుడు గూడా మన కదే భావం కలుగుతుంది. వాస్తవానికి, కవి మనసులోని స్వప్నాలను, హృదయంలోని కోరికలను ప్రకృతిలో ప్రతిబింబింప చేయటానికి ప్రయత్నించిన వారిలో దత్తా మొదటి వాడు. ఇదే ఆయన ప్రకృతి కవిత యొక్క లక్షణంగా ఉండిపోయింది. 'విశ్వామిత్రి తీరాలపైన' అనే

అందమైన ఆయన కవిత యొక్క ఆరంభ చరణాలు చదవాలి. సామాన్యంగా, స్పష్టంగా, తన సంతృప్తిని ఈ విధంగా వెలిబుచ్చుతాడు. "నా మనస్సు నిండుగా ఉన్నది. అందమైన ఈ దృశ్యాన్నీ చూసి - నా కన్నులు సార్థకమైనవి." ఇంతకు ఈ కమనీయ దృశ్యాన్ని చూసినందుకు, మధురస్వనాలు విన్నందుకు ఆత్మానందం ఎందుకు కలిగిందో? సంతృప్తికి కారణమేమిటో? కవి తెలుపలేదు. 'నా మనసును ఉన్మత్తం చేసే ఈ ప్రభావం ఎందుకో నేను తెలుసుకోలేక పోతున్నాను' అని అంటాడు. వెంటనే అల్పుడనైన తనకు ఇంతటి గొప్ప సాన్నిధ్యం లభించినందుకు అతి దైన్యంతో కృతజ్ఞత తెలుపుకుంటాడు; హృదయాంతరాళాల నుండి. శాంతి, భావంతో కృతజ్ఞత తెలుపుతూ ఆ కవిత "ఓ మేధస్సూ, లే. ఎంతో అపురూపంగా కనబడేదంతా చూడు" అని అంతమవుతుంది. రచనా విధానంలో నేమి, భావ తీవ్రతలో నేమి దత్తా కవితలలో మరువరానిది. ఆనందాతిశయంలో మధువువలె రుచికరమై ఉన్నా, అందులో విషాదఛాయ కనబడుతుంది. ఆనంద విషాదాలు రెండూ దత్తా వ్యక్తిత్వపు ప్రముఖమైన అంశాలు. 'మేధావి పక్షి' అనే కవితలో ప్రకృతిని గాఢమైన ప్రేమతో శోభింపజేసినాడు. "ప్రకృతిలో మీరు స్వర్గాన్ని భూతలం మీద చూడకలుగుతారు - అందుకు ఒకే సాధనం. కవితాస్ఫూర్తి - పరమాత్ముని సన్నిధానం. మూడులోకాల సుఖ సంతోషాలు దానిముందు నిరర్థకం. ప్రకృతియే స్వర్గం. చివరకు ప్రకృతియే మోక్షం. అదే నా పాలిటి కవిత్వం. ప్రకృతిమాత ఒడిలో పడుకొని ఉన్నప్పుడు నేను సంతోషభరితుడ నవుతాను. మూడులోకాలు నాకో లెక్క కాదు. ఓ ప్రకృతీ, నాకు చూపెట్టు. నేను నీ సౌందర్యాన్ని నాలో నిబపుకోదలచుకున్నాను" అని నిష్కర్షగా చెప్పినాడు.

దత్తా రాసిన ప్రకృతి కవితలు చివరకు ప్రకృతితో ఈ అవినాభావ ప్రేమనే ప్రదర్శిస్తవి. ఈ అవినాభావ ప్రేమ, కవిత్వం పట్ల ఆయనకు గల ప్రేమ - ఈ రెండూ ప్రేమనూ, జీవితాన్నీ గ్రహించడంలో ఆయనకు మార్గాలయ్యాయి. తన చుట్టూ ఉన్న ప్రకృతిలో తన స్వప్నాల నన్నిటిని ఛాయామాత్రంగా చూసుకున్నాడు. ఈ ఛాయాగ్రహణం తాత్కాలికమూ కాదు. అసహజమూ కాదు. ఆయన కవితా ధోరణి అన్ని కోణాలతో సమ్మిళితమై ఆకారాన్ని దాల్చుకుంటూ, చివరకు ఆయన కావ్యవస్తువుగా రూపొందింది. ఈ విధంగా ప్రకృతి-పురుషుని సమాగమంలో అక్షయమైన విశ్వాసమే దత్తా ప్రకృతి కవితలలోని విశిష్టమైన గుణం.

# మూడవ అధ్యాయం

## పిల్లల కొరకు రాసిన కవితలు:

దత్తా కవితలలోని ఒక విభాగాన్ని మరాఠీ రచయితలు, విమర్శకులు అందరూ ఏక కంఠంతో మెచ్చుకున్నారు. పిల్లలకొరకు రాసిన ఆయన కవితలు వాటికవే సాటి. పొగడ్తలవసరం లేదు. వాటి ఘనతను పట్టి చూపితే చాలు. అయితే పిల్లలకొరకు రాసిన కవితల ప్రత్యేక లక్షణమేమిటో తెలుసుకోవటం అవసరం. సాధారణంగా ఇది స్వతంత్రమైన కవిత్వ విభాగం. పేరుకు తగ్గట్టు పెద్దలనూ, చుట్టూ ఉన్న వస్తు జాలాన్నీ చూసే పిల్లల ప్రతిస్పందనలా సహజంగా, నూతనంగా, సమయానికి తగ్గట్టుగా ఉండాలి పిల్లల కవితలు, వారి తెలివి తేటలు పెంచేవిగా ఔత్సుక్యాన్ని కలగజేసేవిగా, ఆలోచనా శక్తిని ఉన్నతపరచేవిగా ఉండాలి. మరో మాటలో చెప్పాలంటే - శబ్దము - ధ్వని - వీటి ద్వారా స్వాభావికంగా పిల్లల మనోవృత్తిని తెలిపేదిగా ఉండాలి. అల్లా చేస్తున్నప్పుడు 'తెలియనిది తెలుసుకుందాం' అనే శాశ్వతమైన జిజ్ఞాసను కలిగింప చేయాలి. పిల్లలు జీవితంతో పెనుగులాడుతారు. చూపినదల్లా తెలుసుకుందాం అని ఆరాట పడతారు. పుట్టుకతో వచ్చిన ఆలోచనతో తమ లోకాన్ని తాము సృష్టించుకో కలుగుతారు. వారి ప్రపంచానికి పెద్దలతో సంబంధముండదు. పూర్తిగా ఎదుగనట్టి, అమాయకమైనట్టి, ఫలాపేక్ష లేనట్టి లోకం పిల్లలది. వారి లోకం పాటించే నియమాలు, కట్టుబాట్లు వారివే. పిల్లలకొరకు రాసిన పాటలన్నీ ప్రాణం పోసుకున్నట్టుగా కనబడాలి. ఆ పాటల్లో సాధారణంగా పిల్లలు మాట్లాడుకునే వ్యాకరణ శుద్ధిలేని భాషను మాత్రమే పైపైన అనుకరిస్తే చాలదు; పిల్లలు ఇష్టపడేవీ, వారి హృదయాలకు హత్తుక పోయెటట్టివీ అయిన వాటిని గుర్తు చెయ్యాలి. మన నిస్సార జీవితంలోని మామూలు సంఘటనలను మాయా జగత్తులో, నాటక రూపంలో ప్రవేశపెట్టాలి. స్వేచ్ఛగా, రూపకల్పన చెందిన ఊహలు అవగాహనలోను, చర్యలలోను కనపరచాలి. వాస్తవంగా ఇవే పసితనపు ప్రత్యేక లక్షణాలు. పెద్దలు, పసిపాపల మనోవీధుల్లో చొరబడి వారి ఊహలలో లీనమైపోయి, పిల్లలకొరకు కవిత రాయాలి. అదే బాలల కవితకు అగ్ని పరీక్ష. బాలలను ప్రేమించడం గానీ, లేదా వారిని ఆహ్లాద పరచడం గానీ నిజమైన బాలల కవిత్వాన్ని సృష్టించటానికి సరిపోదు. కవి తాను బాలుడై పోవాలి. బాలల మాయా జగత్తులో లీనమై అనుభూతి పొందాలి. ఆ స్థాయికి వచ్చినప్పుడే బాల కవిత్వం సృష్టింపబడుతుంది. బాలుడు తమ ఆనందాన్ని, విచారాన్ని, అంతరంగిక కోరికలను, ఇష్టా యిష్టాలను తాను చిన్నారి జగత్తులోకి ప్రాణం పోసుకొని వచ్చే బొమ్మలలో ప్రవేశపెట్తారు. ఇలా చేస్తున్నప్పుడు బాలలు

పెద్దలను అనుకరించటానికి కుతూహల పడతారు. బాలల చేత సృష్టింపబడిన ఈ కొత్త ప్రపంచం ఇటు భూమి మీద గాని, అటు సముద్రం మీద గాని ఎన్నడూ కనీ వినీ ఎరుగనిదీ, అకస్మాత్తుగా ఆవిర్భవించింది అని అందామా! ఇంతకూ ఆ కవితలు నిజంగా బాలల కొరకు రాసినవై ఉండాలి గాని, బాలల మీద రాసినవి కాగూడదు!

13 వ శతాబ్దం తరువాత నుంచి ప్రాచీన మరాఠీ సాహిత్యంలో పిల్లల పాటలు ఎన్నో వెలసినవి. అవి పిల్లల భాషను అనుకరిస్తూ వారి భావాలను ప్రకటిస్తవి. ఆ కాలంలో సంత్‌లు, పండితులు, రాసిన వాటిలో ఒకే ఇతివృత్తం ఉండేది. అది 'కృష్ణుడు' అతని అందమైన పసితనం. పసితనపు చేష్టలు, నిరాకారుడైన పరమాత్మునికి సాకార ప్రేమస్వరూపాన్ని కల్పించి, ఈ కవులు తమంతట తాము బాల్యావస్థను పొందుతారు. గోకులంలోని కృష్ణుడి ఇల్లు; వనానికీ, నదికీ కృష్ణుని విహార యాత్రలు, గోపికల ఇండ్లనుండి పాలు, వెన్నల చిలిపి దొంగతనాలు - మొదలైన వాటిని గురించి ప్రీతికరమైన పాటలు అల్లుతారు. ఈ పాటలలో కొన్నిటికి ద్వంద్వార్థాలున్నవి. ఒకటి నిజమైనది. రెండవది ఉపమించినది. ఒకటి లౌకికం, మరొకటి పరమార్థం. అయినా ఇటువంటి పాటలెన్నిటిలోనో పిల్లల విలక్షణ మనోవృత్తిని చూస్తాము. ఈ లక్షణాలను ముఖ్యంగా నామదేవ్ (1220-1350), ఏకనాథ్ (1433-1509) ల పాటలలో చూస్తాము. వారి పాటలు 'కిస్నా థామల్‌రె థామల్ అపుల్యాగాయ్' (కృష్ణా మన ఆవులను చూసుకో). ''అసకసదె వాచదేవ్ బాయిధాక్డా'' (దేవతలకు దేవుడైనవాడు మోసగాడెట్లయినాడు?) అనే పాటలు ప్రత్యేకమైన ఆనందాన్ని, వినోదాన్ని కలిగించేవిగా ఉన్నవి. వీటిలో పిల్లల మనోవృత్తి ఎట్లా పని చేస్తుందో వారి నోరు తిరుగని మాటల్లో ఆహ్లాదాన్ని చేకూరుస్తవి. సంత్ తుకారాం అభంగాలు పిల్లల కొరకు గాదు. 'పాయిఘు గరియాసారి కటదోరానాకి ముఖ్‌పాహే మాతా సట్‌నా సమయెచిత్తా') అందమైన ఆభరణాలు కాళ్ళకు, మొలకు దండలకు, మెడలో వేసుకున్న తన పిల్లవాని ముఖంలో చూసి తల్లిపడే ఆనందానికి అవధు లుండవు.) లో కనిపించేది తల్లిచూపే ప్రేమ-వాత్సల్యం. 'వేణు సుధ', 'వన సుధ' లో వామన్ పండిత్ బాలకృష్ణుని కొంటెచేష్టలు వర్ణించినాడు. ఆయన పండిత కవి. అందుకని ఆయనగూడా పిల్లల మనోగతులను చిత్రించలేక పోయినాడు. ఈ గేయాలలో కవుల మనోగత భక్తి భావాలు, ఆధ్యాత్మిక చింతనలు వ్యక్తమైనవి. విఖ్యాత పండితకవి మోరోపంత్ బాలికల కొరకు 'సీతా గీత' రాయటమే గాక పిల్లల కొరకు ''బహూ తాడ్కా భజక్ శిశు పాతిలాగొని ఓన్కా శివతో'' (బహూ ముద్దుల

చిన్నవాడు మైలబడి, వెంట బడ్డాడు, ముట్టుకుంటున్నాడు) అనే పాట రాసినాడు,' కాని, నిజానికి ఇవేవీ పిల్లల పాటలనిపించుకోవు. ప్రాచీన మరాఠీలోని జానపద గేయాలైన జోల పాటల్లోనే అసలైన పిల్లలు కనబడతారు. ఇవి తల్లులు పాడే. జోల పాటలు. అన్నీ ప్రాచీన మరాఠీ సాహిత్యంలోని 'ఒవీ' అనే ఒకే మాత్రా ఛందస్సులో ఉంటవి. గాఢమైన కుటుంబ సంబంధాలను వర్ణిస్తవి. ఆడపిల్లలు ఆడుకునే సమయాల్లోను, కొన్ని కుటుంబ సమావేశాల్లోను పాడుకుంటారు. ఈ విధంగా ఇవి కొన్ని, ఉత్తమమైన పిల్లల పాటలుగా రూపొందినవి. విచిత్రమేమిటంటె ఈ సాహిత్యాన్ని సృష్టించిన వారెవరో తెలియదు. "అపడి తపడి గుణాబి పాపడి" కాని "చాందోబా చాందోబా రుస్లాస్ కా, నింబోలిచ్యా ఝాడామాఘె లప్‌లాస్ కా," అనే అర్థం పర్థం లేని చరణాలు తెలియని వెవరికి? మరాఠీ ఇండ్లలో ఇవి తరతరాలుగా పాడబడుతున్నవి. ముందెన్నో తరాలవారు పాడతారు గూడా. ఇవి మన కుటుంబ జీవితాలతో పెనవేసుక పోయినవి. తరాల అంతరం వాటిని పాతబడ నివ్వలేదు. పిల్లల ఆటల తీరుతెన్నుల బట్టి అవి నిత్య నూత్నమవుతూ ఉంటవి. ఇంతటి సుసంపన్నమైన, అందమైన, ఉత్తేజకరమైన భూమిక ఉన్నా, నిజానికి, మరాఠీ భాషలో పిల్లల సాహిత్యం వేరూనలేదు. మరాఠీ సాహిత్యంలో, సున్నితమైన, జిజ్ఞాసాపూరితమైన నాటకీయతకు, ఆట పాటలకు అనువైన బాల గేయాలు అరుదుగా చూస్తాము. అందుకే పిల్లల సాహిత్యం చాలా వరకు వారి కోసం ఉద్దేశింప బడలేదు. అప్పటి కప్పుడు పిల్లల మనోమేఘం నుండి వచ్చిన జల్లులవలె కాక అవి పిల్లలను గూర్చి పెద్దలు రాసినవిగానే ఉండిపోయినవి. పిల్లలనుగూర్చి పెద్దలు చూపే ప్రేమ మమకారాన్ని వ్యక్తం చేస్తవి. అందువల్ల మాయామర్మం ఎరుగని చిన్నారి మనసులలో తమ అసాధారణ భావాలను అంకురింప చేయాలనే పొరపాటు చేస్తారు.

ఆధునిక మరాఠీ కవులలో రెవరెండ్ తిలక్ 'బాలల, పువ్వుల' కవిగా పరిగణింపబడతాడు. ఆయన పదేపదే బాలల గురించి, పువ్వుల గూర్చి తన చిన్న కవితలలోను, దీర్ఘ కవిత 'వనవాసి ఫూల్' (ప్రవాసం చేస్తున్న పువ్వు) లోను ప్రస్తావిస్తాడు. ప్రసన్నత, సుగమశైలి, పిల్లల పట్లగల ప్రేమ తిలక్ కవితకు అదనపు అందాన్ని చేకూరుస్తవి. 'తాయీ, తూ ఫూల్ గడీ మాఝీ'. 'తాయి తూ రత్న గడీ మాఝీ' (ఓ నా సోదరీ, నీవు నా ప్రియమైన పువ్వువి - నీవు నా ప్రియమైన రత్నానివి) అనేది రెవరెండ్ తిలక్ యొక్క ప్రఖ్యాత కవిత. అది ప్రేమాతిశయంతో నిండినది. ఇందులో కవి, పిల్లలపట్ల పెద్దల మనోగత భావాలను చూస్తాడు. అందుకని ఇది ఏ విధంగానూ పిల్లల కవిత అనటానికి వీలులేదు. తర్వాత తరం వారైన కేశవసుత్,

గోవిందాగ్రజ్ గూడా పిల్లల కవితలు కొన్ని రచించినారు. కాని అవి గూడా పిల్లల గురించి రాసినవే గాని పిల్లలవి గాని, పిల్లలకొరకు రాసినవి గాని కావు. అయితే తిలక్ రాసిన అందమైన కవిత 'బాహుల్యాచె వైద్యరాజ్' (బొమ్మయొక్క వైద్యుడు) అందుకు అపవాదు. అజ్ఞానియైన ఒక చిన్నపిల్ల యొక్క మనోగత భావాల ప్రతిబింబాన్ని స్పష్టంగా చూడకలుగుతాము. 'మాజీ నవలాబి బాహుని (నా చిత్రమైన బొమ్మ), బాహుల్యాచి సహల్ (బొమ్మ యొక్క వాహ్యాళి), 'బరీహో పూన్ ఆలీ' (నయమై వచ్చింది) అనే కవితలలో, పసిపాపల లేత మనసులలోని భావాలు చదువ కలుగుతాడు. కొన్ని కవితలలో సిల్లల కలం చిత్రాలు, అర్థం లేని అరుపులు, వారి ప్రత్యేక భాష, తమ మిత్రులైన పెంపుడు జంతువులు, పక్షులు, బొమ్మలతో వారి ఏకాంత భాష - హన్, హన్, చ్యు, చ్యు అనే ఊత పదాలు నినూత్న ఆనందాన్ని ఒనగూరుస్తవి. ఆది నేర్పబడనట్టి స్వాభావికమైన భాష. పిల్లలు సహజంగా అనుకరించిన భాష. మొత్తానికి తిలక్. 'పిల్లల కొరకు' రాసిన కవితలలో తన వేదాంత ధోరణి విడువలేదు - తాను స్వయంగా పిల్లవాడు కాజాలలేదు.

పిల్లల కవిగా తిలక్‌ను గూర్చి మాట్లాడుతున్నప్పుడు 'బాలకవి' తప్పక జ్ఞాపకానికి వస్తాడు. దాదాపు తన జీవితంలో ఎప్పుడూ బాలకవి పిల్లల అమాయక చేష్టలను జార విడువలేదు. 'చిమణిచె ఘరటె చోరీస్ గేలె' (పిట్టగూడు దొంగిలించ బడ్డది)' 'రాఘోబాలారాగ్ ఆలా' (చిలకకు కోపం, వచ్చింది). 'అంగాయి గీతె' (జోల పాటలు), 'మాజాభావు' (నా తమ్ముడు) అనే గేయాలలో, సంగీతానికి అనువైన అందమైన భాషలో పిల్లలకే ప్రత్యేకమైన వారి చిన్నారి ప్రపంచంలో అభినయం సలిపే - 'పిల్లల అమాయిక మనస్సును' వ్యక్తం చేస్తాడు. 'తాంబే' అదే కాలం వాడు. మరాఠీ కవితా లోకంలో పేరుమోసిన వాడు. కొన్ని నాటకీయమైన కవితలు రాసినాడు. అందులో పిల్లల మనోవృత్తిని గూర్చి కొన్ని ఆహ్లాదకరమైన చిత్తవృత్తులను తెలిపే కవితలను రాసినాడు. అవి ఈ నాటికీ ఎందరికో కంఠస్థమై ఉన్నవి. "తర్ మగ్ గట్టి కోణాశీ" (అయితే మరి మైత్రి ఎవరితో ?) అనేది అతని నాటక కవిత. అట్లే అతని మరి రెండు కవితలు 'హే కోణ్‌గే ఆయి' ('అమ్మా ! ఎవరితను ?), 'చివ్ చివ్ చిమణి ఛతాత్' (ఇంటికప్పులో పిట్ట) అనే కవితలు గూడా సుప్రసిద్ధమైనవి.

మరాఠీ బాలకవితా ప్రపంచంలో దత్తాకు ప్రత్యేకమైన, స్థిరమైన స్థానమున్నది. పిసలైన బాలకవిత్వ మార్గదర్శకులలో దత్తా ఒకరు. ఆయన కవితలు సంఖ్యలో కొద్ది మాత్రమే ఉన్నవి. పిల్లలలో కొంగ్రొత్తగానూ స్వచ్ఛంగానూ కనిపించే నహ

జత్వం, సమయస్ఫూర్తి వంటి గుణాలచేత, ఈ కవితలు కొన్ని మాత్రమే ఉన్నవన్న లోటు తీరిపోయింది. వీటితోబాటు 'నిదురబో నా పాప - నిదురబో' అనే జోల పాట; దత్తా రాసిన 'ఉపమా, ఉత్ప్రేక్షలు లేని' మోత్యా శీక్ రే అ-ఆ-ఇ-ఈ [మోత్యా (పెంపుడు జంతువు) నేర్చుకో అ-ఆ-ఇ-ఈ లు] 'శహాణీ బాహూలి' (తెలివి గల బొమ్మ), 'ఆందోళన్' (ఉయ్యాల) అనే కవితలు మరాఠీ సాహిత్యానికి నిధుల వంటివి. వీటిని గుర్తు చేసికోవటం, కవిని గుర్తు చేసికున్నట్టే.

ఆయన బాలల కొరకు, బాలలను గూర్చి రాసినవే గాక బాలలు పాడుకోటానికి యోగ్యమైన బాలకవితలు గూడా రాసినాడు. అవి చిరస్మరణీయమైనవి. అవి పిల్లల హృదయాన్ని ఆకట్టుకుంటవి. అవి పిల్లలకు సహజమైన సమయస్ఫూర్తినీ, నాటకీయతనూ కలిగియున్నవి. అందుకే ఈ కవితలను పదే పదే చదువాలనిపిస్తుంది. ఎందుకంటే వాటి సహచర్యంలో మనము పిల్లలమై పోతాం - కొన్ని క్షణాల పాటు. ఆ తర్వాత కల్పనా ప్రపంచపు వింతలను చవిచూచి ఆనందిస్తాం. 'శహాణీ బాహూలి' (తెలివిగల బొమ్మ), 'మోత్యాశీక్ రెశీక్ అ-ఆ-ఇ-ఈ' (మోత్యా! అ-ఆ-ఇ-ఈ-లు నేర్చుకో) 'బోలత్ కానా హీస్' (మాట్లాడవెందుకు?) అతి సామాన్యమైనవి. సహజమైనవి. అవి నిజంగా ఓ పిల్లవాడే రాసినాడనుకుంటాడు చదువరి. వాటి భాష, ఆలోచనలు, భావాలు గూడా పిల్లలవే. ఈ గుర్తింపు ప్రయాస పడకుండా లభించింది; సంపూర్ణమైంది. 'దోళె ఫిరవితె తులూ, తులూ, కశమాజ సోనీ బఘతె' (చూడు నా బొమ్మ 'సోనీ' కండ్లు తిప్పుతూ ఎలా చూస్తుందో) లేక 'పలావాట తెమీలాబాయి సారెకామీ సారెకళతె'' (దీనికి అన్నీ తెలుసు ననుకుంటాను). ఈ కవితలలోని సంగీతం అనువాదానికి అతీతంగా ఉంటుంది. 'ఫిరవితె' (తిప్పుతుంది) అనే పదంలోని 'ర' అక్షరాన్ని హ్రస్వం చేసి పాడుతున్నప్పుడు, మూలం చదవాలి, పాడగా విని ఆనందించాలి. 'సారెకామీ సారెకళతె' అనే చరణం మళ్ళీ మళ్ళీ పాడటంలోని ఆనందం; 'ఆందోళన్' (ఉయ్యాల) అనే కవితలోని ప్రథమ చరణంలో ఉన్న సహజ మాధుర్యం వర్ణనాతీతం, చిన్న పిల్లలైన అక్క- తమ్ముడు, అన్నా చెల్లెలు వంటి వారిమధ్య ఉండే ప్రేమానురాగాలను, అందమైన భావాలలో వ్యక్తం చేసిందీ కవిత. అల్లె 'పరకార' (లంగా - పరికిణి) అనే పదంలోని రెండో 'ర' ను 'క' తో తొందరగా కలిసిపాడే తీరును మూలంలో తప్ప అనువాదంలో చూపడం అసాధ్యం. నాలుగు అక్షరాల ఈ పదాన్ని మూడు లేక మూడున్నర అక్షరాలకు కుదించి, ఊయల ఊపుతో మేళనింప చేసినాడు దత్తా కవి తన కవితా నైపుణ్యంతో.

ఒక పదంలోని ధ్వనిని కుదించడం పిల్లలు స్వాభావికంగా చేసేదే. 'మోత్యాశీక్ రేశీక్ అ-ఆ-ఇ-ఈ' (మోత్యా నేర్చుకోవె అ-ఆ-ఇ-ఈ) అనే కవితలో గూడా, 'రె' అనే అక్షరంతో కవి ఇదే ప్రభావాన్ని కలుగజేస్తాడు. పిల్ల తన పెంపుడు జంతువైన కుక్కను మరాఠీ అక్షరమాలలోని మొదటి అక్షరాలను నేర్చుకోమని ప్రోత్సాహ పరుస్తుంది. 'రే' సంబోధించటంలో పిల్లకు, తన కుక్కపిల్లకు నేర్పాలనే ఉత్సుకత' ఆప్యాయత కనబడుతుంది. (తెలుగులో కుక్కపిల్లను నేర్చుకోవే అని ఆప్యాయతతో అంటాము. మరాఠీలో 'రే' అంటారు. బాల ప్రపంచంలో ఉన్నట్లే దత్తా కవిత లన్నిటిలోనూ నాటకీయత ఉన్నది. అందుకే దత్త రాసిన ఈ కవితలు సునాయాసంగా 'అభినయ కవితలు'గా, తగు అంగ విన్యాసంతో, అభినయంతో పాడుకోవచ్చు. 'బోలత్ కానాహీస్ బోలత్ కానాహి జాలెకాయ్ తులాబాయి' (మాట్లాడవెందుకు? నీ కేమైందమ్మా?) అనే కవితలో సున్నితహాస్యం ద్వారా ఒక నూతన కవితా లోకపు అనుభూతిని ప్రవేశపెట్టినాడు. ఎందుకు మాట్లాడలేదు? అని అడిగిన తరువాత, చిన్నపిల్ల తానే సమాధానం అందచేస్తుంది.

"ఈ రోజే వేణు యొక్క మగబొమ్మను నీకు పెనిమిటిగా నిశ్చయించినాను. అందుకే కాబోలు నీవు మూతి బిగించుకున్నావు. నీవేమి చెప్పకులే! నీ మౌనానికిగల రహస్యాన్ని నేను కనుగొన్నాను".

(సందర్భ వశాత్తు తన బొమ్మను మెచ్చుకుంటూనే ఆ రోజుల్లో ప్రచారంలో ఉండే బాల్యవివాహ పద్ధతిని గూర్చి ప్రస్తావిస్తుంది.) (ఎంత బుద్ధిమంతులో చూడు. నీవు అవి కొత్తవి అని భ్రమ పడేలాగ, తన చీరను. రవికెను ఎంత చక్కగా పెట్టు కుంటుందో!) బొమ్మ ద్వారా అమ్మాయి తనను గూర్చే మాట్లాడుతున్నదని భావిస్తారు.

'సంధ్యాకాల్ (సంధ్యాకాలం) అనేది దత్తా జోలపాటలలో ఒకటి. ఆదిపిల్లల పాట గాదు. అది ఆకాశపు విశాల ఛత్రం కింద చిన్నారి సూర్యుని పాకుతున్నట్టుగా భావించి, లలితమైన కళాకౌశలంతో గీచిన కవితా చిత్రం. 'నా ప్రియమైన చిన్న వాడు, ఎప్పటినుండి పారాడుతున్నాడో? అతని కళ్లు నిద్ర బరువుతో ఎరువెక్కినవి. నిదుర బో, నా బాల నిదుర బో, సంతోషంగా నిదుర బో."

సూర్యుని గమనాన్ని పాకుతున్న పిల్లవానితో పోలుస్తూ పిల్లవాని పట్ల తల్లికి గల ప్రేమానురాగాన్ని ఎంతో చక్కగా చూపుతాడు. వ్యాకరణ సూత్రాలను త్రోసి

రాజని, 'దిసతి' (కనబడుతుంది.) లోని 'ది' బదులు దీ (గుడిదీర్ఘం) వాడి పిల్లవాని పట్ల తల్లికిగల అంతులేని ప్రేమనూ ప్రకటిస్తాడు.

మీదట పేర్కొన్నట్టు, దత్తా రాసిన బాల గేయాలు ఎక్కువగా లేవు. కాని రాసిన ప్రతీది, సమయాన్ని, గతిని బట్టి ప్రత్యేకంగా పరిశీలింపవలసి ఉంటుంది. 'అ-ఆ-ఇ-ఈ' అనే కవితలో, పిల్ల తన కుక్కపిల్ల మోత్యాకు అక్షరాలు నేర్చు కొమ్మని ఒత్తిడి చేస్తుంది. తమ పెంపుడు జంతువులతో ఆడుకుంటున్నపుడు పిల్లలు సహజంగా ఏం చేస్తారో చూపుటే ఆ కవిత యొక్క ముఖ్యోద్దేశం. ఈ కవితలో ఒకచోట, 'అన్ని అక్షరాలు కఠినమైనవని అమ్మ అంటారు' అని కవి పిల్లచే అనిపిస్తాడు.

ఈ శబ్దాల్లో అక్షరాలు నేర్చుకునే కష్టకార్యాన్ని గూర్చి పిల్ల యొక్క భావాలు ఏ విధంగా ఉంటాయో చూడవచ్చు. పలక, బలపం తీసుకొని పిల్ల ప్రయాస పడుతూ ఉంటే తల్లి చూసి, ముసినవ్వుతు ఆనందిస్తుంది. పిల్ల తన అన్న చేస్తుండగా గమ నించి ఉంటుంది. తాను స్వయంగా చేయాలనుకున్నప్పుడు, తన తల్లి, అన్న ఏమ న్నారో జ్ఞాపకానికి వచ్చి ఉంటుంది. అయితే 'మోత్యా'తో అక్షరాలు రాయించటానికి కొంత ప్రయత్నిస్తే ఆమె సమస్యలన్నీ తీరిపోతవి. కారణం 'మోత్యా' కొంత రాసిం దంటే, తాను అంతకన్నా బాగా రాయగలదు. అందుకే 'మోత్యా'తో రాయించాలని తాపత్రయ పడుట. 'శికరే అ-ఆ-ఇ-ఈ' అనే పాదంలో 'రె' అనే అక్షరానికున్న ప్రత్యేకత ఇది.

'శహాణి బాహులి' (తెలివైన బొమ్మ) అనే కవిత, దత్తా చేసిన మరొక ప్రత్యేక సృష్టి. బాల కవితలు ఎక్కువగా వచ్చిన ఈ రోజుల్లో గూడా ఈ కవితకు ప్రత్యేక స్థానమున్నది. అందమైన ఈ కవితలోని 'సంగీతం' అది చూపే వివిధ చిత్రాలు, పరిశీలనశక్తి ఇవన్నీ చిన్నపిల్ల యొక్క అమాయక హృదయాన్ని, సవ్వడు లను ప్రతిబింబింప చేస్తవి. ఈ కవితలో పిల్ల, తల్లిపాత్ర ధరించి, బొమ్మ గుణగణా లను పొగుడుతుంది. బొమ్మ తప్పకుండా ఆ పిల్లకు కూతురవుతుంది. తల్లి బిడ్డల మధ్య ఉండే సంబంధం చక్కగా చిత్రింపబడ్డది. మెచ్చుకోవటంతో బాటు నిందిం చటం కూడా అందంగా మేళవింపబడ్డది. అట్లే, వాస్తవాన్ని, ఊహాగానాన్ని సమర్థ వంతంగా మేళవించటం జరిగింది. ఆటలాడుతున్న పిల్లను గూర్చి కవి గమనించిన భావాలను, బొమ్మలను ఆలంబనగా చేసికొని, పిల్ల తాను ఏ గుణాలు గలదిగా ఉండా

లవి అనుకుంటుందో ఆ పిల్ల నోట చెప్పించినాడు. 'బోలత్ కానామీ' (నీవెందుకు మాట్లాడవు?) అనే మరో కవితలో భావోద్రేకం కనబరచినాడు. అప్రయత్నంగా పిల్లల హృదయ సీమల్లోను, వారి ఇంద్రజాల లోకంలోను ప్రవేశించి అందమైన సంగీతాన్ని ఆలాపింపచేస్తాడు. పిల్లల యొక్క సన్నిహితమైన, స్వంతమైన లోకాన్ని కవి స్పష్టంగా, లోపరహితంగా చిత్రించిన ప్రోత్సాహక గీతం ఇది. పిల్ల తన బొమ్మను ఓదార్చ టానికి పడే శ్రమవలన కవిత ప్రత్యేకమైన విశిష్ట గుణాన్ని పొంద కలిగింది. ఇందులో బొమ్మ, తాను మెదిలే చిన్న ప్రపంచంలోని తనకు గల ఇష్టా-యిష్టాలను, వాంఛలను ప్రతిబింబింప చేస్తుంది. చివరకు బొమ్మ, తాను ఒకటవుతారు. "నిన్ను అమ్మ తిడుతుందా? అన్న బాధ పెట్టాడా? ఓ నా ముద్దుల బొమ్మా, ఎందుకు పరిహాసం చేస్తావు? నేనేం చేయాలె? ఎందుకు మాట్లాడవు చిట్టితల్లీ?" అంటుంది.

అందమైన ఈ పంక్తులలో పిల్ల యొక్క ప్రేమాదరణలు అతి సహజంగా మనసుకు హత్తుకపోయే రీతిగా కనిపిస్తుంది. ఇతరుల అనుభవాలను, పూర్తిగా సొంతం చేసికొని, అందులో లీనమై తన్మయత్వం పొందే అపురూప కళలో దత్తా ప్రావీణ్యం సంపాదించినాడు. అందువల్ల స్త్రీ యొక్క బాధను, దుర్భరమైన దారిద్ర్య దుఃఖభారంతో కృశించే దురదృష్టపు తల్లిపడే మనోవేదనను అర్థం చేసికోకలిగినాడు. దానితోబాటు సున్నితమైన బాలల అమాయక ప్రపంచంలో తన పాటల సహాయంతో సునాయాసంగా మెదులుతాడు.

ఈ పాటలన్నీ, సహజంగా పిల్లలు మాట్లాడుకునే భాషలోనే రాయబడ్డవి. వ్యాకరణ సూత్రాలకు భిన్నమైన భాషలో, తడబడుతూ ఉచ్చరించే పదాలను, వాక్యాలను పదే పదే వాడుతాడు. ఈ బాలలు ఉపయోగించే భాష స్వభావ స్వరూపాలను చూస్తుంటే దత్తాకు పిల్లల మనోవృత్తిని గూర్చి, ఎంతటి పరిజ్ఞానముండేదో తెలుస్తుంది. బాల గేయాలన్నిటి విజయం చివరకు, కవి, బాలల మనసులోకి దూరి వారి ప్రత్యేక ప్రపంచంలో తానూ ఒకడై ఉండకలిగే శక్తిమీద ఆధారపడి ఉంటుంది. దత్తా కవితలు ఈ ప్రపంచపు స్పష్టమైన ప్రతిరూపాలు. బాలలు అర్థం చేసుకునేవి, అనుభూతి చెందేవి, సంతోషించేవి, విచారపడేవి, అన్నిటినీ పిల్లలు ఉపయోగించే భాషలోనే ఆయన చిత్రించాడు. ఎందుకంటే పిల్లల చుట్టూ సంభవించే సంఘటనలు, ప్రయత్న పూర్వకంగా నేర్పనట్టి స్వాభావిక భాషలో ఉండాలనే సంగతి కవి బాగా గుర్తించినాడు. పిల్లలు దేన్ని ప్రేమిస్తారో; అప్పటికప్పుడు పుట్టుకవచ్చే పిల్లల తళం

పులు, వారి ఆసక్తి, కోరిక, 'చేసి చూడా'లనే ఆకాంక్ష అనాలోచితంగా అనుకరించా లనే గుణం - వీటిని కవి అర్థం చేసుకుంటాడు. దాన్నే కవి స్పష్టంగాను, అందం గాను గీతాలలో వ్యక్తం చేస్తాడు. దత్తా కవితలు సాధారణంగా, పాండిత్య గరిమ కలిగి, సంస్కృత భూయిష్ఠమై అసాధారణమైనవిగా ఉంటవి అనే విషయాన్ని గమనించినప్పుడు అతవి బాల గీతాలను మరింత ఎక్కువగా మెచ్చుకోవటం జరుగు తుంది.

దత్తా ఇందూరు కళాశాలలో పట్టభద్రుడైనాడు. అప్పుడది కలకత్తా విశ్వవిద్యా లయానికి అనుబంధంగా ఉండేది. తన కలం పేరు ఎన్నుకోవడంలో అప్పటి విఖ్యాత బెంగాలి కవి మైకేల్ మధుసూధనదత్ బహుశః ఆయన దృష్టిలో ఉండవచ్చు. అది వరకే, పిల్లలకొరకు రాసిన కవితలు చెప్పుకోదగినన్ని ఉన్నవనే ప్రతిష్ఠ వంగ సాహి త్యానికున్నది. దత్తాకు స్ఫూర్తి కలుగటానికి ఇది గూడా కారణం అయితే కావచ్చు. దానికి తోడు ప్రతి ఆదివారం ప్రార్థనా సమాజంలో చదివే పాటల పుస్తకాలలో బెంగాలీ గీతాలు చాలా ఉండేవి. దత్తా, రవీంద్రనాధ ఠాగూర్ రాసిన 'ఆయి భువన మోహిని' అనే బెంగాలి గీతాన్ని అనువదించి, ఠాగూర్‌ను మొదటిసారిగా మరాఠీ వారికి పరిచయం చేసినాడు.

ఒక వర్ధమాన కవి, పూర్వీకుల నుండిగాని, సమకాలీనుల నుండిగావి స్ఫూర్తి పొందితే, అది కేవలం సృజనాత్మక శక్తిని ప్రకోపింప చేసి, కవితా సృష్టికి కారణ భూతమవుతుందేమో కాని, నిజమైన, స్థిరమైన ప్రోత్సాహం మాత్రం కవి మనోవీధి నుండి రావలసిందే. నిజంగా, కలుషితం కానట్టి పిల్లల మనసునుండి స్ఫూర్తిని, భావాలను, చిత్తాలను, భద్రపరచి పెంచి, పెద్దచేసే శక్తి దత్తాకు పుట్టుకతో వచ్చింది. బహుశః, బాలకవి వలె, దత్తా, లోకాన్ని పిల్లల కంటితోనే చూసి ఉండ వచ్చు. ఆయన పిన్నవయసులోనే దివంగతుడైనాడు. కాబట్టి అప్పుడు గూడా ఆ చూపుతోనే చూసి ఉండవచ్చు. అది భగవంతునికే ఎరుక। అయితే కావచ్చు గూడా. ఎందుకంటే బాల ప్రపంచంతో దత్తా సన్నిహిత సంబంధం పెట్టుకున్నాడు. చిన్నవాడుగానైనా ఆయన వ్యక్తిత్వంలో - చాటున ఒక మూలలో 'శిశువు' తన ప్రత్యేక ప్రపంచంలో ఉంటూ ఉండేది. అది ఒక మాయాలోకం. అందులో 'భ్రమ' నిజమై తోచేదేమో?

దత్తా కాలం నాటి సాంఘిక పరిస్థితుల వైచిత్ర్యమేమిటంటే కాలానికి ముందు గానే యువకులు ముసలివారయ్యే వారు. చిన్నవయసులోనే విధులు బాధ్యతలు అనే

మోతలతో క్రుంగిపోయే వారు. స్వల్పమైన వసంతకాలం శిశిర హేమంతాలతో ఆవరింపబడేది. కాని దత్తా తన బాల గీతాల ద్వారా, వినోదకరమైన మాయా ప్రపంచంలో, పిల్లలు మొదటిసారిగా ప్రపంచ వేదికపై ప్రవేశించినట్లు అత్యంత ఆనందంతో మాట్లాడుతాడు. అప్పుడా మాటలు, బంధనాలు లేకుండా స్వేచ్ఛగా ఆనందాతిశయంతో, పాటలుగా మారుతవి.

దత్తా పుట్టుకవి - కళాకారుడు. సౌందర్య ద్రష్ట. అందమైన ప్రతి దాన్నీ ఆరాధించే వాడు. జీవితాన్ని అన్ని రూపాల్లోను సమానంగా చవి చూడాలనే వాడు. ఆయన కవిత, సంగీత వాయిద్యాలమీద ఆయన సాధించిన నైపుణ్యము, నఖచిత్రాలు చిత్రించుటలో ఆయన కౌశల్యం - ఇవన్నీ ప్రతి యొక్క రూపంలోనూ సౌందర్యాన్ని అన్వేషించాలనే అభిలాషకు సాక్షి భూతాలు. తెలుసుకోవాలనీ, స్పృశించాలనీ, లీనం కావాలనీ ఆయనకున్న గాఢమైన వాంఛవలన ఆయన స్త్రీ యొక్క, పిల్లల యొక్క హృదయాలలో ప్రవేశించటానికి వీలుకలిగింది. బాలల కొరకు రాసిన ఆయన కవితలు కనబడేలాగ, వినబడేలాగ, అంతే గాదు, చిరస్థాయిగా ఉండేలాగ చేసినవి. 1920 - 40 నాటి ప్రముఖ కవి అయిన మాధవజూల్యిన్ వెలిబుచ్చిన ఈ అభిప్రాయంతో మనం ఏకీభవించక తప్పదు. "మరాఠీ కవితాస్రవంతిని తన బాలకవితలనే స్వచ్ఛోదకంతో సుసంపన్నం చేసినాడు కాబట్టి, దత్తా, మరాఠి నవయుగ కవితా క్షేత్రంలో ప్రముఖ స్థానం ఆక్రమిస్తాడు."

# నాల్గవ అధ్యాయం

## సాంఘిక కవితలు - జాతీయ కవితలు :

దత్తా జీవితపు పుటలు తిప్పి చూస్తున్నప్పుడు, ఆ కాలం నాటి సాంఘిక పరిస్థితులను, ఆయన భావోద్రేక పూరితమైన ప్రతిస్పందనను, పరిశీలించినాము. ఆయన వ్యక్తిగత జీవితానికి సాంఘిక సంబంధమున్నట్లు మన మిదివరకే గమనించి నాము. అందుకే జాతీయ సమస్యలను గూర్చి, సాంఘిక సమస్యలను గూర్చి ఆయన రాసిన కవితలు స్పష్టంగా ఆయన వ్యక్తిత్వం యొక్క ఈ పార్శ్వానికి సంబం ధించినవి. ప్రార్థనా సమాజ్ యొక్క ఉత్కృష్ట బోధనలు క్రైస్తవ మతం యొక్క మానవీయతలతో పూర్వం నుండే ఆయనకు సంబంధాలు ఉండుటచేత ఆయన సంఘ సంస్కార ఉద్యమంతో గాఢమైన సంబంధం కలుగజేసుకున్నాడు. 1894 - 95 ప్రాంతంలో సాంఘిక, జాతీయ అభ్యుద్దాన భావతరంగాలు ఉవ్వెత్తున లేచినవి. సున్నితమైన మనసు కలిగిన దత్తా వంటి యువ కవికి - గేయ కావ్యాలకూ, ఆత్మాశ్రయ కవిత్వానికీ తన సాహిత్య కార్యకలాపాలను సీమితం చేయటం సాధ్యం కాలేదు. లోకమాన్య బాలగంగాధర తిలక్ లేపిన భావతరంగాలు, చూపిన కార్యశీలత మన జాతీయ, సాంఘిక చైతన్యం మీద బలవత్తరమైన పరిణామాలు కలుగచేసినవి. మహారాష్ట్రమంతటా నూతన జాగృతి వెల్లివిరిసింది. 'శివాజీ' ఉత్సవం, 'గణేశ ఉత్సవం' వంటి జాతీయ ఉత్సవాలు భావ ప్రకటనకు ఆలంబనాలైనవి. లోకమాన్యుని జన్మపట్టణమైన పూనా నుండి ఆవిర్భవించిన భావోద్రేకం మహారాష్ట్రంలోని జిల్లా కేంద్రాలవరకు పాకిపోయింది. చిన్న పట్టణమైన అహమద్ నగరులోవున్న దత్తా వంటి యువకులు తీవ్రంగా ప్రభావితులైనారు. ఈ యువకులకు తమ దేశపు సుసంపన్నమైన గత చరిత్ర తెలుసు. అందుకు గర్వపడేవారు గూడా. దానితో బాటు తమ కాలం నాటి బాధాకరమైన పరాధీన అవస్థలో నున్నామనే పరిజ్ఞానం గూడా ఉండేది.

యువకులలోని ఈ జాతీయ, సాంఘిక పరమైన జాగృతి అనవాయితీగా దీన్ని బలపరిచింది. 1870 లగాయతు మహారాష్ట్ర ఒక కొత్త రాజకీయ, ఆర్థిక, సాంఘిక అభివృద్ధి క్షేత్రంలో క్రమవికాసం పొందుతూ వచ్చింది. వాస్తవానికి జ్యోతిబాపులె, బాలశాస్త్రి జాంబేకర్, డా॥ భావుదాజిలాడ్, దాదోబాపాండురంగ్ మొదలైన జ్ఞాత, అజ్ఞాత సంస్కర్తల నిరంతర కృషి ఫలితంగా సాంఘిక జాగృతి 1870 కి చాల పూర్వమే ఆరంభమయింది, ప్రారంభకులలో జ్యోతిబాపులే అగ్రగామి. మహారాష్ట్ర

లోని సంస్కార ఉద్యమ ప్రభంజనంలో ఆయన 40 సంవత్సరాల పాటు చలించ కుండా నిలిచినాడు. ఆయన భావాలతో అందరూ ఏకీభవించక పోవచ్చు. లేక వ్యతి రేకించవచ్చు గూడ. కాని ఆయనను త్రోసిరాజనలేము. జ్యోతిబాపులె తన కార్య క్రమాలన్నిటిలో న్యాయమూర్తి గోవిందమహదేవ్ రానడె సమర్థవంతమైన సహాయ సహకారాలను పొందినాడు. న్యాయమూర్తి రానడే బాగా చదువుకున్నవాడు. సాను భూతి చూపే స్వభావం కలవాడు కాబట్టి ఒక సంస్థగా కీర్తికెక్కాడు. జి. వి. జోషిని, జనసామాన్యం 'సార్వ జనిక్ కాక' (ప్రజల మనిషి) అనేవారు. ఆయన సహాయంతో 1872 లో 'సార్వజనిక్ సభ' (సర్వజనుల సభ) అనే సంస్థ నెలకొల్పినాడు. ఒకప్పుడీ సంస్థవారు 'శిస్తు చెల్లించరాదు' అనే ఉద్యమం లేవదీసి కర్షకులకు వారి హక్కుల గురించి పరిజ్ఞానం కలుగచేసినారు. ఈ ఉద్యమంవల్ల ప్రభుత్వం కర్షకుల కోరికలు గుర్తించవలసి వచ్చింది. దీనితోనూ, 1870 తర్వాత వచ్చిన ఇతర ఉద్యమాల ఫలితం గానూ నిద్రావస్థలో ఉన్న మహారాష్ట్రలోని మధ్యతరగతివారు మేల్కొన్నారు. భూమి దున్నే రైతులను గూర్చి ఆలోచించాలనే భావం కలిగింది. జాతిని జాగృతిపరచే ఈ ఉద్యమంలో లోకమాన్యునికి ఒక ప్రత్యేక స్థానమున్నది. జాతీయ ఉద్యమ భావాలను, గ్రామ సీమలోనికి తన దిన పత్రికలైన 'కేసరి', 'మరాఠా'ల ద్వారా, ప్రజలు మాట్లాడుకునే భాషలో, వాటికి అర్థమయ్యే మాటల్లో అందచేసినాడు. ప్రభుత్వ విధా నాలను నిర్భయంగాను, సూటిగాను విమర్శించేవాడు. తన ఉద్యమానికి గట్టి పునాదులు వేయటానికిగాను ప్రజలకు అవగతమయ్యే పద్ధతుల ద్వారా జాతిని జాగృతి పరచ టానికిగాను, తిలక్, మన గత చరిత్ర వైపు, మతం వైపు దృష్టి మరల్చి, ప్రజలకు దైవారాధన పట్ల గల మనోవృత్తిని ఆలంబనగా తీసుకున్నాడు. తత్పరిణామమే 'శివాజీ ఉత్సవాలు', 'గణేశ ఉత్సవాలు'. వీటి మూలంగా, ఇంతవరకు సాంప్రదాయ సిద్ధంగాను, వ్యక్తిగతంగాను ఉండే హిందూ సమాజంలో ఐక్యతా భావం, సాంఘిక మైన గుర్తింపు కలిగింది. పిల్లలు, యువకులు, జట్లు జట్లుగా దేశభక్తి పూరితమైన పాటలు పాడుతూ, ఈ పండుగల సందర్భంగా ఊరేగేవారు. స్వయంగా లోకమాన్య తిలక్, ఆయన విశ్వాస పాత్రులైన, సహచరులైన, శివరాం మహదేవ్ పరాంజపె, నరసింహ చింతామణ్ కేల్కర్, మహారాష్ట్ర ప్రదేశమంతా తిరిగి, సభలలో, సమా వేశాలలో ప్రసంగిస్తూ ప్రజల సాంఘిక, జాతీయ భావాలను ఉద్రేక పరచేవారు. ఈ ఉద్యమం మహారాష్ట్ర ప్రాంతమంతటినీ ఉద్రేక పరచింది. ప్రజాశక్తికి ఒక కొత్త మలుపును, నవచైతన్యాన్ని స్ఫురింప చేసింది. సునిశిత హృదయంగల దత్తా వంటి యువకులు ఇంతటి గొప్ప ఉద్యమంతో ప్రభావితులు కాకుండా ఉండలేక పోయినారు.

'గణపతి' ఉత్సవాలు, 'శివాజీ' ఉత్సవాలు మతం పేరిట ఆరంభించినవి కావనీ, దాని వెనుక లోతైన సాంఘిక, నైతిక పరమైన అంతర్వాహిని ప్రవహిస్తున్నదని దత్తా గమనించ కలిగినాడు. అందుకే దత్తా రాసిన 'మావలాలకు పిలుపు: (ఇక అన్నం నీరు చాలు. రణభేరి మోగింది. కాలం వృధా బుచ్చకు. అప్పుడే ఆలస్యమవుతున్నది. యుద్ధరంగంలో శత్రువు ఎదురు చూస్తున్నాడు. తొందరగా రండి. ఓ మావలాలు యుద్ధానికి రమ్మంటున్నాడు శివాజీ!) అనే గేయానికి గల భూమికను అర్థం చేసికోవాలంటే దత్తా హృదయపూర్వకంగా ఈ ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నాడనే విషయాన్ని తెలిసికోవాలి.

తన చుట్టూ తారుమారవుతున్న సాంఘిక, రాజకీయ పరిస్థితులు ఒక రూపాన్ని దాలుస్తూ ఉండడం - దత్తా కవిత్వంపై తీవ్రమైన ప్రభావాన్ని కలుగజేసింది. కేశవసుత్ కవిత్వం - పరాయి ప్రభుత్వం కింద బతుకుతున్న విషయం ద్వారా ఎక్కువ తీవ్రంగాను, గాఢంగాను ప్రభావితం అయింది. పరాధీన స్థితిలో, పరాభ వాగ్నిచే తప్తమైన బాధిత హృదయంతో ఒకచోట అంటాడు - ''బానిసతనంలో మనకు చూడటానికి కండ్లు గాని, వినటానికి చెవులు గాని ఉండవు'' అని. అదే కాలంలో (19వ శతాబ్దాంతాన) మరో మరాఠీ కవి వినాయక్ తన 'హత భాగిని' (అదృష్ట హీన) అనే కవితలో వైభవోపేతమైన గత కాలాన్ని గూర్చి పొగుడుతూ బానిస జాతిగా అప్పటి ప్రస్తుత పరిస్థితి గూర్చి దుఃఖిస్తాడు. ''భారతీయుని వచనాలు'' 'జియాజీరావు శిండె', 'తుకోజీ హోల్కర్' మొదలైన కవితలలో కేశవసుత్ దేశ భక్తి భావాన్ని వ్యక్తం చేస్తాడు. అయితే కేశవసుత్ కవిత్వం సాంఘిక అవగాహన, సంప్రదాయంపై తిరుగుబాటు కవితగానే ప్రసిద్ధి చెందింది గాని జాతీయ భావోద్రేకం కలుగజేసిందిగా కాదు. మన సాంఘిక దురాచారాలపై తీక్ష్ణమైన చూపు సారించడం ఆయన అనేక కవితలలో చూస్తాము.

రెవరెండ్ తిలక్ గూడా తన దేశభక్త భావాలను 'నా మాతృదేశం పేరు', 'ప్రియమైన హిందుస్తాన్' అనే కవితలలో వ్యక్తపరచినాడు. దత్తా గూడా, దిగజారిన ప్రజల స్థితులను చూచి మనస్తాపం చెందినట్లు ఆనాడు ఆయన రాసిన అనేక కవితల్లో దృగ్గోచరమవుతుంది. 'స్వాతంత్ర్యానికి', 'కాషాయ పతాకంలో మావలాలకు పిలుపు' 'శ్రీ శివ ఛత్రపతి' వంటి కవితలలోని కొన్నిటి శీర్షికలే చాలు వాటిలోని విషయాన్ని అర్థం చేసికోటానికి. వీరోచిత చర్యలకన్న దయనీయ పరిణామాలకు ఎక్కువగా చలించిపోయే స్వభావం దత్తాది. అందువల్లనే ఆ కవితలలో, వీరోచిత సంఘటనలు, సాహసోపేత చర్యలు, గత వైభవాలకన్న ప్రస్తుత దాస్యంవల్ల కలుగుతున్న దీనా

వస్థనే ఎక్కువగా వర్ణించినాడు. 1898లో మనోరంజన్ అనే పత్రిక, 'దీపావళి' సంచిక కొరకు ఒక కవిత రాయవలసిందిగా దత్తాను కోరినారు. బాధాకరమైన వర్తమానాన్ని వర్ణిస్తూ దత్తా "హృదయాలలో చీకట్లు కమ్మినప్పుడు, దీపాలు వెలిగించుటలో అర్థమేమున్నది? మన దేశం విచారంలో మునిగి ఉండగా నేను ఏ పండగైనా ఎట్లా చేసికో కలుగుతాను? ఔను. నేను దీపావళి జరుపుకుంటాను. నా దేశం సస్య శ్యామలమై సుసంపన్నమైనప్పుడు," అని రాసినాడు.

తన 'అందమైన పక్షి' అనే కవితలో దత్తా 'నీ కొరకు ఒక అందమైన పంజరం కట్టాను, బాగా తినిపిస్తాను' అని అంటాడు. కాని, అది దుఃఖంతో క్రుంగి కృశించటం గమనించి దాన్ని వదిలి పెడ్తూ 'వెళ్ళిపో మిత్రమా, స్వేచ్ఛగా ఎగిరిపో. బంధనంలోని కష్టాలను తెలిసిన నేను పంజరంలో నిన్ను ఎట్లా బంధించగలను.' అని అంటాడు.

ఉగాదినాడు శక పురుషుడైన మహారాజా విక్రమాదిత్యుని సంస్మరించుకొని 'విక్రమా! కోపగించకు. దేశం ఇంతగా కృశించి పోతుంటే కళ్ళెందుకు మూసుకున్నావు. దేశాన్ని రక్షించటానికి మళ్ళీ నడుం బిగించు. ఆ రోజే నిజమైన ఉగాది. కనక గర్భ అయిన మన దేశానికి ఒక గొప్ప పండుగ' అన్నాడు.

'శ్రీ ఛత్రపతి' అనే శక్తివంతమైన కవితలో శ్రీ మహావిష్ణువు నాలుగో అవతారమైన నరసింహునితో శివాజీని పోలుస్తాడు. ఆ నాటి ప్రత్యేక పరిస్థితుల్లో రాజద్రోహాన్ని ప్రబోధించేది లేక ప్రభుత్వాన్ని అధిక్షేపించేది ఏదైనా నేరుగా చెప్పడానికి వీలులేకుండేది. అందుకని ప్రస్తుతాన్ని పరోక్షంగా గత కాలపు వైభవానికి విరుద్ధంగా చిత్రించడం ఆనాడు మామూలైపోయింది. ఆ కాలపు గొప్ప దేశభక్తుడు, పత్రికా రచయిత అయిన శివరాం మహదేవ్ పరాంజపేయొక్క ఘాటైన అన్యాపదేశ రచనలు, ఈ హద్దులను అవరోధించి జరిగినవి. 'భగవా ఝండా' (కాషాయపు జండా) అనే కవితలో కవి తన్ను తానే అధిక్షేపించుకోటానికి వెనుకాడడు. 'బాజీరావు బ్రాహ్మణుడైనా ఈ జండా కింద యోధుడైనాడు. క్షత్రియ కులంలో పుట్టిన నేను జండా నేలనొరిగినప్పుడు ఎందుకు జీవించాలి?' అని.

ఈ కవితలలో దత్తా తన నిగూఢ భావాలను, ఆవేదనను వ్యక్తపరచినాడు. అది ఆనాటి పరిస్థితులకు, సున్నితమైన మనసుగల ఒక కవి హృదయం స్వాభావికంగా చెందవలసిన స్పందన. ఇదే రకమైన మనోవేదనను దత్తా సమకాలీనులైన వినాయక్, కేశవసుత్, రెవరెండ్ తిలక్‌లలో గూడా చూస్తాము. అయితే దత్తా గేయ కవి. సహజమైన సౌందర్య పిపాస గలవాడు. ప్రేమ, ప్రకృతి ఈ రెండే స్ఫూర్తి

నొసగే సాధనాలు. అందుకని ఎక్కువగా మానవుని దాస్యంలోని దయనీయ స్థితిని వర్ణించేదిగా ఉండేదే కాని, దానికి విరుద్ధంగా, ఎదురించటానికి గాదు. అందుకే మనం దత్తా రాసిన జాతీయ కవితలలోనూ, సంఘ పరమైన కవితలలోనూ కేశవసుత్ కవితలలో కనబడే ప్రజ్వలనం, పోరాటపు భావం కనబడదు. అందుకు విరుద్ధంగా, దత్తా రాసిన దేశభక్తి కవితలలో, ఆత్మ పరిశీలన, నిరాశాభావం, గత కాలపు జ్ఞాపకాలు కానవస్తవి. కాని, ప్రజలను కార్యోన్ముఖులను చేయటానికి ఉద్రిక్త పరచేవిగా వారి భావాలను ఉద్రిక్త పరచేవిగాను, భవిష్యత్తులోకి తొంగిచూసే, చూపు కలిగించేవిగాను ఉండవు. అసమానత, అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా జాతీయ ప్రతిఘటన గూడా కనబడదు. యువతలోని సున్నితమైన మనస్సు, దేశమాత పిలుపును, ఇతర ఉద్రేక పూరితమైన ఉద్యమాలవలెనే స్వీకరిస్తుంది. అదిగాక యువతరంలో దేశభక్తి భావం ఎక్కువగా ఉంటుంది. చుట్టు పరిసరాలు వ్యతిరేకంగా ఉన్నప్పుడు అవి ప్రత్యేకంగా ఆకర్షిస్తవి. అయితే ఇటువంటి కవితలు, కవి యొక్క నిజమైన వ్యక్తిత్వాన్ని గాని, అతని అంతర్గత భావాలను గాని స్పష్ట పరుస్తవని అనుకోవటం పొరపాటు. దత్తా దేశభక్తి కవితలన్నీ పరిమితమైన పరిస్థితిలోనివని గుర్తించవలసి ఉంటుంది, ఈ అన్నిటిలో ఉద్రేకపూరితమైన 'స్వేచ్ఛకు' అనే కవిత, చివరి రెండు పంక్తులలో దత్తా 'తమ మాతృదేశంలో స్వాతంత్ర్యం ఇస్తారు కాని బయట నిరోధిస్తారు' అని విదేశ పాలకులను విద్వేషిస్తూ, అవహేళన పరచినాడు.

దత్తా, స్వచ్ఛమైన స్వాతంత్ర్య ప్రియుడు. ఆయన జీవించింది ఉద్రేకపూరితమైన కాలం. ఆయన సున్నితమైన మనసు ప్రభావితమైనట్టు కవితల ద్వారానే గాక, చర్యల వల్లగూడా స్పష్టపరచినాడు. లోకమాన్యుడు ఆరంభించిన 'శివాజీ', 'గణపతి' ఉత్సవాలలోను, 'స్వదేశీ' వంటి జాతీయ ఉద్యమాలలోను, సంఘ సంస్కార ఉద్యమాలలోను దత్తా పాల్గొన్నాడు. 'గణపతి' 'శివాజీ' ఉత్సవాల వంటి సమకాలీన, సంఘ సంస్కార, రాజకీయ ఉద్యమాలలో పాల్గొనటంతోనే ఆగలేదు దత్తా. 1895 లో జరిగిన అఖిల భారత, జాతీయ కాంగ్రెస్ సమావేశంలో స్వచ్ఛంద సేవకునిగా పాల్గొన్నాడు. స్వచ్ఛంద సేవకుని దుస్తులతో తీయించుకున్న ఫోటో ఇప్పటికీ లభ్యంగా ఉన్నది.

అత్యుత్సాహంతోను, అలసట నెరుగని దీక్షతోను అహమద్ నగర్‌లోని తన యువ మిత్రులకు ఈ ఉద్యమాల జాతీయ ప్రాముఖ్యాన్ని తెలియపరిచినాడు. అహమద్

నగర్‌లో మొదటి సార్వజనిక గణేశోత్సవం జరుపుటలో ప్రధాన పాత్ర వహించినాడు. వందకు పైగా బడిపిల్లల జట్లు ఉత్సవంలో పాల్గొన్నవి. వాటన్నిటికీ ప్రోత్సాహకర మైన పాటలు రాసి ఇచ్చింది దత్తానే. తర్వాత ఆ పాటల నన్నిటినీ, దత్తానే సేకరించి 'ఒక అహమద్ నగర్ వాసి' అనే కలం పేరుతో కరపుస్తకాన్ని ప్రకటించినాడు. అవి అప్పటి సమస్యలను గూర్చి రాయబడినందుకు జనాదరణ పొందినవి. ఆ రోజుల్లో హిందూ ముస్లిం వైషమ్యాలుండేవి. ఈ సమస్యపై దత్తా 'ఓ భారత వాసులారా! నా ప్రార్థన వినండి. మీ ఈర్ష్య-అసూయలను మరచిపోండి. దేశ క్షేమానికై పాటు పడండి. మనలోని పాత వైషమ్యాలను రేకెత్తిస్తే మనం సర్వం గోలుపోతాము. ఓ హిందువు లారా! ముస్లిం లారా! ప్రేమతో దగ్గరకు రండి, స్వదేశీ వస్తువుల కొనండి' అని తన ఆవేదనను వ్యక్తపరిచినాడు.

విగ్రహారాధనలో నమ్మకం లేని దత్తా, ప్రార్థనా సమాజ్ వాతావరణంలో పెరిగినవాడు, గణపతి ఉత్సవాలలో ఎట్లా పాల్గొన కలిగినాడు? అయితే ఒక విషయం. దత్తాకు ఉత్సవాలయొక్క మత దృష్టితో సంబంధం లేకుండేది. ప్రజలలో సామాజిక స్పృహను రేకెత్తించి, 'సంఘీ భావమే బలము' అనే నిత్య సత్యాన్ని తెలియచేయటానికి ఇది ఒక బలవత్తర సాధనమని గుర్తించినాడు. నిజానికి ఉత్స వాల సందర్భంలో, సామాజిక, జాతీయ పరమైన ఈ భావనయే ఎక్కువ ప్రాధాన్యం పొందినది, ఆయన కోరికపై అనేక ప్రముఖ వ్యక్తులు ఉత్సవ సందర్భంగా నగర్ సందర్శించి స్థానిక ప్రజలను సంబోధించినారు. దత్తా ఈ రోజుల్లో స్థానిక దినపత్రిక 'తుకారాం'కు చారిత్రిక, మత విషయాలపై వ్యాసాలు రాసేవాడు.

తమ దేశాన్ని గూర్చి రాసేటప్పుడు, 'నిబంధ మాల' రచయిత, విష్ణుశాస్త్రి చిప్లూన్‌కర్, కేశవసుత్ వంటి కవుల ముందు మన రచయితలు ఆత్మ వంచనకు గురి అయినారు. అప్పుడు దత్త బిందు యవ్వనంలో ఉన్నాడు. లోకమాన్యతిలక్ వర్ణించి నట్టు 'ఆకారంలేని చైతన్య రహితమైన ఈ దేశం' లో మెల్లగా, కాని నిలకడగా వికాస లక్షణాలు పొడచూప సాగినవి. ఈ సంధి కాలంలో దేశభక్తితో ప్రేరితులైన ఇతర కవులతో బాటు, దత్తా సాధారణమైన స్థానాన్ని పొందినాడు. తన పరిసరాల లోని ఉద్యమాలతోను సంఘటనలతోను ప్రభావితుడైన మాట నిజమే కాని వీటివలన ఆయన పొందిన స్పందన మాత్రం అచ్ఛమైంది, గాఢమైంది గూడా. అయితే దాన్ని వ్యక్తపరచింది మాత్రం కవిత్వం ద్వారానే; ఎందుకంటే ఆయన మనసారా ప్రేమిం చింది - క్షుణ్ణంగా అర్థం చేసికున్నది కవిత్వమే కాబట్టి, ఈ కవితలు వాటి ఔచిత్యం కలిగి ఉండుటే గాక ఆయన వ్యక్తిత్వాన్ని గూడా ప్రస్ఫుట పరుస్తవి. ఇది మనం అర్థం చేసికొని గుర్తించవలసి ఉంది.

# అయిదవ అధ్యాయం

## ప్రేమ కవితలు - గేయాలు :

ప్రేమ కవితలు, గేయాలు ప్రతి సాహిత్యంలోను అతి ముఖ్య భాగంగా పరిగణింపబడుతవి. కవి యొక్క భావోద్రేకతకు, ఈ విభాగానికి సన్నిహితంగా ముడి పెట్టబడుతుంది. దత్తా యొక్క భావోద్రేక ప్రపంచం, బైరన్, షెల్లీ, మొదలైన ఆంగ్ల కవులతో బాటు, సంస్కృత కవులైన కాళిదాసు, భవభూతుల రచనల వల్లగూడా ప్రభావితమైంది. ఆయన ప్రేమ కవితపైన మాత్రం ఉభయుల ముద్ర పడ్డది. ఆయన కొన్ని రచనలు, స్పష్టంగా, సాహసోపేతంగా, విశృంఖలంగా, నిస్సంకోచంగా వైవాహిక ప్రేమను ప్రదర్శించడం చెప్పుకోదగ్గ విషయం. ముఖ్యంగా మన 'షాహీర్' లేక జానపద గాయకుల ప్రదర్శనల పట్ల దత్తకవికి గల ప్రగాఢ వాంఛను వారు మెచ్చుకుంటారు. దత్తా కవితలలో కనిపించినంత వైవిధ్యం, మరే మరాఠీ కవులలోను కనుగొనుట నిజంగానే కష్టసాధ్యం. ఆయన ప్రేమ కవితలలో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని, ఆయన మనోగత భావాలు, ఉద్రేకాలు మనకు గోచరిస్తవి.

కవితను ప్రేయసిగా సంబోధించటం 1885 తర్వాత వెలసిన మరాఠీ కవితలోని అంగీకృత పద్ధతి. మరాఠీ కవిత, ఈ సంప్రదాయాన్ని ఆంగ్లం నుండి ఎరువు తెచ్చుకున్నది. ఇక ఆంగ్ల కవిత షేక్స్పియర్ కాలం నుండి అనుసరిస్తూనే ఉన్నది. 'లాబెలెడేం సాన్సిమెర్సి' అనే కీట్స్ యొక్క విఖ్యాత గేయం, ఇటువంటి ఉపమానానికి గొప్ప ఉదాహరణ. ఈ రకానికి చెందిన కవితలను షేక్స్పియర్, ఆయన సమకాలీనులైన సిడ్నీ, మార్లో, సర్రె మొదలు టెనిసన్ వరకు ఎందరో రాసినారు. కేశవసుత్, ఆయన సమకాలికులు, ఆయన అనుయాయులు, ప్రేమాభిలాషను ఈ రీతిగానే వెలిబుచ్చినారు. 'నన్ను పిచ్చివానిగా చేసిన వారిపై మొర' అనే కేశవసుత్ రాసిన కవిత ఇటువంటి భావప్రకటనకు గొప్ప ఉదాహరణ. దత్తా కవితలో గూడా ఇటువంటి ప్రత్యేక శైలి కనిపిస్తుంది. ఒక కవితలో దత్తా కవితలదేవి (సరస్వతి)ని, మానవాకారంలోని తన ప్రేయసిగా సంబోధిస్తాడు. 'ప్రేయసీ! ఎన్నాళ్ళు నీవు నా ఓపికను పరీక్షిస్తావు' అని. మరో కవిత 'ఓ కవితా ప్రేయసీ' అనేది; అయితే ఈ ఫక్కీకి చెందిన దత్తా కవితలు, సంప్రదాయ బద్ధమైనవని గాని, అనుకరణ అని గాని అనుకోరాదు. ఈ కవితలలో మనం ఆయన హృదయం యొక్క ప్రతిబింబాన్ని స్పష్టంగా చూడ కలుగుతాము. నిలుకడలేని ఆయన మనసు ఈ కవితలలో శాంతిని పొందగలిగింది. దానంతటదే ఆయనను వరించింది.

ఆయన, దానిని అనునయపరచి, ఆలింగనం చేసికొని, ఏకచిత్తంతో చేరదీసినాడు. 'కవిత'ను సంబోధించిన కవితలలో మనకు దత్తా యొక్క స్వచ్ఛత, ఆయన హృదయాంతరాళాల నుండి ఉబికి వచ్చిందని గుర్తిస్తాము, ఇవి సంప్రదాయాల పరిధిని దాటిపోతవి కాదట్టి ఇందులో మొదటిది, మనకు 'షెల్లి' రచించిన 'లవ్ ఫిలాసఫీ' (ప్రేమ తత్వం)ని జ్ఞాపకానికి తెస్తుంది. ఈ కవితలో 'ప్రేమలేని జీవితం అర్ధరహితమైందని నీకు తెలియును గదా! మరి నీవు నన్నెందుకు ఈ విధంగా బాధిస్తావు?' అంటూ దత్తా ప్రేమ యొక్క ప్రతిభను, మహత్వాన్ని గూర్చి గానం చేస్తాడు. ఇక్కడ కవి వియోగ బాధ తాళలేక గుండె నిబ్బరాన్ని గోల్పోయి నిరాశతో విలపిస్తాడు. 'నీవెక్కడున్నావు? నీకోసం ఎక్కడని వెదుకను? నీవు వెంట లేక నేను తోవ తప్పినాను. నా ఏకాంత జీవితం సెలయేరువలె గమ్యం లేకుండా పారుతున్నది.' ఈ శబ్దాలలో దత్తా తన నిరాశాపూరితమైన మనోవేదనను వ్యక్తపరుస్తాడు. ఇంకా అంటాడు: 'ఎవరి కొరకైతే నేనీ లోకంలో జన్మించినానో? ఎవరితో నేనున్నానో? అయ్యో! ఇప్పుడామె నన్ను విడిచిపోయింది. ఇక నేనెందుకు జీవింతును?' 'కుసుమలాలన్' (నా ఇష్టమైన పువ్వు) అనే కవితలో, కవి, చెదురుమదురుగా పడి ఉన్న పువ్వులనన్నిటిని ప్రేమతో ఆహ్వానిస్తాడు. తన కవితా ప్రేయసిని చూసి వెళ్ళమని. ఆమె వాటిని తన తొడపైన పెట్టుకొని మధురంగా పాడుతుంది. ఆయన అంటాడు 'కవిత, నిజానికి నా మొదటి ప్రేయసి, పరితప్త ఆత్మకు శాంతి' అని. ప్రేమ కవితలు అనే వాటిలో కన్న, కవితను సంబోధిస్తూ రాసిన ఈ కొన్ని కవితలలో, ఆయన తన ప్రేమను ఎక్కువ విపులంగా వ్యక్తపరుస్తాడు.

దత్తా ప్రకృతి కవితలు, ప్రేమభావాన్ని ఎట్లా వ్యక్తపరుస్తాయో మీదటి అధ్యాయంలో మనం చూసినాము. ఆయన తీవ్రమైన వాంఛలకు, కోరికలకు, సహజమైన మార్గం వీటి ద్వారానే లభించింది. ఆయన మరికొన్ని కవితలు 'ప్రేయసి' 'నా ముందునుండి తొలగిపో', 'స్వప్నంలో కలయిక' 'హరిణాక్షులైన ఆడవారున్న చోటల్లా మన్మథుని దోపిడి జరుగుతుంది', 'ఒక ప్రార్థన' - వీటిని మనం ఆయన ప్రేమకవితలు అనవచ్చు. ఇక్కడగూడ ప్రేమ వివిధ రీతులలో కనబడుతుంది. 'నా ముందునుండి తొలగిపో' అనే కవిత తన్ను గూర్చిన ఘాటైన గేయం. ఇక 'ప్రేయసి', 'స్వప్నంలో కలయిక' సంస్కృతంలోని ప్రాచీన కావ్యాల శైలిలో 'విప్రలంభ' శృంగారాన్ని పోలి ఉంటుంది. ఇక 'హరిణాక్షులైన ఆడవారున్న చోటల్లా మన్మథుని దోపిడి జరుగుతుంది' అనే గేయంలోను, 'ఒక ప్రార్థన' లోను స్త్రీల కోర్కి

కలు చాలా తెలివిగా, చాకచక్యంగా ప్రదర్శింప బడ్డవి. ఆ యా విషయాలకు తగినట్టుగా ప్రతిదాని శైలి వేరు వేరుగా ఉన్నది. 'సంతోషము లేని పెనిమిటి' అనే కవిత, ఏ వర్గంలోనికీ రాదు. ఇది పూర్తి స్వకీయమైనది. కవి హృదయావేదనను వ్యక్తం చేస్తుంది. ఈ కవిత యొక్క నిజమైన ప్రాముఖ్యాన్ని తెలిసికోవాలంటే కవి యొక్క చిన్ననాటి జీవితాన్ని, ఆయనను ప్రభావితం చేసిన సాంఘిక వాతావరణాన్నీ తెలిసికోవలసి ఉంటుంది. దత్తా అమెరికన్ మిషనరీల సాంగత్యంలో, అభివృద్ధికరమైన స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగినాడు. విల్సన్ కళాశాలలో ఉన్నప్పుడు ఆంగ్ల, సంస్కృత సాహిత్య సుధారసాన్ని తనివితీర ఆస్వాదించినాడు. ఇవి ఆయన జీవిత నిర్మాణపు ప్రాథమిక దశను ఎక్కువగా ప్రభావితం చేసినవి. స్త్రీని గూర్చి, స్త్రీ పురుషుల మధ్యగల ప్రేమను గూర్చి అన్యోన్య అవగాహన వల్ల, కలయిక వల్ల సంపన్నమైన భావాలు ఆయన తరుణ మనసులో ఒక క్రొత్తవీధిని తెరచి, వాటితో సహజీవనం చేయాలనే వాంఛను రేకెత్తించినవి. కాని వాస్తవానికీ, ఆదర్శానికీ హస్తిమశకాంతరం. కాబట్టి ప్రచలిత ఆచారాలకు, పరిస్థితులకు లోనైనాడు. వాస్తవానికి, ఆదర్శానికి మధ్యగల అఖాతం ఆయనకు దాటరానంత పెద్దదిగా తోచింది. కఠినమైన పరిస్థితుల వలన, ఆయన వ్యక్తిత్వపు అవరోధాల వలన వాటిని అధిగమించజాలలేదు. ఆయన తల్లిదండ్రుల కఠిన ప్రవృత్తిని, శ్రీ వి. డి. ఘాటె చక్కగా విశ్లేషించినాడు. ఆయన తన స్వీయచరిత్రలో 'నా తల్లి ఒక పల్లెటూరి పిల్ల. అవగాహనకు పరిమితమైన అవకాశాలు గలది. నా తండ్రి దత్తా యొక్క వర్ధమానమూ, వికాసవంతమూ అయిన కోరికలను గాని, కవితా ఆశయాలను గాని సంతృప్తి పరచజాలలేదు. వారిద్దరిమధ్య ఉన్నట్టి ఈ మౌలికమైన తత్త్వభేదం వల్లనే దత్తా మనస్సు వాస్తవికతనుండి కాల్పనిక జగత్తుకు రెక్కలు కట్టుకొని ఎగిరింది. దత్తా కవి సునిశిత బుద్ధి కలవాడు. కాళిదాసు, భవభూతులలో పూర్తిగా లీనమై పోయేవాడు. 'గోల్డన్ ట్రెజరి' లోని కవితలలో నిమగ్నమయ్యేవాడు. అనుభవం లేనివాడు. ఓపిక లేనివాడు. కాంక్షలు గలవాడు. ఆయనెప్పుడూ ముందుకు పరుగెత్తేవాడు. ఇక నా తల్లి నాని - తన సహజమైన మందగమనంతో ఆయన వెనుక ఒంటరిగా నడుస్తూ అలిసిపోయేది. కాని చిన్న వయసులోని దత్తాకు వెనుక తిరిగి చూడటానికే తీరిక లేకపోయేది. అది, ఆయన గమనించే వరకే కాలాతీతమైంది. 'ఈ నాలుగు వాక్యాలు భార్యా భర్తల మధ్యగల వైమనస్యాన్ని తెలుపుతవి. నా కళను ఎవరికి చూపించేది? నేనెవరిముందు నా కవితాగానం చేసేది? నా దేహంలోను, ఆత్మలోను వ్యాపించిన ప్రేమను ఎవరికి తెలుపుకొనేది?' ఆయన లేఖినినుండి వచ్చిన ఈ విషాద శబ్దజాలం

ఒక్క ఆయన వ్యక్తిగత విషాదాంత భావమే గాదు. ప్రతిస్పందనలేని భార్యలను వివాహమాడిన, విద్యావంతులైన అనాటి యువకులు అందరి మనోగత భావం కూడా. ఎటువంటి నిరాశా స్థితికి దత్తా వచ్చినా డంటే 'నా అదృష్టంలో ఒక ప్రేమ బిందువైనా లేదు. నేను జీవితంతో అలసి పోయినాను' అంటాడు. నిరాశకూ, నిస్పృహకూ ఇది దాదాపు ప్రతీకగా నిలిచిన కవితా పంక్తి. ఏవో కొన్ని అప వాదులు తప్ప, దత్తా కవితలలో - ఫలించిన ప్రేమ వృత్తాంతపు ఛాద కనబడదు. సాధారణంగా, సంప్రదాయంగా, ఉండే కవితా రీతులను అధిగమించి రాసిన కొన్ని కవితలలో ప్రేమ వేరుగాను, నిజంగాను, హృదయానికి హత్తుకు పోయినట్టుగాను ఉంటుంది. ఉదాహరణకు ప్రేమికుల విరహబాధను వ్యక్తం చేసే పద చిత్రం 'ప్రేయసి' అనే కవిత. ఇది పండిత జగన్నాథరాయల సంస్కృత కవితను ధ్వనింప చేస్తుంది. ఈ కవిత కరుణ, ప్రార్థనల యొక్క అపురూప సమ్మేళనం హృదయ విదారకమైన నిశీధ ఏకాంతంలో ప్రేయసిని తన వద్దకు రమ్మని అర్థించడం వర్ణింప బడ్డది.

'నా ముందునుండి వెళ్ళిపో' అనే కవితలో భావోద్రేకాలు మరీ ఘాటుగా ఉన్నవి. ఆ కవిత - సహజంగా ఉండి, వర్ణనలు లేని శైలితో, స్వాభావిక వివరణతో ద్విగుణీకృత ప్రభావం కలదిగా ఉన్నది. భావోద్రేకం కలిగించే స్వభావం నైజమైంది గాను, బహుళంగాను ఉంటే చాలు; ఉత్తమ గేయానికి బాహ్యాలంకారాలు గాని, ఆడంబరాలు గాని, సంప్రదాయాల మద్దత్తు గాని అవసరం లేదని ఇది స్పష్టపరు స్తున్నది. అంతేగాక, విషయం దానిని వ్యక్తపరచడం ఈ రెంటిమధ్య సన్నిహి తత్త్వం అవసరమని గుర్తించే ప్రయత్నంలో ఎంతవరకు కృత కృత్యుడైనాడో గూడా ఇది సూచిస్తుంది. ఈ విధంగా దత్తా యొక్క కవిత మెల్లమెల్లగా నిజమైన గేయ రూపాన్ని పొందుతూ పోయింది. ఆయన కవిత తన పూర్వపు సంస్కృత ప్రభావాన్ని వదిలి తన నైజమైన మరాఠీతనానికి దగ్గరగా వస్తున్నట్టు ఆధారాలున్నవి. మంచి గేయాలన్నిటిలో వలె ఇందులోనూ విషయమూ, భావమూ, ఒకదాని కొకటి అన్యోన్యంగా సమర్థించుకొంటూ రెండూ కలిసి గేయం యొక్క ప్రభావాన్ని ఉన్నత పరుస్తవి. ప్రేమ గేయం యొక్క ఆకట్టుకునే మొదటి చరణాన్ని చూడండి. 'వెళ్ళిపో నా కనుచూపు మేరనుండి. ఓ కొంటెపిల్లా - నేను నిన్ను వెళ్ళగొట్టి తిరిగి నా మనో ఫలకాన్ని మళ్ళీ శూన్యపరచుకుంటాను. ఆ నవ్వు, ఆ సయ్యాట, బాణం వలె గుచ్చు కునే చూపు, ఆ మెత్తని మాటలు, అవన్నీ తీసికొని వెళ్ళిపో। నీ పేరుగూడా శాశ్వ

తంగా మరిచి పోదలచుకున్నాను.' ఇందులో ఉపమానాలు, ఉత్ప్రేక్షలు లేవు. ఆర్థం బరం లేక, సామాన్యంగా పొరలివచ్చే హృదయావేదన. ఈ కవితలోని మరో కొన్ని చరణాలు - లోతైనవిగా, నిరాశకు, కోపానికి ఎంత సన్నిహితంగా ఉన్నాయంటే, తర్వాత ఇంత సూటిగా, హృదయావేదనను, ముందు తరానికి చెందిన గోవిందాగ్రజ్ (రాంగణేశ్ గడ్కరి) ప్రేమకవితలలోనే చూపకలిగినాడని మాత్రం చెప్పవచ్చు. 'హరిణాక్షులైన ఆడవారున్న చోటల్లా మన్మథుని దోపిడి జరుగుతుంది'. సంస్కృత మూలంలోని ఈ శీర్షిక, దత్తా యొక్క ఒకానొక గీతానికి ఉన్నది. ఇది సంస్కృతంలో నుంచి తీసికోబడ్డదో, లేక కవియె రచించినాడో తెలియదు. ఈ గీతం స్త్రీ, పురుష సంభాషణ రూపంలో ఉన్నది. సంప్రదాయంగా వచ్చే మరాఠీ 'లావణి' ఫక్కీలో ఉన్నది. సాధారణంగా దత్తా తన కవితను ప్రేయసిగా భావిస్తాడు. కాని ఈ కవితలో ఆయన తన భావగర్భితమైన ప్రేమ స్వేచ్ఛగా సాగనిచ్చి తన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తాడు. కవి నిజమైన 'లావణి' ఫక్కీలో 'మామూలుగా నేను తోవ నడుస్తున్నప్పుడు హఠాత్తుగా నీవు కనబడ్డావు. అప్పుడు నన్ను నేను అదుపులో పెట్టుకోవటం కష్టమైంది. నా మనసంతా చలించిపోయింది.' అని సాగింది. ఈ కవితలోని సంగీతం, లయ, భావ ప్రకటనలోని నాజూకుతనం నిజానికి మూలం లోనే చూడాలి. అనువాదం అతి సామాన్యమైన ప్రత్యామ్నాయం మాత్రమే. ప్రేమికుడు స్త్రీని గూర్చి కొన్ని ముఖ్యమైన వివరాలిస్తాడు. ఆమె హంస గమనం, పూలచెండ్ల వంటి ఆమె వక్షోజాలు, తనవైపు ఓరచూపు చూడటానికి మంత్రముగ్ధం చేసేలా మెడ తిప్పడం, ప్రసన్నమైన అంతర్లయ, ప్రతిపాదంలోని చివరి అక్షరం అర్థాంతరంగా ధ్వనింప చేయడంలో చూపిన నేర్పు, అనుకోకుండా, హఠాత్తుగా ప్రేయసి కంటబడటంలో గల అద్భుతమైన చాంచల్యం దృగ్గోచరమయ్యే రీతిగా దత్తా సమకాలీను లెవరూ చూపలేదు. కాని ఇన్ని భావాల సమ్మేళనతో ఈ పాట శృంగార 'లావణి' గా ఆరంభమయి, విచారంతో కూడుకుని చివరకు విషాదాంతమవుతుంది. దత్తా కవిత్వంలో ఇది ఒక సునిశితమైన అంశం. అది సాధారణ పదజాలంతో స్త్రీ భావాలలోని తీవ్రతను హృదయానికి హత్తుక పోయేలాగ చిత్రిస్తూ, ఇతరుల హృద యాలలోని అంతర్గత భావాలను ఎత్తిచూపుటలో దత్తాకు చెప్పుకోదగ్గ నైపుణ్య మున్నదని, అది ఒక నిజమైన కళాకారుని లక్షణమని ఒప్పుకోక తప్పదు,

విషాదభావం, మానవ హృదయంలోని శోకం, దుఃఖం దత్తాయొక్క అన్ని రచనలలోను ఉన్నది. ఈ విషయంలో దత్తా కాళిదాసు కన్న భవభూతినే ఎన్ను

కున్నాడు. ఎందుకంటే ఆయన శృంగారంకన్న విషాదాన్నే సమర్థవంతంగా చిత్రించి నాడు. దత్తా హఠాన్మరణానికి పూర్వం భవభూతి రచించిన ఉత్తర రామచరితను మరాఠీలో అనువదించటానికి పూనుకున్నాడు.

ఇంత చిన్న వయసులో దత్తా విషాద భావానికి ఎందుకు గురి అయినాడు! అందుకు కారణం ఏమిటి? నిరాశా? ఒంటరితనమా? విషాద జీవిత భావమా? 'తైలం లేకుండా కాలుతున్న దీపాన్ని నేను.' అని ఆయన అంటాడు. కళాకారుని హృదయంలో ఆయన వసంతాలు దాగి ఉంటవి. సృజనాత్మక మనసులో నుండి, అందులో దాగి ఉన్న శక్తిసామర్థ్యాల నన్నిటిని ఎవరు బయటికి లాగగలరు! భావాత్మక ప్రేమక్షేత్రంలో గూడా దత్తా అత్యంత విచార రాగాన్నే అలాపించినాడు. పూర్తి విచారంతో గూడిన శబ్దాలలో, ఒక స్త్రీ తన బలహీనతను మాటలలో తెలుపజాలనని తన ప్రియునితో అంటుంది. సామాన్యమైన రీతిగా, అవలీలగా స్త్రీ పరమైన దుఃఖాంశాలను తెలుపుట చూచి ముగ్ధులవుతారు. ఇంతకు పూర్వం సూచించినట్టు దత్తా తన ప్రాచీన అనుభవాన్ని పక్కకు తోసి, తన ప్రోత్సాహంతో స్వచ్ఛమైన స్థానిక వసంతాలను సృష్టిస్తాడు.

'నా మిత్రుడు నారాయణ'కు అనే గేయం, వర్ణనలు లేని సామాన్య శైలిలో ఉన్నా భావోద్రేకాలతో నిండి ఉన్నది. ఇది ప్రేమగీతం కాకపోయినా స్వచ్ఛమైన గేయకావ్యం. అయితే ఆసక్తికరమైన విషయ మేమిటంటే ప్రాచీనం నుండి ఆధునికం వైపు, సంప్రదాయ సాహిత్యం నుండి గేయ రచనకు మారుట, అతని వైవిధ్య రచనా నైపుణ్యాన్ని సూచిస్తున్నది.

'సంతోషంగా లేని భర్త' అనే కవితలో, దత్తా చిన్నచిన్న వాక్యాలు ఉపయోగిస్తాడు. ప్రతి వాక్యము చివరన ప్రశ్నార్థక చిహ్నం ఉంటుంది. కళాత్మకమైన ఈ ప్రశ్నార్థక చిహ్నం వాస్తవంగా గణనీయమైంది. ప్రశ్నను సూచించే సాధారణ సంజ్ఞ అర్థవంతమై, భావగర్భితమై ఉంటుంది. ప్రశ్నార్థక చిహ్నాన్ని పదేపదే వాడడం చూస్తే కేశవసుత్ రాసిన ప్రఖ్యాత కవిత 'సితార్ యొక్క గానం' జ్ఞాపకం వస్తుంది. 'గాలి శాంతంగా ఉన్నది. చుక్కలు శాంతంగా ఉన్నవి. నా హృదయంలో గూడా శాంతి ఉన్నది.' 'కేశవసుత్ రాసిన ఈ కవిత'లో, 'శాంతి' అనే పదం ఏమి సాధించిందో - దత్తా కవితలోని ప్రశ్నార్థక చిహ్నం అదే సాధించింది. భావ వివరణలో పొదుపు, భావాలలో ఆవేదన, గేయం యొక్క ప్రత్యేకత. దత్తా యొక్క గేయాలన్నింటిలో పదాలు చాల పొదుపుగా వాడటం గమనించవచ్చు. 'రైలుబండి' అనే

సాధారణ కవితను చూడండి. కవితావస్తువేదైనా కావచ్చు. వ్యక్తీకరణలో నవీనత లేకపోవచ్చు కాని, అర్థం చేసికునే శక్తి ఉచ్చారణలో సౌలభ్యం ఉండాలి. నిజమైన గేయానికది గీటురాయి. ఈ ప్రత్యేక కవితలో, ప్రేయసిని కలువాలనే ఆతురత చాల మెండుగా ఉండుటచేత రైలుబండిని వేగంగా నడుపుమంటాడు.

'దీపానికి' మరో ఉన్నతమైన గేయకవిత. కృత్రిమ కవితా అలంకారాలేవి లేనిది. ఇందులో కవి ఆశాభంగం చెంది ఆవేదన పడుతూ, 'ఒక ప్రేమబిందువైనా పొందలేదు, జీవితంతో విసుగు చెందినాను' అని అంటాడు కాని వెంటనే గుర్తిస్తాడు, ఇది న్యాయం కాదని. మళ్ళీ అంటాడు: 'నే నేమన్నాను? సానుభూతిని, ప్రేమను కోలుపోయిన నేను ఏకాకిగా కాలిపోతున్నానా?' ఇట్టి అత్యంత భావోద్రేక స్థితిలో. తన తల్లి, భార్య, మిత్రుడు జ్ఞాపకం రాగా, అంటాడు: 'చివరకు నా తల్లి, నా భార్య, నా మిత్రుడు గూడా నా ఏకాకితనాన్ని అర్థం చేసికోలేరు. వారు నొచ్చుకుంటారు. నొచ్చుకోని, నా ఏకాకితనం అల్లానే ఉంటుంది. వారు తమ ఇష్టం వచ్చింది అనని.' అని అంటాడు. కవి మరొకసారి కవితా శక్తిని ఉధృతం చేయటానికి, 'నీ ఇష్టం వచ్చింది అను' అన్న తర్వాత సాధారణ విరామం ఒక గీత వాడుతాడు. తన ప్రియమైనవారు ఏమంటారో తీవ్రంగా ఆలోచిస్తాడు. తరువాత తన అంతరాంతరంలోని ఏకాంతంలోకి వెళ్ళిపోతాడు. అంతటితో ఆ కవిత ముగుస్తుంది.

'విశ్వామిత్ర తీరాలపైన' అనే కవితలో నైసర్గిక అందాన్ని, కవి ఎన్నో రీతుల వర్ణిస్తూ, ఒక చిన్న చరణంలో ఈ విధంగా క్రోడీకరిస్తాడు: 'అపురూపమైన ఈ అందాన్ని ఒకరు మళ్ళీ మళ్ళీ ఎట్లు చూడగలుగుతారు?' దత్తా ఒక ఆకృతిని నిర్మించటానికీ, దానికి ధ్వనిని అర్థవంతంగా మేళవింప చేయడానికీ సిద్ధహస్తుడు. ఆయన తన జీవితాన్ని మెల్లగా పారుతున్న సెలయేరుతో పోలుస్తాడు. అది నెమ్మదిగానే ప్రవహించవచ్చు. కాని దాని గమనం నిరంతరం. సెలయేరు - తన జీవితం ఈ రెండిటి గమనాన్ని తనతో పోలుస్తాడు, జీవితం తన చేతుల్లోనుండి జారిపోతూంద దాన్ని విస్సహాయుడై చూస్తూ ఉండటం తప్ప ఏమి చేయలేదు. ఇక్కడ మొదటి పాదం కన్న రెండోది చిన్నదిగా ఉన్నది. ఈ విధంగా తన జీవిత కాలం చిన్నదిగా ఉండడం సూచితమౌతుంది. (నిజంగా ఇది కఠోర సత్యం) అట్లే నిరంతరంగా ప్రవహించే సెలయేరుకు విరుద్ధంగా, కవి తన చేతగానితనాన్ని వర్ణిస్తాడు.

ఈ సందర్భంలో దత్తా ప్రేమకవిత్వాన్ని ఆ కాలపు మొత్తం మరాఠీ ప్రేమ కవిత్వంతో పోల్చి చూడాలనుకున్నప్పుడు; కొందరు సమకాలీన ప్రముఖ కవుల

రచనలతో. ముఖ్యంగా మన్నికయిన ఉద్యమనాయకుడు కేశవసుత్ రచనలతో, పక్క-పక్క-న బెట్టిచూడాలి. దత్తా సన్నిహితుడు. పెద్దవాడైన మిత్రుడు రెవరెండ్ తిలక్ ప్రేమగీతాలు ఆయన భక్తి; మత భావాలు ప్రతిబింబింప చేస్తవి. ఆయన ప్రేమ భాష గూడా ఆధ్యాత్మిక ఆదర్శపరమై ఉండేది. ఆయన ప్రేమ కవితలు, భౌతిక ప్రేమలోను, ఆదిభౌతిక ప్రేమలోను తారతమ్యం చూపిస్తూ, రెండో దానివైపే మొగ్గు చూపేది. 'బీ' ఆ కాలపు మరో ప్రేమకవి. ఆయన తన మాయావాదంలో శుద్ధమైన ఆధ్యాత్మిక ప్రేమను గూర్చి మాట్లాడేవాడు. ఆ కాలపు అత్యంత ప్రముఖ కవి తాంబె, మరొకరి మనసులోకి దూరి, తన అభిప్రాయాలను వ్యక్తపరచే ప్రత్యేక శక్తి కలిగి ఉండేవాడు. అందుకే....ఆయన కవిత ప్రత్యేకమైన తరహాకు చెంది నదిగా పేర్కొ-నబడుతుంది. ఈ విధంగా ఆయన ఫలించిన తన ప్రేమానుభవాల నెన్నింటినో జోడించి రాసేవాడు. కేశవసుత్ తర్వాత వచ్చిన 'రెండాల్కర్', 'నగేశ్', 'సుమంత్'వంటి విఖ్యాత కవులుగూడా ఆధ్యాత్మికప్రేమనే బలపరచినారు. ప్రేమనుగూర్చి గేయరూపంలో, అచ్చంగా ఆత్మాశ్రయ శైలిలో రాసిన మొదటి మరాఠీకవి కేశవసుత్. జీవితంలోని వివిధ దశలలో పరిణితి చెందిన ప్రేమను ఆయన కవితలలో మనం చూడగలము. ఆయన గూడా ప్రేమయొక్క- నిరంతర గుణాన్ని నిర్దేశిస్తాడు. ప్రచారంలోవున్న ప్రేమకవితా రీతులకు వ్యతిరేక భావాలను కేశవసుత్ తెలుపుతూవుంటాడు. ఆయన తన భావోద్రేకపూరితమైన ప్రేమగీతాలు రాస్తూవుంటాడు. కాబట్టి సంస్కృత సంప్రదాయం యొక్క- ప్రభావం నుండి ఆయనగూడా తప్పుకోలేదు, అని అనవచ్చు. ఇవన్నీ చెప్పిన తరువాతగూడా నిజానికి గోవిందాగ్రజ్ మరాఠీ భాషలో మొదటి గొప్ప ప్రేమకవి అనే నిర్ణయానికి రావలసి వస్తుంది. ఆయన ప్రేమకవితలు, హృదయంలోని లోతైన భావాలను స్పృశిస్తవి. గాయపడిన గుండెల బాధను వ్యక్తపరుస్తవి. కాబట్టి మనను గాఢంగా ఆకర్షిస్తవి. వాస్తవంలో అది ఈ నాటికీ సాటిలేని గుణ విశేషం. కాని దత్తా కన్న ఒక తరం చిన్నవాడైన గోవిందాగ్రజ్, దత్తా కవితను ప్రేమించేవాడు. అయితే మనం దత్తా ప్రేమ కవితలలో శోకతీవ్రతను ఏ విధంగా చూస్తామో, అదే గోవిందాగ్రజ్ కవితలలోగూడా చూస్తాము. ఆయన కాలం నాటి ప్రేమకవిత్వ భూమికలో చూచినట్టయితే, దత్తా ప్రేమకవిత గాఢమైన కొన్ని అవధులకు గురి అయినట్టు కనబడుతుంది. దత్తాయొక్క- ఉన్నత స్థాయినందుకున్న భావోద్రేక ప్రేమకవిత భౌతిక వాంఛకు దూరంగా ఉంటుంది. అయితే చిన్న వయసులో గతించిన దత్తానుండి పరిణితి చెందిన కవితలను ఆశించడం సమంజసం కాదు.

అనేక కవులు ఆరంభ దశలో, ప్రకృతిని గాని, రాధాకృష్ణుల ప్రేమను గాని ఆలంబనగా తీసికొని తమ ప్రేమభావాలను వ్యక్తపరుస్తుంటారు. అవి సాధారణంగా, ప్రేమ కన్నా, ప్రేమను గూర్చిన భావాలకు సంబంధించినవయి ఉంటవి. దత్తా కూడా ఇందుకు అపవాదు కాదు. అదిగాక అనేక పరిస్థితులయొక్క ప్రభావం - ఉదాహరణకు వివాహం, స్త్రీలకు విద్య లేకపోవటం, భార్య భర్తల ఎడబాటు, ఆ కాలం నాటి కవితా రచనలోని కొన్ని అంగీకృత పద్ధతులు మొదలైన కారణాలు అసలైన ప్రేమకవిత అల్లటంలో ప్రతిబంధకాలైనవి. దత్తా తనను గూర్చి తెలుసుకునే కాలం రాగానే ఈ లోకాన్ని విడిచి వెళ్ళినాడు. ఇంతకు ఆయన ఏ మాత్రం ఇచ్చినాడో దాన్ని బట్టి ఆయన నిజంగా ఒక సిసలైన గేయకవి, కాగలిగే వాడని, గేయ కవితా లోకంలో కొత్త అంతస్తులను, నవీన అవగాహనవల్ల కనుగొనేవాడని రూఢిగా తెలుస్తున్నది.

నవీన అవగాహన అవతరించింది. కాని ప్రతి కవి తన, తన శక్తినిబట్టి అది గ్రహించ కలిగినాడు. అయితే దత్తాపై సంస్కృత సాహిత్య ప్రభావమూ, ఇటు ఇంగ్లీషు కావ్యాల ప్రభావమూ ఉండుట గమనించినా, దత్తా గేయ కవితలో, స్వకీయాలను ప్రకటించాలనే సిసలైన వాంఛగూడ స్పష్టంగా గోచరమవుతుంది. ఈ అవగాహనమే చాల ముఖ్యమైనది. ఆయన కవితలకు అవరోధాలున్నా ఆధునికమైన మెళకువలకు, భావప్రకటనకు ఆయనను మార్గదర్శిగా చేసింది. ఆయన కొన్ని కవితలు - 'దీపానికి' 'నా స్నేహితుడైన నారాయణకు', సంప్రదాయ సిద్ధమైన వర్ణనలతోను, కృత్రిమ భావప్రకటనలను ఆయన విడనాడినాడు. నేరుగా, సామాన్యమైన, సహజమైన కవితా సృష్టికి నాంది పలికినాడు. బహుశః ఆయన జీవించే ఉంటె ఈ దశలో ఎంతో మేరకు పురోగమించేవాడు. మరొక కారణం గూడా ఉన్నది. అది పరోక్షమైన సాక్ష్యాధారం - సంస్కృతశైలి ప్రభావం దత్తా రచనలపై ఉన్నదని అనేక సార్లు పేర్కొన్నాము. అయితే సంస్కృత లోకోక్తుల గూర్చి ఆయనకున్న పరిజ్ఞానం వల్ల అవి కొందరు సమకాలీనులకు భారంగా దోచినట్లు ఆయనకు తోచలేదు. దత్తా చేతుల్లో అవి, సహజత్వాన్ని, స్నిగ్ధతను యథాతథంగా ఉంచుకొన్నవి. ఇది నిజంగా అసాధారణమే. దత్తా ఇది చేయకలిగినాడంటే ఆయన తన ఆత్మకు వంచితుడు కాలేదు. ఆయన కవితలో శబ్దానికి, అర్థానికి, వాచ్య విధానానికి గల సన్నిహిత సంబంధాన్ని గుర్తించవచ్చు. తన గేయ కవితలను మిత్రబృందంలో గానం చేసి, వాటి సహజమైన సంగీత గుణానికి మెప్పు వడసిన మరాఠీ ఆధునిక కవులలో మొదటివాడు కావటం గూడా ఇందుకు కారణం కావచ్చు. ఈ

విధంగా ఆయన గేయ కవితలు, అసహజమైన భాషకు, అనవసరమైన పాండితీ ప్రకర్షకు దూరంగా ఉండేవి. సంస్కృత లోకోక్తులను గూడా ఆయన అతి సునాయాసంగాను, సమర్థవంతంగాను మరాఠీ కవితలోకి, తన శైలితో రూపొందించుకుంటాడు. ఆయన అనేక కవితలు సంస్కృత పదాలతో నిండి ఉన్నవి. కాని అవి దత్తా చేతిలో నైజమైన శైలిని, సునాయాసంగా సమకూర్చుకున్నవి. టాగూరు విఖ్యాత కవిత 'నా మాతృభూమి'ని అనువదించేటప్పుడు, భాష యొక్క అదే అందాన్నీ, గాంభీర్యాన్నీ కాపాడినాడు. దత్తా కవితాస్ఫూర్తిని, ముఖ్యమైన వివిధ మార్గాలలో పొందినాడు కాని, వాటన్నిటినీ తనలో జీర్ణించుకొని ఒక కొత్త శైలిలో అందించినాడు. అది నిజంగా దత్తాయొక్క సొంత శైలి.

మరాఠీ కవితను, ఆధునాతనపరచే ఉద్యమాన్ని కేశవసుత్ ఆరంభించినాడనడం అంగీకరించిన విషయమే. ఈ ఉద్యమానికి ఆయన ఎంతో తోడ్పడ్డాడు ఆయన కవితా వ్యక్తిత్వం బహుముఖమైంది. ఉత్తేజకరమైంది గూడ. అందుకని కొత్త స్ఫూర్తి, నిశ్చయంగా, కేశవసుత్‌లో కొట్టవచ్చినట్టు కానవస్తుంది. దత్తాలో అది సునాయాసంగాను, సహజంగాను గోచరిస్తుంది. ఇద్దరు ఏకమార్గోన్ముఖులై పయనించినారు. అయితే కేశవసుత్ విషయాల పరిధి విపులంగా ఉంది ఆధునికత పట్ల ఆయన అవగాహన ఎక్కువ నిశితంగా ఉండేది. విచారకరమైన విషయమేమిటంటే దత్తా రాసింది స్వల్పం. ఆయనది అల్పాయువు. కాని ఆధునిక మరాఠీ సాహిత్య మార్గదర్శకులలో ఆయనకు స్థానమున్నదని మాత్రం ఒప్పుకోక తప్పదు.

# ఆరవ అధ్యాయం

## గుణాత్మక వివేచన :

ఒక కళాకారుని కృషిని సమగ్రంగా చూడాలి. ఇక్కడ దత్తా యొక్క కవితా సృష్టిని, అనేక విభాగాలలో విభజించుట మన సౌకర్యం కొరకే జరిగింది. ఆయా విభాగాలను చూస్తున్నప్పుడు అందులో సాధించిన దేమిటి? అవరోధా లేమిటి? తెలిసి కోవటానికి యత్నించినాము. సహజంగా ఆయనలో జనించిన ప్రేరణవల్ల గాని, ఆయన పెరిగిన సంస్కృతి ప్రభావంవల్ల గాని, ఆయన కవితాసృష్టి ఎట్లా జరిగింది? ఈ చివరి అధ్యాయంలో, దత్తాకు కవిగా గల ప్రత్యేకత ఏమిటి? సమకాలీన కవులలో ఆయనకు తగిన స్థానమేది? అనేది తెలుసుకోటానికి ప్రయత్నిస్తాము.

బ్రిటిష్‌వారి పరిపాలన కింద భారతదేశం పునరుజ్జీవనమందుతున్న కాలంలో దత్తా జన్మించినాడు. అది పరివర్తన చెందుతున్న కాలం. ప్రాచీన, అర్వాచీన శక్తులు సమ ఉజ్జీలుగా ఉండేవి. అర శతాబ్దకాలం కన్న మించి పాలిస్తున్న బ్రిటిషువారు ఈ ప్రాచీన దేశానికి కొత్త భావాల వెల్లువ తెచ్చినారు. అది మన సాంఘిక, రాజకీయ, మత రీతులను మొత్తం మార్చివేసినది. మన విద్యాధికులైన యువకులు మానవ జీవితంలోని అన్ని రంగాలలో కొత్త వెలుగును చూడటానికి ఉవ్విళ్ళూరుతున్న వీరికి ప్రతిభావంతమైన నాగరిక స్ఫూర్తి కలుగ చేసింది. పాత విధానాలలో మార్పు మంద కొడిగా వచ్చింది. కాని అది తప్పనిసరి పాత పద్ధతుల మీద, సంప్రదాయాల మీద తిరుగుబాటు చేయటానికి ఉద్యుక్తులవుతున్న, నవ తరానికి చెందిన యువకుల సంఖ్య పెరుగ సాగింది. ఈ కొత్త అవగాహన, తిరుగుబాటు చేసే నవభావన, జీవితంలోని అన్ని రంగాలలో, సాంఘిక సంస్థలు. విద్యావిధాన పరిస్థితులు సాహిత్యంలో గూడా స్పష్టపడుతూ వచ్చినవి. ఈ నూతన అవగాహన యొక్క చిహ్నాలు మొదటిసారిగా 1874 లో ఆరంభింపబడిన విష్ణుశాస్త్రి చిప్లూన్‌కర్ 'నిబంధ మాల' అనే ఉత్తేజపరచే వ్యాస పరంపరలో గోచరమవుతవి. మరాఠీ సాహిత్య చరిత్రలో అది ఒక మైలు రాయిగా పరిగణింప బడుతుంది.

ఇప్పుడున్న 58 సాంఘిక సంస్థలు వ్యక్తి స్వాతంత్ర్యాన్ని అరికట్టి, మానవ బుద్ధిని ఆచారాలకు, కట్టుబాట్లకు బంధించి వేసేవి కాబట్టి పాశ్చాత్య నాగరికతో సంబంధం కలిగిన యువకులు వీటిని ఎదుర్కొన్నారు. ప్రచలితమై ఉన్న ఆచార విచారాలపై తిరుగుబాటు చేయుటతో బాటు, కొత్త ఊహలకు, కోరికలకు, అనుగుణ

మైన ఒక కొత్త జీవిత విధానాన్ని గూర్చి వెదుక నారంభించినారు. విష్ణుశాస్త్రి, కేశవసుత్, ఇంకా అటువంటి అభిప్రాయం గలవారు ఈ వాంఛలను సమర్థిస్తూ వ్యాసాలు రాయడమే గాక, అనేక సంఘ సంస్కారాలను అమలుపరచటానికి పూనుకొని కృతకృత్యులైనారు. విదేశ పరిపాలన కింద బాధపడుతూ ఉన్న సనాతన నాగరికత కలవారికి ఆత్మవిశ్వాసాన్ని కలుగచేసింది.

ఆంధ్ర కవుల ప్రభావ పుణ్యమా అని 1885 తరువాత, మరాఠీ కవితాలత నూతన అవగాహనపు మొగ్గ తొడిగింది. 19వ శతాబ్దపు చివరి చతుర్థ భాగంలో వచ్చిన అవగాహన, సమకాలీన కవుల రచనల్లో కొంతవరకు కానవస్తుంది. సొంత భావాలను గేయ రూపంలో ప్రకటించడం, వ్యక్తి స్వాతంత్ర్యంలో ప్రగాఢమైన విశ్వాసం, ప్రకృతి సౌందర్యాన్ని గూర్చి ఒక కొత్త అంతర్దృష్టి, స్వేచ్ఛాయుతమై అవరోధాలు లేని ప్రకటన శైలి, ఇవి నవీన కవితా పరిజ్ఞానపు కొన్ని ముఖ్య లక్షణాలు. దత్తా తర్వాత కాలపు కవితలలో ఈ నవీన పరిజ్ఞాన లక్షణాలన్నీ మనం చూసినాము. అయితే ఆయన, ప్రబుద్ధుడయిన కొలది కవిత్వాన్ని గూర్చి ఆయన అవగాహన మారుతూ వచ్చింది. కవిత్వం కాలానుగుణంగా సాంఘిక పురోగతిని బట్టి మారుట అవసరమని, దత్తా కవిత్వాన్ని గూర్చి, తన అభిప్రాయాన్ని వెలిబుచ్చినాడు. అంతే గాదు, మరాఠీ కవిత కొన్ని స్పష్టమైన లక్షణాలను జీర్ణించుకొని, వాస్తవరూపంలో వ్యక్తపరచుటమనేది వాటిలో ముఖ్యమైనది. కవిత్వాన్ని గూర్చి ఆయన అభిప్రాయాలను అభివృద్ధి పరచుటకు, అకాల మరణం వలన సాధ్యం కాక పోవచ్చు. కాని గేయమే కవితా రూపంలో భావప్రకటన చేయటానికి నిజమైన సాధనమని, అది స్వగతమైనది గాని, ఇతరులది గాని, అచ్చమైన భావప్రకటన గేయం ద్వారా సాధ్యమని నిస్సంశయంగా అతనికి పరిజ్ఞానముండేది. ఈ విధంగా దత్తా కవితలలో మనం ఆత్మ ఆవిష్కరణతో బాటు ఆత్మపరిజ్ఞాన చిహ్నాలు గూడా తరచు చూస్తూ ఉంటాము.

దత్తా జీవితంలోనే గాక, కవిత్వంలో గూడా అధునాతన పరిజ్ఞానంతో జన్మించినాడు. ఆయన జీవితంలోని సుఖ దుఃఖాలను అరమర లేకుండా స్వీకరించినాడు. బాధలను, వైపరీత్యాలను, మానవ జీవితంలో తప్పనిసరి భాగాలని గుర్తించినాడు. ఇతరుల అనుభవాలను తనవిగా తలచి, అందమైన ఆకారాలలో మలచగల అపురూప సామర్థ్యం గలవాడు. జీవితం ఇచ్చిన దానిని అంగీకరించినాడు. అట్టి

అంగీకారంలో అనాదరణ గాని, విగ్రహం గాని లేకుండేది. ప్రతి దాన్ని గాఢంగా అనుభవించినాడు. ఈ గాఢానుభవాన్ని కవిత్వంలో స్పష్టంగా పొందు పరచినాడు. ఆయన శబ్దాలు, భావాలు, ఉద్రేకాలు అన్యోన్యంగా మేళవింపబడి రూపంలోను, ఆకారంలోను మూర్తీభవించిన ఖండాలుగా మారినవి. అనుభవం యొక్క తీవ్రత, దాన్ని నిర్భయంగా వ్యక్తపరచే ఉబలాట ఇవి ఆయన వ్యక్తిత్వానికి గల గొప్ప విశేషాలు. మరాఠీ కవులకు మానవ ప్రేమ. ప్రకృతి, దేశభక్తిలోని ఉద్వేగాలను ఇంగ్లీషు గేయాలు పరిచయం చేసినవి. దత్తా యొక్క అనేక కథా వస్తువులు ఆయన నివసించే కాలానికి చెందినవి. వాటిని ఆయన లోతైన సొంత భావపూరితమైన అనుభవాలలోకి మలిచినాడు. ఆయన చూసినది, స్పృశించినది, విన్నది అంతా తన మనోరస శాలలో రూపకల్పన చేసినాడు. అనేక రూపురేఖలలో విగ్రహాలను పోత పోసినాడు. తాను పొందాలమకునే ప్రతి అనుభూతిని బట్టి, ఆయా స్వరూపాలకు చెందిన భాషను ఉపయోగించినాడు. ఆ రూపాలకు చెందిన భాషనే ఈ వాదు కొత్త కవిత యొక్క ప్రత్యేకతగా పరిగణింపబడుతున్నది. దత్తా కవితలలో ఈ రూపాల యొక్క భాష ఒక్క స్వానుభవాల వరకే పరిమితం కాలేదు. ఆయన తాను సొంతం చేసికొన్న ఇతరుల అనుభవాలు వ్యక్తపరచటానికి గూడా ఉపయోగించినాడు. దత్తా యొక్క ఈ గుణాలే - అనగా తన కవిత యొక్క గేయ ఫక్కి, రూపాల ద్వారా సొంత వివరణ - ఇవి సహజమైన తన ఆధునిక అవగాహన వలన కలిగినవి. ఇవి ఆయనను పాత సంప్రదాయాలకు, పద్ధతులకు గాని, ఇటు జీవితానికి, అటు కవిత్వానికి గాని ముడి పెట్టుకోనీయలేదు.

వేరుగాను, సూటిగాను సొంత అనుభవాలను తెలుపుతూ, గేయ కవితలకు బలం చేకూర్చవచ్చు. అయితే ఉపమానాలు, ఊహా మాత్రపు తూపురేఖలు. స్వాను భవాల స్థాయిని పెంచుతూ విషయానికి కొత్త స్థాయిని ఒనకూరుస్తుంది. ఇతరులు సొంత అనుభవాలను మాత్రమే వివరిస్తారు. కాని దత్తా మనోఫలకంపై చెరగని ముద్ర వేస్తాడు. దత్తా కవితలలో ఉపమానాలు, ఆకారాలు ఆయన అనుభవాన్ని బట్టి సునాయాసంగా, చెట్టుకు పువ్వులవలె కుసుమిస్తవి. రూప నిర్మాణానికి చెందిన కవి యొక్క ఈ కళకు నాటకీయ గుణమున్నది. అందుకే ప్రతి అనుభవం నాట కీయతను అందుకుంటుంది. మరాఠీ కవిత ఉత్తరోత్తరా అభివృద్ధి చెందుటలో ఈ

రూప నిర్మాణకళ ఒక ముఖ్యమైన మైలురాయిగా పరిగణించ బడుతుంది. దత్తా తన ఆధునిక, అవగాహన వల్ల దీనిలోని జవసత్తువను గుర్తించి సహజమైన నైపుణ్యంతో ఉపయోగించినాడు.

'నిదుర పో నా బిడ్డా! నిదుర పో' అనే కవితలో మరొకరి వ్యక్తిత్వంలో దూరి, అందులో లీనమై పోవుట తారస్థాయినందుకున్నది. కరుణరస ప్రధానమైన కవిత, పాత-కొత్త తరాలకు చెందిన పాఠకుల మన్ననలను బడసినది. దరిద్రంలో మునిగిన తల్లిప్రేమ ఈ కవితలో వర్ణితము. తల్లియొక్క ధర్మాన్ని గాని, గౌరవాన్ని గాని పేదరికం గూడా రూపుమాప జాలదు. ఆమె రోదన - బలహీనమై ఓడిపోయిన వ్యక్తి యొక్క ఆవేదన గాదు. అది తప్పుకోజాలని అంతిమ శక్తి అయిన మృత్యువుది. ఎన్ని దుఃఖాలున్నా, అవరోధాలున్నా అన్నిటినీ అధిగమించడానికి మానవత్వపు విలువలపై నమ్మకం, అంతిమ విజయం సత్యానిదే అన్న నమ్మకం ఉంటుంది. ఆమె చెప్పేది అంతా కవిత యొక్క మొత్తం ప్రభావాన్ని ఉన్నత పరుస్తున్నది. ఇంట్లో ధాన్యం లేనప్పుడు ఎలుక గూడా ఇంటికి రాకుండా పోతుంది. తల్లి తన పిల్లలకు చెప్పేటప్పుడు ఆమె తన దరిద్ర దశలో తమను విడిచి వెళ్ళిన స్వార్థపరులైన చుట్టపక్కాలతో సరిగ్గా పోలుస్తుంది. హృదయాన్ని ఆకట్టుకునే ఈ గేయంలో, నిగ్రహానికి, ఆగ్రహానికి ఉపమానాలకు, ఉపమేయాలకు, ఎంతటి సాన్నిహిత్యమున్నదో సున్నిత హృదయం గల పాఠకుడు. నిజమైన కళాకారునికీ, ఈ గొప్ప కళా ఖండానికి, చేయెత్తి మొక్కకుండా ఉండలేడు.

జీవితపు అంతిమ సమయంలో భవభూతి 'ఉత్తర - రామ చరితను' అనువదించటానికి నిశ్చయించినాడు. నాటకం కావ్యరూపంలో ఉండాలని ఆయన అభిలాష. నిజానికి నాటకీయత ఆయన వ్యక్తిత్వానికి ముఖ్య లక్షణం. ఈ భావన ఉన్నందుకే అన్య వ్యక్తిత్వాన్ని తనదిగా చేసుకున్నాడు. అవి మనం, పిల్లల కొరకు ఆయన రాసిన ప్రసిద్ధమైన జోలపాట 'నిదుర పో నా బిడ్డా! నిదుర పో' లో చూస్తాము. ఈ కరుణారస భరితమైన జోలపాట మన సాహిత్యపు వారసత్వంలో ఒక భాగమై నిలిచింది. కాలము ప్రజలు ఒక కవికి సమర్పించే అత్యున్నతమైన గౌరవం - ఆ కవి కళాసృష్టి కవి పేరు మరుగున పడినా ఆ భాషా సంప్రదాయంలో విలువైన అంతర్భాగం కావడమే. అప్పుడు ఆయన పేరు స్మృతిపథంలో నుండి తప్పుకున్నా, ఆయన కృతి మాత్రం అనామకంగా నిలుస్తుంది.

పిల్లల కొరకు దత్తా రాసిన కవితలు మరాఠీ కవిత్వంలో ఒక కొత్త పంథా తొక్కినవి. ఈనాడు మరాఠీ కవితా క్షేత్రం సుసంపన్నమైంది. దత్తా రాసిన ఈ కొద్దిపాటి కమ్మని పాటలవరకైనా, మూలాన్ని తడుముకొనవలసి వస్తున్నది.

అవరోధాలున్నప్పటికీ, ఆయన నైసర్గిక కవితలు, ప్రకృతిని గూర్చిన సిసలైన ప్రేమను తెలుపుతవి. నిత్య నూతనమైన కొంగ్రొత్త లో చూపు రంగు రంగుల ఊహలను కలుగచేస్తుంది. ప్రకృతిని ఆయన తన భావాలకు, ఆలోచనలకు సాధనంగా వాడినాడు. ఇక్కడ గూడా ఆయన ముఖ్య వారసుడు, ప్రకృతి కవి అయిన 'బాలకవి' మొదటిసారిగా కవితాను సరణ చేసినాడు. దత్తా రాసిన గేయాలు తమ గుణాన్నిబట్టి ప్రత్యేకమైనవి. సహజంగా ఆయనలో ఉన్న ఆధునిక అవగాహన కారణంగా ఒక భావాన్ని గేయంలో వ్యక్తపరచ కలిగినాడు.

ఆయన అల్ప జీవితాన్ని గూర్చి సింహావలోకనం చేసినప్పుడు, దత్తా అతి కష్టంమీద క్రియాత్మకంగా అయిదు మొదలు ఏడు సంవత్సరాలు మాత్రమే జీవించినా డని తెలుస్తుంది. ఈ కొద్దిపాటి కాలంలో ఏం జరిగి ఉండవచ్చు? అప్పుడప్పుడే తన పడుచుతనాన్ని వీడినాడు. చిన్నతనంలోని ప్రాథమిక దశలో తన వ్యక్తిత్వాన్ని గూర్చిన జ్ఞానం మెల్ల మెల్లగా సంపాదించినాడు. ఆయన అంతర్గతమైన కోరికలు, ఊహలు, ఇంద్రియాలు సుసంపన్నమై ఉండవచ్చు. జాగృతినందవచ్చు. సంపన్నమైన సంపూర్ణ జీవితాన్ని గూర్చి కలలు గనటం ఆరంభించవచ్చు. తన పచ్చని జీవిత కాలంలో గూడా దత్తా తనను గూర్చి తెలిసికొన్నాడని గుర్తించవచ్చు. ఆయన భావో ద్రేక పూరితమైన అంతర ప్రపంచాన్ని ఎంతవరకు తెలుసుకున్నాడంటే, ఆత్మ విశ్వా సంతో దాన్ని గూర్చి వివరించ కలిగినాడు. ఇందులోనే ఆయన తాను కవి అనే విష యాన్ని తెలిసికొని ఉండవచ్చు. చిన్నపాటి ఈ జీవితంలోనే గొప్ప తెలివి తేటలు కలిగి, కళాత్మక సృష్టిచేసి లోతైన ప్రేమానురాగాలు కలిగి, తన ఆదర్శాల కోసం, ఎంతకయినా సిద్ధపడే త్యాగనిరతి కలిగిన పరిపుష్టమైన వ్యక్తిత్వం ఆయనది। నిజమే. అంగీకృతమైన సాధారణ జీవిత బంధనాలను తెంచుకొని, తన అంతర్గతమైన కోరికల సాధన కొరకు పూర్తిగా లీనమైపోయినాడు. నిజానికి అదే ఆయన నిజమైన జీవితం. ఈ జీవితం అన్నివైపుల విస్తరింప సాగింది. తన సహజ పద్ధతిలో కొత్త పచ్చిక బయళ్ళవైపు తోసుక పోసాగింది. అయితే ఆయనని ఈ వర్ధమాన జీవితపు వివిధ రూపాల్లలో ఆయన 'అది' 'అంతిమ' అనే కాక నిజమైనట్టి ప్రగాఢమైనట్టి ప్రేమ

స్తువు 'కవిత' అనే విషయాన్ని గూడా మనం గుర్తించాలి. "నేను పెద్ద పరీక్షలో నెగ్గినాను. విజ్ఞానమంటే ఏమిటో, కళ అంటే ఏమిటో తెలిసికో కలిగినాను. కాని ఓ నా ప్రియతమా! నీవు లేక, నేను హతాశుడనై పోయినాను" అని తన ప్రియమైన కవితను సంబోధిస్తాడు. ఇవి పరిణతి చెందని యువకుని యొక్క ఆవేదన గాదు. అది స్వయంగా జీవితం యొక్క ప్రగాఢమైన ప్రేమ. 'ఈ లోకంలో తన జన్మకు కారణం కవితాన్వేషణమే.' అనే గట్టి నమ్మకాన్ని సహజంగా వెలిబుచ్చుటయే అది ఆయన చిన్ననాటనే తన జీవిత లక్ష్యాన్ని స్పష్టంగా తెలిసికొనగలగటం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ విషయం.

## దుఃఖితుడైన భర్త :

ఎవరికి చూపింతును?
నా జ్ఞానాన్ని, నా నైపుణ్యాన్ని
నేను సాధించింది ఎవరికి చూపింతును?
ఎవరికి వినిపింతును? నా కవితను
ఎవరికి వివరింతును -
అందులోని అంద చందాల్ని?
దేహంలోని అంగాంగము
జీవించాలనే వాంఛతో ఉబ్బి పోగా
ఆనందాన్ని ఎవరితో పాలు పంచుకొందును?
ఓ క్రూరమైన దేవుడా, అర్థం లేని ఈ జీవితాన్ని
నా కెందు కిచ్చినావు?
నా చిలిపితనపు పొరపాట్లను చూచి
ప్రేమతో నన్నెవరు అధిక్షేపిస్తారు? ఎవరు కోపగిస్తారు?
నా బడలికను దూరం చేసే దెవరు? ఆనందపరచే దెవరు?
ఎవరి అందమైన ముఖం దారి తప్పిన నా మనసుకు
శాంతి ప్రసాదిస్తుంది?
ఓ క్రూరమైన భగవంతుడా! ఈ అర్థం లేని జీవితాన్ని
నా కెందు కిచ్చినావు?

ఎవరి సంతోషం చూసి నేను సంతోషింతును?
ఎవరికి శాంతి నిత్తును, ఎవరిని మందలింతును?
ఎవరిని ప్రేమతో దగ్గరకు తీతును?
అర్థం లేని ఈ శూన్య జీవితంతో విసుగెత్తినాను.
ఓ క్రూరమైన భగవంతుడా
అర్థం లేని జీవితాన్ని నా కెందు కిచ్చినట్టు?
ముసలివాడు వయసు పిల్లను,
కురూపి అందగత్తెను చేబడతారు.
మూర్ఖుడు తెలివిగల దానితోను, క్రియా శీలి
చంచలతో వియ్యమందుతాడు.
సరిపోలని జంటలను ఎందుకు కూరుస్తావు?
ఇదేనా, నీవు వేసిన పథకం? ఓ క్రూరమైన భగవంతుడా,
అర్థం లేని జీవితం నా కెందు కిచ్చినావు?
ఇందుకు బదులు నన్ను అంధునిగా చేసి ఉండవలసింది.
మూర్ఖునిగా చేసి మంచిభార్య నియ్యవలసింది
అది బాగుండేదేమో!
ఇప్పుడట్టి ఆశగూడా పోయింది.
ఇష్టపడని భార్య భారాన్ని మోపినావు,
ఓ క్రూరమైన భగవంతుడా, అర్థం లేని జీవితాన్ని
నా కెందు కిచ్చినావు?

## దీపం :

వెలుగుతున్నావు నీవు
ప్రేమతైలాన మునిగి ఉన్నావు కనుక
అదిలేక నీవు వెలుగలేవని తెలుసు నీకు
క్షణ మాత్రమైన
ఎదురు చూస్తాను నిరర్థకంగా
ఈ ప్రేమ కొరకు నేను
జీవితంలో అలిసి, దహించుకు పోతున్నాను

ఓహ్ ! ఏమని చెప్పను ?
అమ్మా ! ఏమనుకుంటావు నీవీ మాటలు విన్నప్పుడు
ప్రేయసీ ! ఈ నా మంకు మాటలనెట్లా నమ్మతావు ?
ప్రియ మిత్రమా ! నా తల తిరిగిందంటావా ?
ఏమన్నా అనండి మీరందరు.
నాకు తోచింది నే నన్నాను
ఇప్పుడిక వెనుకంజ వేసేది లేదు

## ఒక కొత్త పుట తెరచుకున్నది :

అప్పుడు భూమి ఎక్కడ ? తేజ మెక్కడ ? చీక టెక్కడ ?
కాలము గూడా అప్పటికి లేదు.
దేవు డొక్కడే ఉన్నాడు, శూన్యం నుండి అతడు
తన ప్రేరణా శక్తితో ఒక గొప్ప గ్రంథం రాసినాడు
శూన్యమైన ఆకాశపు పుటలపైన
లెక్కలేని చుక్కలను పెట్టినాడు.
నిలపినాడు భూమిపైన మనిషినీ, చెట్టునూ, పిట్టలనూ
'అవి అలా ఉండనీ' అన్నాడతను. అవి ఉండిపోయినవి
ప్రపంచమనే ఈ పుస్తకాన్ని దేవుడు కూర్చినాడు
ఒక్కొక్కపుడు చదువటానికి.
ఎన్ని పుటలు తెరచినాడో
ఇంకెన్ని తెరువనున్నాడో
అతనికే తెలుసు.
పుట్టినప్పటి నుంచి నేటిదాకా
ఇరవై మూడు పుటలు తిరగవేశాను
ఇంకెన్ని పుటలు తిరగవెయ్యాలో
ఎవరు చెప్పగలరు ?
ఈ నాడు ఇంకొక పుట—
కొత్త పుట తెరిచాను

ఈ పుటలో రాయబడే దాంట్లో
ఎంత మేలో, ఎంత కీడో
ఎవరి కెరుక ?

## నిదుర పో నా బిడ్డా, నిదుర పో :

నిదుర పో నా బిడ్డా, నిదుర పో
నిదుర పో, నా ముద్దులపాప
ధనం, అదృష్టహీనుని విడిచి వెళ్ళినట్టు—
సూర్యుడు ఆకాశాన్ని విడిచి వెళ్ళినాడు
బీదల జీవితంలోవలె, చుట్టంతా చీకటి
చూడు ! అలసిన ఆశాశ్వత లోకం ఎట్లా నిదుర పోతున్నదో !
నా అనేక ఆశలవలె, కోరికలవలె
అన్నం కోసం ఎలుకలు చుట్టూ ఉరుకులాడుతున్నవి.
నిరాశ తప్ప వారికి మిగిలేదేమిటి ?
మన చుట్టపక్కాలు మనను విడిచి వెళ్ళినట్టే
అవి గూడా మన ఇల్లు విడిచిపోతవి.
ఈ పాత పడిపోతున్న గోడల సందుల్లోనుంచి
లోకం మన దరిద్రాన్ని తొంగి చూస్తున్నది
ఈ పాతవెదురు తడికల తలుపు కిర్రుమంటున్నది
విచారంతో లోకానికి చెప్పుతున్నది మనం బీదలమని.
నా ముద్దు పాపా
ఈ సందులగుండా వీచే గాలికి నా కన్నీరు ఆరిపోతున్నది.
నా పాటలకు తోడవుతూ
నిన్ను నిదుర పొమ్మంటున్నది.
నిదుర పో నా ముద్దుబిడ్డా నిదుర పో
నీకు వ్యర్థంగా ఇచ్చినాను, నే నియ్యగలది
ఏమీ లేదు ఆకాశమే నీ తలపైన కప్పు

బీదరికమే నీ ఏకైక సంపద.
నీ ఇల్లు ఇప్పుడు కూలిపోయింది
దశదిశలే నీకు ఆచ్ఛాదన
అజ్ఞానమే నీకున్న ఒకే ఒక జ్ఞానం
బిచ్చమెత్తుటే నీ ఏకైక వృత్తి
అయినా సత్యమార్గాన్ని వదలకు,
అదొకటే నీ హృదయ నిక్షేపం.
దేవుని పూజించు, అతడు కరుణామయుడు, నిన్ను రక్షిస్తాడు.
ఇక నిదుర పో నా ముద్దుపాప, నిదుర పో.

## విశ్వామిత్రి తీరాలపై :

అపురూపంగా ఉండే దొకటి నేను చూసినాను
నా కన్నులు ధన్యత గాంచినవి.
మంచు పడుతున్నదా - వాన చినుకులవలె
లేక వెండిమేఘం కరుగుతున్నదా
లేక 'చంద్రకాంత' కరిగిన నీరా అది.
అది నా ప్రేయసి కౌగిలివలె చల్లగా ఉన్నది.
శ్రీ గంధం పూసుకున్నట్టున్నది లేదా
అమృత సాగరంలో దూకినట్టున్నది.
నిజంగా నాకేమి తెలియదు.
మనసు వినే శక్తి గోలుపోయింది.
ఆకాశమంతా నీటిలో ప్రతిబింబిస్తున్నది
చుక్కలు ఋషులవలె దిగి వచ్చినట్టున్నది
శాంతంగా స్నానమాడి, నీటిలో శాశ్వతంగా
తపస్సు చేసికోటానికి,
చంద్రుడు గూడా నీటిలోకి దిగివచ్చి—
హంసవలె ఈదులాడుతున్నాడు
స్త్రీ తన ప్రియుని ఏకాంతంలో కౌగిలించుకున్నట్టు
నది అతన్ని అదిమి పట్టుకున్నది.

ఒక బీద మర్త్యలోక వాసినైన నాకు
పెద్దల సహవాసంలో ఉన్నట్టున్నది
అయితే నాకు నిజంగా అనుమానంగా ఉన్నది ప్రియా।
నేను నిజంగా ఉన్నది గట్టి నేలమీదా,
పీటిలోనా, అనుమానంగా ఉన్నది ప్రియా।
ఓ నా జ్ఞాపకశక్తీ మేలుకో। అపురూపమైన
ఈ అందాన్ని నిలువ చేసికో.
ఇప్పుడు చూస్తున్న అందాన్ని మరచిపోకు
అది ఎప్పుడోగాని కనబడదు.

## మావళాలకు పిలుపు:

మావళాలు రండు। తక్షణమే రండు।
శివాజీ పిలుస్తున్నాడు యుద్ధానికి.
అంతా విడువండి, యుద్ధం చేయ రండి -
రణ రంగంలో శౌర్యం చూపండి,
విజయాయుధాలు ధరించి సిద్ధం కండి.
యువకులు, వృద్ధులు, అందరు రండు
మేయటానికి మీ పశువులను అడవులకు తోలండి
మీ యజమాని అంటున్నాడీ మాట, నేను గాదు.
పొలంలో నాగలి వదలండి ఉన్నది ఉన్నట్టు
వదిలి మీ యజమానిని కొలువండి,
చెట్లు నరుకుట మానండి, గండ్రగొడ్డలిచే బూనండి,
రణ రంగంలో శత్రువులను నరకటానికి.
మీ కంచాలలోని అన్నాన్ని వదలండి
లేవండి, సిద్ధం కండి, రణభేరి మోత వినండి.
సమయం వృథా చేయకండి
యుద్ధక్షేత్రంలో శత్రువు లెదురు చూస్తున్నారు.

నడుం బిగించండి, ఇదివరకే ఆలస్యమైంది
డాలు, కత్తి, బల్లెం చేబూనండి
విల్లంబులు ఆయుధాలు ధరించండి
శత్రు దళాల్లో భీభత్సం కలిగించండి.
తుఫానువలె ఉవ్వెత్తున లేచిరండి
రహస్య మార్గాలను కనుగొనే సమయమిది

సంకేత స్థలంలో గుమిగూడండి, పెను గాలివలె తరలండి
సోమరిపోతులు కాకండి, మనసుపెట్టి పోరండి.

మావళాలు, తక్షణం రండి
శివాజీ యుద్ధానికి పిలుస్తున్నాడు.
తక్కినవన్నీ మరచిపోండి. పచ్చి, పోరు సలుపండి
యుద్ధరంగంలో శత్రువు మీ సాహసాన్ని చవిగొను గాక.

## ఎందుకు మాట్లాడవు? నా బొమ్మా:

ఓహ్, ఎందుకు మాట్లాడవు ప్రియా!
నీ మీది కేమొచ్చిందని?
నీ కెన్నో బట్టలు కుట్టించినాను
ఎన్నింటితోనో అలంకరించినాను
నీ బొమ్మలన్నీ దగ్గరకు చేర్చినాను.
ఇంతకూ మౌనంగా ఉన్నావేమి ప్రియా
ఓ నా బొమ్మా నిన్ను అమ్మ తిట్టిందా!

అన్న పరిహసించినాడా?
అందుకేనా నీవలిగింది?

ఓహ్, నేనేం చేయను ప్రియా మౌనాన్ని పారదోలటానికి
ఆకలేస్తున్నదా ఏమిటి?
వంటకాలేమైనా తెచ్చి పెట్టేదా?

మూతి ముడుచుకోకు, ఇదో! ఇక్కడే ఉన్నవి.
తిను ప్రియా, ప్రియంగా మాట్లాడు.
అవును నా స్నేహితుని బొమ్మను నీకు వెనిమిటిగా ఎన్నుకున్నాను.
అందుకేనా ఈ సిగ్గు - మౌనం
ఓహో, నీ రహస్యాన్ని పసిగట్టినాను
నాతో చెప్పకులే, నాకంతా తెలిసింది - తెలిసింది!

—దత్త.

—(0)—

# ఉపయుక్త గ్రంథ సూచిక (మరాఠీ)


1. దత్తా కవితలు (దత్తాచీ కవితా)

—సంపాదకులు వి. డె. ఘాటె

2. కొత్త పుట (నవే పాన్)

—సంపాదకులు ఆచార్య డా॥ ఎం. జి. దేశముఖ్

3. ఆధునిక మరాఠి కవిత (అర్వాచీన్ మరాఠీ కావ్య)

—ఆచార్య ఆర్. ఎస్. జోగ్

4. ఆధునిక మరాఠీ కవిత

—ఆచార్య బి. ఎస్. పండిత్

5. ఆధునిక మరాఠీ కవితలోని అంతర్ ప్రవాహాలు

(ఆధునిక మరాఠీ కావ్యాతీల్ అంతః ప్రవాహ్)

—ఆచార్య వి. బి. పాఠక్

6. ఆధునిక మరాఠీ సాహిత్య చరిత్ర సంపుటి - 1.

(ఆధునిక మరాఠీ వాఙ్మయాచీ ఇతిహాస్)

—డా॥ ఏ. ఎన్. దేశపాండే

7. ఆధునిక మరాఠీ కవిత మార్గదర్శకులు - సంపుటి - 1.

(ఆధునిక మరాఠీ కావ్యచే ప్రణేతే)

—ఆచార్య బి. ఎస్. పండిత్

8. ఆ రోజులు అలా ఉండేవి (దివస్ అసే హోతే) ఒక ఆత్మ చరిత్ర

—వి. డి. ఘాటె.



Indian Institute of Advanced Study
117657
17.12.04
SHIMLA

దత్తాత్రేయ కొండోఘూటె 'దత్తకవి' [1875-1899] తరుణ వయస్సులో, అంటే తన 24 వ ఏటనే మరణించినాడు. అందుకని సంఖ్యనుబట్టి చాల కొద్దిగా రాయ కలిగినాడు. ఆయనది సహజమూ గాఢమూ అయిన సౌందర్య పిపాసతో తొణకిలసలాడే గేయకవితా ధోరణి, దీనికి తోడు, వ్యక్తిత్వాల ద్వారాఆత్మ వివరణ ఆయనకు పుట్టుకతో వచ్చిన అధునాతన వల్ల కలిగింది.

ఈ పుస్తకాన్ని రచించిన డా॥ అనురాథాపొత్దార్ దత్త ఈ కవికి మనుమరాలు. ఆమె తన తాతగారి జీవిత వృత్తాంతాన్ని చాల ప్రయాసపడి చిత్రించి ఆయన సాహిత్య కృషిని తులనాత్మకంగా దర్శింపచేసినందు వల్లనే, మనం కవిని; ఆయన జీవితం ద్వారా ఆయన రచనల ద్వారా అర్థం చేసుకో కలుగుతున్నాము.

అట్టలోపలి వైపున అచ్చు వేసిన శిల్పచిత్రంలో కన బడేది శుద్ధోదన మహారాజుకు గౌతమబుద్ధుని తల్లియైన మహారాణీ మాయాదేవి కన్న స్వప్నం గురించి జ్యోతిషి కులు వ్యాఖ్యచేస్తూ ఉండిన దృశ్యం. వారికి దిగువ వారి వ్యాఖ్యను వ్రాసుకొంటున్న లేఖకుడు కనిపిస్తాడు. భారత దేశంలో లేఖన కళ చిత్రశిల్పంలో నిబద్ధమై లభించే దృష్టాంతాలలో ఇదే ప్రాచీన తమమైనది. నాగార్జున కొండ క్రీ. శ. 2 వ శతాబ్దం. జాతీయ పురావస్తు ప్రదర్శనశాల, న్యూఢిల్లీ, వారి సౌజన్యతో.

ముఖపత్ర విన్యాసం : సత్యజిత్ రాయ్

రేఖాచిత్రం : సి. ఎం. రుద్రా

AKADEMI
Library IIAS, Shimla
TL 891.461 D 262 P
00117657